


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 98 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ బుధవారం 18 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 98 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD WED 18 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## శానిటేషన్ బాగా లేకుంటే
# సస్పెండ్ చేస్తా

- అధికారుల తీరుపై రేవంత్ అసంతృప్తి.. సస్పెండ్ చేస్తానని వార్నింగ్
- పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖపై రేవంత్ సమీక్ష
- కమిషనర్లు, జోనల్ కమిషనర్లు ఉదయం నుంచి ఫీల్డ్‌లో ఉండాలని ఆదేశం
- అడ్వర్టైజింగ్ బోర్డుల నియంత్రణపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచన



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో పురపాలక శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలోకి వెళ్లకపోవడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయంలో ఈరోజు నిర్వహించిన పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖపై సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "కమిషనర్లు, జోనల్ కమిషనర్లు ఉదయం నుంచి ఫీల్డ్‌లో ఉండాలి. పారిశుధ్యం, రోడ్ల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి. రోడ్లు శుభ్రంగా లేకపోతే అక్కడిక్కడే అధికారులను సస్పెండ్ చేస్తాను" అని హెచ్చరించారు. నూతనంగా ఎన్నికైన మేయర్లు, డిప్యూటీ మేయర్లు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లకు ఒక రోజు శిక్షణ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ సెక్రటరీ మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి అధికారులకు కీలక సూచనలు చేశారు. నగరంలో స్మార్ట్ పోల్స్ ఏర్పాటుపై అధ్యయనం చేయాలని ఆయన సూచించారు. ట్రాఫిక్ బాగా ఉన్న చోట్ల పీపీపీ విధానంలో స్కైవాక్ బ్రిడ్జిలు నిర్మించాలని చెప్పారు. నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో మల్టీలెవల్ కార్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అడ్వర్టైజింగ్ బోర్డుల నియంత్రణపై జాగ్రత్తలు తీసుకోవాలని... ప్రభుత్వ కార్యక్రమాలకు 10 శాతం బోర్డులు కేటాయించాలని అన్నారు. అనధికార బోర్డులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అడ్వర్టైజింగ్ బోర్డుల నుంచి సంవత్సరానికి ఒకసారి ఫీజు వసూలు చేయాలని సూచించారు. అన్ని పార్కుల వివరాలు సేకరించాలన్నారు.



ప్రపంచ తొలి ట్రిలియనీర్‌గా
## ఎలాన్ మస్క్!

- రికార్డుకు చేరువైన అపర కుబేరుడు
- స్పేస్ ఎక్స్ అధినేత ప్రస్తుత ఆస్తులు 850 బిలియన్ డాలర్లు
- 'స్పేస్ ఎక్స్ - ఎక్స్ ఏఐ' డీల్ కుదిరితే భారీగా పెరగనున్న మస్క్ సంపద

- మిగతా 2లో



## ఐఏఎస్ శ్రీలక్ష్మికి భారీ షాక్ ఇచ్చిన సుప్రీం

- ఓఎంసీ కేసులో విచారణకు గ్రీన్ సిగ్నల్!
- డిశ్చార్జ్ పిటిషన్‌ను తోసిపుచ్చిన కోర్టు
- పొరపాటును సవరిస్తున్నామంటూ కోర్టు వ్యాఖ్య

- మిగతా 2లో



కేసీఆర్‌ది ఏ జాతి అంటావా..
# ఇదే మా జాతి
## రేవంత్ రెడ్డిపై కేటీఆర్ నిప్పులు

- కేసీఆర్‌ది ఏ జాతి, జాతిపిత ఎలా అవుతారని ఇటీవల రేవంత్ రెడ్డి వ్యాఖ్య
- మాది రాణీ రుద్రమ, సమ్మక్క-సారక్కల జాతి అన్న కేటీఆర్
- సమైక్యాంధ్ర సంచులు మోసిన వారికి జాతి గురించి ఏం తెలుస్తుందని ప్రశ్న

**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఉద్దేశించి కొంతమంది విమర్శలు గుప్పిస్తున్నారని, ఆయన ఏ జాతికి జాతిపిత అని ఎద్దేవా చేస్తున్నారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమది రాణీ రుద్రమ, సమ్మక్క సారక్క, దొడ్డి కొమురయ్య వంటి తెలంగాణ మహాపురుషుల జాతి అని ఆయన అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేసీఆర్ పుట్టిన రోజు శుభాకాంక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, తాము ప్రతిపక్షంలోకి వచ్చాక కేసీఆర్‌ను తూలనాడుతూ కొంతమంది వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ జాతి గురించి అడుగుతున్నారని, కానీ తెలంగాణ మట్టితో మమేకమైన వారికి, ఉద్యమాల ఉగ్గుపాలు తాగిన వారికి, ఆత్మగౌరవ పోరాటంలో కలిసి నడిచిన వారికి మాత్రమే జాతి అంటే ఏమిటో తెలుస్తుందని అన్నారు. కానీ సమైక్యాంధ్ర సంచులు మోసిన వారికి జాతి గురించి ఏం తెలుస్తుందని అన్నారు.

- మిగతా 2లో

ముస్లిం ఉద్యోగులకు
## వెసులుబాటు..
తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు



**హైదరాబాద్ పెన్ పవర్:**ఫిబ్రవరి 19 నుంచి రంజాన్ మాసం మొదలవుతున్నందు వల్ల.. ముస్లిం ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. రంజాన్ మాసం మొత్తం సాయంత్రం 4 గంటలకు ఆఫీస్?ల నుంచి వెళ్లిపోవచ్చని తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.మార్చి 20న రంజాన్ పర్వదినం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఈ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ముస్లిం ఉద్యోగులు, టీచర్లు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, బోర్డ్స్, కార్పొరేషన్స్, పబ్లిక్ సెక్టార్ ఎంప్లాయిస్ ఫిబ్రవరి 19 నుంచి మార్చి 20 వరకూ సాయంత్రం 4 గంటలకే ఆఫీస్?ల నుంచి, స్కూళ్ల నుంచి

- మిగతా 2లో



## ఆ రెండు పార్టీలు తెలంగాణ వ్యతిరేక టీమ్

- కాంగ్రెస్, బీజేపీలపై హరీశ్ రావు ఫైర్
- జెండాలు, అజెండాలు పక్కనపెట్టి దిగజారుడు రాజకీయాలు చేశారని విమర్శ
- కల్వకుంట్ల కుటుంబాన్ని రేవంత్ కాపాడుతున్నారని విమర్శ

**హైదరాబాద్ పెన్ పవర్:**కాంగ్రెస్, బీజేపీలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు కోసం జెండాలు, అజెండాలు పక్కనపెట్టి దిగజారుడు రాజకీయాలు చేశారని విమర్శించారు. బీజేపీకి బీఆర్ఎస్ పార్టీ బీటీమ్ అంటూ కాంగ్రెస్... కాంగ్రెస్ కు బీఆర్ఎస్ బీటీమ్ అంటూ బీజేపీ.... గత 12 ఏళ్లుగా చేసిన ప్రచారమంతా తప్పుడు ప్రచారమేనని

- మిగతా 2లో

## మా మహిళా కౌన్సిలర్ల పట్ల దుశ్శాసన పర్వం..

నేడు సీపీఐతో కలిసి క్యాతనపల్లి బంద్‌కు పిలుపు

కాంగ్రెస్ కౌన్సిలర్లు తమ సోదరీమణుల మీద దౌర్జన్యం చేశారని ఆగ్రహం

మంత్రి, ఎంపీ దగ్గరుండి చేయించారని బాల్క సుమన్ మండిపాటు

తమ మహిళా కౌన్సిలర్ల కంటే ఛైర్మన్ పదవి ఎక్కువ కాదన్న బాల్క సుమన్



**హైదరాబాద్ పెన్ పవర్:** కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంత మంది కౌన్సిలర్లు తాగి వచ్చి తమ మహిళా కౌన్సిలర్ సోదరీ మణులను తాకరాని చోట తాకారని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు బాల్క సుమన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మంత్రి వివేక్, ఎంపీ వంశీ అక్కడ కూర్చుని మా సోదరీమణుల మీద దౌర్జన్యం చేయిస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఇంట్లో ఆడకూతుళ్లు లేరా నిలదీశారు. తాను రౌడీయిజం చేయలేదని, మంత్రి, ఎంపీలే రౌడీయిజం చేశారని ఆరోపించారు. మంత్రి, ఎంపీ తీరుకు నిరసనగా బీఆర్ఎస్, సీపీఐ కలిసి క్యాతనపల్లి మున్సిపాలిటీ బంద్‌కు

- మిగతా 2లో



హైదరాబాదులో అక్రమంగా
## నివసిస్తున్న 23 మంది విదేశీయుల అరెస్ట్

- హైదరాబాద్ టోలిచౌకిలో పోలీసుల భారీ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్
- వీసా గడువు ముగిసి అక్రమంగా నివసిస్తున్న 23 మంది విదేశీయుల అరెస్ట్
- 250 మంది పోలీసులతో పారామౌంట్ కాలనీ, ఐఏఎస్ కాలనీలో సోదాలు
- పత్రాలు లేని 30 బైక్‌లు, అక్రమ మద్యం, గ్యాస్ సిలిండర్లు స్వాధీనం
- నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించిన పోలీసులు

- మిగతా 2లో

'ఐబొమ్మ' రవికి బెయిల్ మంజూరు...
## కోర్టు షరతులు ఇవే!

- ఐబొమ్మ పైరసీ కేసులో ప్రధాన నిందితుడు రవికి బెయిల్
- షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసిన నాంపల్లి కోర్టు
- పాస్‌పోర్ట్ స్వాధీనం చేయాలని, దేశం విడవొద్దని ఆదేశం
- ఇంటర్నెట్ వినియోగించాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరి
- గతంలో రవి బెయిల్ పిటిషన్లను తిరస్కరించిన కోర్టులు - 2లో






బంగ్లాదేశ్‌కు 35 ఏళ్ల తర్వాత పురుష ప్రధాని...
## ప్రమాణస్వీకారం చేసిన తారిక్ రెహమాన్

- బంగ్లాదేశ్ 11వ ప్రధానిగా తారిక్ రెహమాన్ ప్రమాణ స్వీకారం
- రాజ్యాంగ సంస్కరణల మండలి ప్రమాణంపై బీఎన్‌పీ ఎంపీల నిరాకరణ
- ఎంపీలతో తొలిసారిగా ప్రమాణం చేయించిన ప్రధాన ఎన్నికల కమిషనర్
- నూతన ప్రభుత్వం ముందు ఇస్లామిక్ తీవ్రవాదాన్ని అరికట్టే సవాలు

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

## గిగ్ వ్యవస్థ ఉపాధికి పరిష్కారమేనా..?

భారతదేశంలో ఆర్థిక సంస్కరణల పేరుతో అమలు చేసిన ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలు ఉపాధి రంగంపై గణనీయమైన ప్రభావం చూపించాయి. ముఖ్యంగా ఓలా, ఉబర్, రాపిడో వంటి యాప్ ఆధారిత సంస్థల విస్తరణతో గిగ్ ఆర్థిక వ్యవస్థ వేగంగా పెరిగింది. ఈ నేపథ్యంలో గిగ్ ఆర్థిక వ్యవస్థ వాస్తవంగా ఉపాధి పరిష్కారమా? లేక నిరుద్యోగానికి కొత్త రూపమా? అనే ప్రశ్న మరింత ప్రాముఖ్యత సంతరించుకుంది. ఒకప్పుడు ప్రభుత్వ రంగ సంస్థలు, స్థిర ఉద్యోగాలు ప్రధాన ఆధారంగా ఉండగా, ఇప్పుడు అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, గిగ్ విధానాలు సాధారణమయ్యాయి. ప్రస్తుతం ఒక కారు, ఆటో కూడా కొనని సొంత డ్రైవర్లు లేని యాప్ సంస్థలు దేశవ్యాప్తంగా ఎలాంటి రక్షణ, హక్కులు లేని కోట్లాదిమంది గిగ్ కార్మికులను నియమించుకొని నిలువు దోపిడీ చేస్తున్నాయి. విద్య, వైద్యాన్ని మాత్రమే కాదు ఉద్యోగాలను కూడా ప్రైవేట్ పరం చేసి అన్ని విభాగాలను అవుట్ సోర్స్ కూలీలతో నింపుతున్న ఆర్థిక వ్యవస్థ మనది. ఉపాధిలో, అభివృద్ధిలో, పరిపాలనలో మానవ వనరుల భాగస్వామ్యమే ఉద్యోగం. మన దేశ జనాభాలో 28 సంవత్సరాల లోపల ఉన్న యువత 50%గా ఉన్నది. స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా నివేదిక 2023 ప్రకారం, 25 సంవత్సరాల లోపల ఉన్న పట్టభద్రులు 42.3%. 20-24 ఏళ్ల వయస్సు వారిలో 63% నిరుద్యోగులు ఉన్నారని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ తెలియజేస్తున్నది. 2022లో ప్రభుత్వ విభా గాలలో 9,64,359 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని పార్లమెంట్‌లో ఒక ప్రశ్నకు సమాధానం ఇవ్వడం జరిగింది. దీనిని బట్టి దేశంలో యువత ఏ పని దొరకక దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారని తెలుస్తున్నది. దేశ భవిష్యత్తు యువశక్తిపై ఆధారపడి ఉంటుంది. వారు నిరుద్యోగంతో, నిరాశతో ఉండకూడదు.

సాధారణంగా మన ఆర్థిక శాస్త్రవేత్తలు, రాజకీయ నాయకులు, దేశ ఆర్థిక వ్యవస్థను స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) పరంగా అంచనా వేస్తారు.. శ్రామికశక్తిని, వారి ఉపాధి ఆదాయాలను ఆధారంగా చేసుకుని ఆర్థిక వ్యవస్థను అంచనా వేయరు.. అందుకే దేశ ఆర్థిక వ్యవస్థ ఎంత పెద్దదైనా తగినంత స్థాయిలో ఉద్యోగాలు పెరగటం లేదు.. శ్రామికులు చాలావరకు గిగ్ వర్కర్స్‌గా పనిచేస్తున్నారు. ప్రజల శ్రామిక శక్తిని తెలియజేసే గిగ్ ఎకానమీ వీరిని కార్పొరేట్ కంపెనీలు ఇంటర్నల్ శ్రామిక శక్తిగా ఉపయోగిస్తారు. ప్రజల నుండి వచ్చిన వస్తు సేవల డిమాండుకు తగిన ఉత్పత్తిని పంపిణీ చేసేందుకు ఈ గిగ్ కార్మికులను వినియోగించుకుంటారు.. బీబీసీ ప్రకారం, శాశ్వత ఉద్యోగాలకు విరుద్ధంగా స్వల్పకాలిక ఒప్పందాలతో పనిచేసే కార్మికులను గిగ్ శ్రామికులంటారు.. వారు చేసే పనిని బట్టి ఈ కార్మికులకు చెల్లింపులు ఉంటాయి. అయితే వీరికి నిర్దిష్టమైన కాలంగానీ, స్థలంగానీ ఉండదు.. అలాగే ఉద్యోగ భద్రతకూడా ఉండదు.. అంతా ఒక స్వేచ్ఛా మార్కెట్ వ్యవస్థ. అటు ఇటు అందరూ స్వతంత్రులే.. అంతా అనిశ్చితమే. మన దేశంలో యువతకు ఇదే తాత్కాలిక జీవనాధారంగా ఉన్నది. గిగ్ కార్మిక వ్యవస్థ నిరుద్యోగానికి మారుపేరు.

1991 నుంచి సరళీకృత ఆర్థిక విధానాలు చేపట్టిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేట్ పరం చేస్తున్నారు. 1951లో కేవలం ప్రభుత్వ రంగ సంస్థల్లో ఐదు పరిశ్రమలతో ప్రారంభమైన మన పారిశ్రామికీకరణ 1956లో 17 మౌలికమైన కీలకమైన పరిశ్రమలకు పెరిగింది. దేశ పారిశ్రామిక అభివృద్ధికి ఉపయోగపడే విధంగా వీటిని నెలకొల్పారు.. 2021 నాటికి ఈ ప్రభుత్వ రంగ సంస్థలు 365కు చేరాయి.. అయితే ఆ మేరకు ఉద్యోగాలు పెరగటం లేదు. 2013లో కేంద్ర ప్రభుత్వం చేసిన సర్వేలో 17.3 లక్షల ఉద్యోగాలు ఉండగా 2022 నాటికి ఈ సంస్థలో ఉద్యోగాలు 10 లక్షలకు తగ్గిపోయాయి. అందులోను కాంట్రాక్ట్ కార్మికులుగా 43 శాతం మందికి నియామకాలు జరిగాయి. ఇలా దేశంలో మెల్లగా ప్రవేట్ రంగం విస్తరించి కార్పొట్ రంగం పునాదులు బలంగా ఏర్పడడంతో ఉద్యోగ కల్పన లేక నిరుద్యోగులు గిగ్ వర్కర్స్‌గా జీవనం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గిగ్ ఎకానమీ పెరిగిపోయిన నేపథ్యంలో.. ఉపాధి అవకాశాలు, జీతభత్యాలు పర్మనెం ట్‌గా లభించకపోవటంతో వాటికి చట్టబద్ధత కూడా లేకపోవటంతో ఇక్కడ పని చేసుకుంటే ఏముంది? అనే నిరాశా వాదంతో యువత వలసబాట పడుతున్నారు.. అభివృద్ధి అంటే అందరి వృద్ధి అంతేగాని కొందరి వృద్ధి కాదని గాంధీజీ అన్నారు. దేశపు ఆదాయం ఎంత అనేది ముఖ్యం కాదు, ప్రజలకు కనీస అవసరాలు.. తిండి, వసతి, విద్య, వైద్యం ఏ మేరకు అందుతున్నాయన్నది ముఖ్యం. కార్మికుల ఉద్యోగ భద్రత ముఖ్యం.

## ఐఏఎస్ శ్రీలక్ష్మికి భారీ షాక్ ఇచ్చిన సుప్రీం

ఓబుళాపురం మైనింగ్ కంపెనీ(ఓఎంసీ) అక్రమ మైనింగ్ కేసులో సీనియర్ ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసు నుంచి తనను విముక్తి చేయాలని ఆమె దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. గతంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ, విచారణను ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేసింది.

**సీబీఐ కీలక వాదనలు**

ఈ కేసులో శ్రీలక్ష్మి పాత్రపై సీబీఐ కోర్టులో బలమైన వాదనలు వినిపించింది. మైనింగ్ నిబంధనల్లోని 'క్యాప్టివ్ మైనింగ్' అనే పదాన్ని ఉద్దేశపూర్వకంగా తొలగించి, అక్రమాలకు దారులు తెరిచారని సీబీఐ ఆరోపించింది. ఈ అక్రమ వ్యవహారంలో శ్రీలక్ష్మి కీలక పాత్ర పోషించారని, ఆ సమయంలోనే ఆమె మరిది భారీగా అక్రమాస్తులు కూడబెట్టుకున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లింది.

**పొరపాటును సవరిస్తున్నాం..**

ఈ కేసును విచారించిన జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. "గతంలో ఈ కేసును వేరే కేసుగా భావించి పొరపాటున స్టే ఇచ్చాము. ఇప్పుడు ఆ పొరపాటును సవరిస్తున్నాము. నిందితులు ఆ స్టేను ఇప్పటివరకు ఎంజాయ్ చేశారు" అని ధర్మాసనం పేర్కొంది. దీంతో, శ్రీలక్ష్మి ఇప్పుడు తప్పనిసరిగా కోర్టు విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుందని న్యాయ వర్గాలు చెబుతున్నాయి.

# కేసీఆర్‌ది ఏ జాతి అంటావా.. ఇదే మా జాతి

- మొదటి పేజి తరువాయి

ఇటీవల ఓ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్‌ది ఏ జాతి, ఎవరికి జాతిపిత అంటూ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. తెలంగాణలో తెలంగాణ వాదుల జాతి, తెలంగాణ ద్రోహుల జాతులు ఉన్నాయని అన్నారు."సమైక్యాంధ్రవాదుల సంచులు మోసే సన్నాసులకు జాతి తెలియదు. నీతి తెలియదు. లాఠీ దెబ్బలు తిన్నవారికి, జైళ్లకు వెళ్లిన వారికి, తుపాకీలకు ఎదురొడ్డి నిలబడ్డ వారికి జాతి అంటే, జాతి అస్థిత్వం అంటే ఏమిటో తెలుసు. ఉద్యమకారుల పైకి తుపాకులు తీసుకెళ్లిన ద్రోహులకు జాతి నిర్వచనం ఎలా తెలుస్తుంది. రక్తంలో పౌరుషం ఉంటే, డీఎన్ఏలో ఉద్యమం ఉంటే ఆత్మాభిమానం అనేది ఎక్కడైనా నీ శరీరంలో ఉంటే నీకు జాతి అంటే ఏమిటో, జాతి చరిత్ర అంటే ఏమిటో తెలుస్తుంది. కానీ జై తెలంగాణ నినాదం ఇవ్వడానికే భయపడేవారికి, తెలంగాణ సోయిలేని సన్నాసులకు జాతి విలువ ఎన్నటికీ తెలియదు" అని కేటీఆర్ ధ్వజమెత్తారు."కొందరు అడుగుతున్నారు నీది ఏ జాతి అని. ఏ జాతికి జాతి పిత అని అడుగుతున్నారు. వారికి నేను సమాధానం చెబుతున్నాను. ఏ జాతి అనే అల్పుడికి నేను చెబుతున్నాను. రాజ్యతంత్రం నడిపిన రుద్రమ జాతి మాది. జల్ జంగల్ జమీన్ అని కొట్లాడిన కొమురంభీం, అస్తిత్వం కోసం అమరులైన సమ్మక్క, సారక్క, కోటల మీద జెండా ఎగురవేసిన బహుజన వీరుడు సర్దార్ సర్వాయిపాపన్న, భూస్వాముల దోపిడి మీద

కొట్లాడిన దొడ్డి కొమురయ్య, బరిలో బందూకు పట్టి దేశ్‌ముఖ్‌లను తరిమికొట్టిన వీరనారి చాకలి ఐలమ్మ, సామాజిక విప్లవకారుడు భాగ్యరెడ్డి వర్మ, సిపాయిల తిరుగుబాటు బావుటా ఎగురవేసిన తుర్రేబాజ్ ఖాన్, ప్రాంతం వాడు మోసం చేస్తే ప్రాంతంలోనే ఉప్పుపాతర వేస్తామన్న కాళోజీ, నా తెలంగాణ కోటి రతనాల అన్న దాశరథి, విద్యార్థి అమరవీరుల జాతి మాది" అని కేటీఆర్ ఉద్ఘాటించారు.

# మా మహిళా కౌన్సిలర్ల పట్ల దుశ్శాసన పర్వం..

- మొదటి పేజి తరువాయి

పిలుపునిస్తున్నామని అన్నారు.క్యాతనపల్లి మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక వాయిదా పడిన నేపథ్యంలో బాల్క సుమన్ సీపీఐ నాయకులు, కౌన్సిలర్లతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఒక మున్సిపల్ ఛైర్మన్ పదవి కోసం ఇంత దుర్మార్గంగా వ్యవహరిస్తారా, సిగ్గుండాలని ఆగ్రహం వ్యక్తం చేశారు.మీరు విజ్ఞప్తి చేస్తే ఛైర్మన్ పదవిని కాంగ్రెస్ పార్టీకి ఇచ్చేందుకు సిద్ధమే అన్నారు. తమ ఆడకూతుళ్ల కంటే మున్సిపల్ ఛైర్మన్ పదవి తమకు ఎక్కువ ఏమీ కాదని అన్నారు. వివేక్ కుటుంబం ఎన్ని పదవులు అనుభవించింది, ఈ ప్రాంతంలో వారికి ఎంత గౌరవం ఉంది, కానీ ఇప్పుడు ఇంత దిగజారి ప్రవర్తించడమేమిటని ధ్వజమెత్తారు. ఇంత అనైతిక చర్యలకు పాల్పడమేమిటని ప్రశ్నించారు. రేపు బంద్‌కు అందరూ మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు

**పోలీసులపై ఆగ్రహం**

పోలీసుల తీరుపై బాల్క సుమన్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల్లా ప్రవర్తించారని ఆరోపించారు. ఇక ఖాకీ దుస్తులు అవసరం లేదు, కాంగ్రెస్ రంగు దుస్తులు వేసుకుని, రేవంత్ రెడ్డి పాటలు పెట్టుకుని డ్యాన్స్ చేసుకోండని వ్యాఖ్యలు చేశారు. తమపై ఎన్ని కేసులు పెట్టుకుంటారో పెట్టుకోవాలని అన్నారు. ప్రజల పక్షాన, సింగరేణి కార్మికుల పక్షాన, రైతుల పక్షాన ప్రతిపక్ష నాయకుడిగా తాను పోరాటం చేస్తానని అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో 22 వార్డులు ఉండగా, బీఆర్ఎస్ 10, కాంగ్రెస్ 7, సీపీఐ 4, స్వతంత్రులు ఒక స్థానాన్ని గెలుచుకున్నారు. అయితే రెండు ఎక్స్ అఫీషియో సభ్యులు, స్వతంత్ర అభ్యర్థి మద్దతుతో కాంగ్రెస్ బలం 10కి చేరుకుంది. దీంతో క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నిక ఉత్కంఠగా మారింది. అయితే ఉద్రిక్తతల నేపథ్యంలో కోరం లేదని చెబుతూ క్యాతనపల్లి మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికను అధికారులు వాయిదా వేశారు.

# ముస్లిం ఉద్యోగులకు వెసులుబాటు..

- మొదటి పేజి తరువాయి

వెళ్లిపోవచ్చని తెలంగాణ ప్రభుత్వం సర్క్యులర్?లో తెలిపింది. రంజాన్ మాసంలో అత్యంత నియమనిష్టలతో ఉపవాస దీక్షలతో గడిపే ముస్లింలు రాత్రింబవళ్లూ నమాజ్‌లో లీనమై ఉంటారు. సాధారణంగా ముస్లింలు రోజూ ఐదుసార్లు నమాజ్ చేస్తుంటారు. వీటికి తోడు రంజాన్ నెలలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ముప్పై రోజుల దీక్షలను మూడు భాగాలుగా విభజించారు. మొదటి10 రోజుల్లో దీక్షలు పాటిస్తే అల్లా కరుణ వర్షాన్ని కురిపిస్తాడని,11 నుంచి 20 రోజులు దీక్షలు పాటిస్తే పాపాలను హరిస్తాడని, 21వ రోజు నుంచి దీక్షలను పూర్తి చేస్తే నరకం నుంచి విముక్తి లభిస్తుందని ముస్లింలు నమ్ముతారు. 21వ రోజు నుంచి చివరి రోజు వరకు ఒక ప్రత్యేకత ఉంది. దీన్ని ఎతేకాఫ్ అంటారు. ఇది ఒక రకమైన తపోనిష్ఠ. దీనిని పాటించాలి అనుకునేవాళ్లు మసీదులోనే ఒక పక్క తెర కట్టుకుని అక్కడే దైవ ధ్యానం, ప్రార్థనలు, ఖురాన్ పారాయణం చేస్తారు. ఎతేకాఫ్‌లో ఉన్నవాళ్లు బలమైన కారణం ఉంటే తప్ప మసీదు వదిలి బయటకు వెళ్లకూడదు. 30 రోజుల ఉపవాస దీక్ష తర్వాత రంజాన్ పండుగ చేసుకుంటారు. ఉపవాసంతో పాటు దైవారాధన, దానధర్మాలు చేస్తారు. ఉపవాసం చేసేటప్పుడు అబద్ధం చెప్పకూడదు. అన్యాయం చేయకూడదు. ఉపవాస దీక్ష మనిషిలో త్యాగం, కరుణ, సానుభూతి, ప్రేమను పెంచుతుంది.

# ప్రపంచ తొలి ట్రిలియనీర్‌గా ఎలాన్ మస్క్!

టెక్ దిగ్గజం, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సరికొత్త చరిత్ర సృష్టించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రపంచంలోనే అత్యంత సంపన్న వ్యక్తిగా ఉన్న ఆయన, అతి త్వరలోనే 'తొలి ట్రిలియనీర్' హోదాను దక్కించుకోనున్నారని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది ముగిసేలోపే మస్క్ ఈ మైలురాయిని చేరుకునే అవకాశం ఉంది.

**సంపదలో అగ్రస్థానం..**

ప్రస్తుతం మస్క్ నికర ఆస్తుల విలువ 850 బిలియన్ డాలర్లకు చేరింది. ఫిబ్రవరి నాటికి 800 బిలియన్ డాలర్ల మార్కును దాటిన తొలి వ్యక్తిగా ఆయన రికార్డు సృష్టించారు. మస్క్ సంపద ఏ స్థాయిలో ఉందంటే.. ప్రపంచంలోని మరో ముగ్గురు అగ్రశ్రేణి కుబేరుల మొత్తం సంపద కంటే ఇది ఎక్కువ. లారీ పేజ్ (గూగుల్): 251 బిలియన్ డాలర్లు, సెర్గీ బ్రిన్ (గూగుల్): 231 బిలియన్ డాలర్లు, మార్క్ జుకర్‌బర్గ్ (మెటా): 219 బిలియన్ డాలర్లు.. ఈ ముగ్గురి మొత్తం సంపద 701 బిలియన్ డాలర్లు కాగా మస్క్ ఒక్కరి సంపదే 850 బిలియన్ డాలర్లు కావడం విశేషం.

**ట్రిలియన్ మార్కుకు చేర్చే 'స్పేస్ ఎక్స్ -- ఎక్స్ ఏఐ' డీల్**

మస్క్ సంపద ఇంత వేగంగా పెరగడానికి ఇటీవల జరిగిన ఒక భారీ ఒప్పందమే

ప్రధాన కారణం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ ఎక్స్ ఏఐని స్పేస్ ఎక్స్ 1.25 ట్రిలియన్ డాలర్లతో కొనుగోలు చేసింది. విలీనమైన ఈ కొత్త సంస్థలో మస్క్‌కు 43 శాతం వాటా ఉంది. దీని విలువ సుమారు 530 బిలియన్ డాలర్లు కావడం గమనార్హం.

**మస్క్ ఆస్తుల విభజన**

స్పేస్ ఎక్స్/ ఎక్స్ ఏఐ వాటా: 530 బిలియన్ డాలర్లు

టెస్లా వాటా(12%): 178 బిలియన్ డాలర్లు

**త్వరలో 1.5 ట్రిలియన్ డాలర్లకు..**

ఈ ఏడాది మస్క్ ట్రిలియనీర్‌గా మారే అవకాశం 75 శాతం ఉందని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. దీనికి అదనంగా త్వరలోనే స్పేస్ ఎక్స్ సంస్థ ఐపీఓ ద్వారా సుమారు 25 బిలియన్ డాలర్లను సమీకరించాలని భావిస్తోంది. ఈ ప్రక్రియ విజయవంతమైతే, మస్క్ నికర విలువ ఏకంగా 1.5 ట్రిలియన్ డాలర్లకు పెరిగే అవకాశం ఉంది.

# 'ఐబొమ్మ' రవికి బెయిల్ మంజూరు... కోర్టు షరతులు ఇవే!

సినిమా పైరసీ కేసులో సంచలనం సృష్టించిన 'ఐబొమ్మ' వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమంది రవికి ఎట్టకేలకు ఊరట లభించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న అతనికి హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టు మంగళవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. గత ఏడాది నవంబర్‌లో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు రవిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

దక్షిణ భారత సినిమాలు, ఓటీటీ కంటెంట్‌ను అక్రమంగా అప్‌లోడ్ చేస్తూ సినీ పరిశ్రమకు వేల కోట్ల రూపాయల నష్టం కలిగించాడనే ఆరోపణలతో రవిపై ఐదు కేసులు నమోదయ్యాయి. ఈ కేసులో అరెస్టయిన నాటి నుంచి రవి జైల్లోనే ఉన్నాడు. గతంలో అతని బెయిల్ పిటిషన్లను నాంపల్లి కోర్టు, హైకోర్టు తిరస్కరించాయి. తాజాగా మరోసారి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, కఠిన షరతులతో బెయిల్‌కు అంగీకరించింది.

**కోర్టు విధించిన షరతులు**

పాస్‌పోర్ట్‌ను కోర్టుకు సరెండర్ చేయాలి. ప్రతిరోజూ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసుల ముందు హాజరు కావాలి. కోర్టు అనుమతి లేకుండా

దేశం విడిచి వెళ్లరాదు. ఇంటర్నెట్ వినియోగించాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.ఈ నిబంధనలకు కట్టుబడి ఉండాలన్న ఆదేశాలతో రవి జైలు నుంచి బయటకు వచ్చేందుకు మార్గం సుగమమైంది. ఐబొమ్మ సైట్ వల్ల కొత్త సినిమాలు విడుదలైన గంటల్లోనే పైరసీకి గురవుతుండటంతో చిత్ర పరిశ్రమ తీవ్రంగా నష్టపోయింది. ఈ నేపథ్యంలో రవికి బెయిల్ లభించడం కేసులో కీలక పరిణామంగా మారింది.

# ఆ రెండు పార్టీలు తెలంగాణ వ్యతిరేక టీమ్

- మొదటి పేజి తరువాయి

తేలిపోయిందని అన్నారు. ఆ రెండు పార్టీలు తెలంగాణ వ్యతిరేక టీమ్ అని తేలిపోయిందని చెప్పారు. "మార్పు అంటే బీజేపీతో కలవడమా? ఇదేనా మీరు తెస్తానన్న మార్పు?" అని సీఎం రేవంత్ రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. ఢిల్లీలో కొట్టుకున్నట్టు నటిస్తూ... గల్లీలో చేతులు కలుపుకుని వాటాలు పంచుకుంటున్నారని ఆరోపించారు. సిర్పూర్ కాగజ్ నగర్, మెట్ పల్లి, అమన్ గల్, అలియాబాద్, నర్సాపూర్ ఫలితాలే దీనికి సాక్ష్యమని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో ఉన్న బలాన్ని చూసి భయపడే ఈ రెండు పార్టీలు సిద్ధాంతాలకు తిలోదకాలిచ్చి కుట్రలకు తెరలేపాయని, రాబోయే రోజుల్లో ప్రజలే వీళ్లకు బుద్ధి చెబుతారని హరీశ్ రావు గట్టిగా చెప్పుకొచ్చారు.

# బంగ్లాదేశ్‌కు 35 ఏళ్ల తర్వాత పురుష ప్రధాని... ప్రమాణస్వీకారం చేసిన తారిక్ రెహమాన్

బంగ్లాదేశ్‌లో కొత్త రాజకీయ అధ్యాయం మొదలైంది. దేశ 11వ ప్రధానమంత్రిగా బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఛైర్మన్ తారిక్ రెహ్మాన్ మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల జరిగిన 13వ పార్లమెంటరీ ఎన్నికల్లో బీఎన్‌పీ ఘన విజయం సాధించడంతో ఆయన ప్రధాని పీఠాన్ని అధిష్ఠించారు. దాదాపు 35 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత బంగ్లాదేశ్‌కు ఒక పురుషుడు ప్రధాని కావడం విశేషం.ఢాకాలోని జాతీయ పార్లమెంట్ సౌత్ ప్లాజాలో జరిగిన కార్యక్రమంలో బంగ్లాదేశ్ అధ్యక్షుడు మహమ్మద్ షహబుద్దీన్, తారిక్ రెహ్మాన్‌తో ప్రమాణం చేయించారు. ఆయనతో పాటు 50 మంది సభ్యుల మంత్రివర్గం కూడా ప్రమాణం చేసింది. ఈ కేబినెట్‌లో 25 మంది మంత్రులు, 24 మంది సహాయ మంత్రులు, ముగ్గురు టెక్నోక్రాట్‌లు ఉన్నారు. తొలిసారి ఎన్నికైన వారితో పాటు పలువురు కొత్త ముఖాలకు మంత్రివర్గంలో చోటు కల్పించారు.

అంతకుముందు, పార్లమెంట్ సభ్యులుగా బీఎన్‌పీకి చెందిన 209 మంది ఎంపీలు ప్రమాణం చేశారు. అయితే, రాజ్యాంగ సంస్కరణల మండలి ప్రమాణ పత్రంపై సంతకాలు చేయడానికి పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు వారు నిరాకరించారు. తాము కౌన్సిల్ సభ్యులుగా ఎన్నిక కాలేదని, అందుకే ఆ ప్రమాణాన్ని స్వీకరించబోమని బీఎన్‌పీ నేత సలావుద్దీన్ అహ్మద్ స్పష్టం చేశారు.బీఎన్‌పీ వైఖరిని నిరసిస్తూ జమాత్-ఎ-ఇస్లామీ, ఇస్లామీ ఆందోళన్, నేషనల్ సిటిజన్స్ పార్టీ (ఎన్‌సీపీ)లతో కూడిన 11 పార్టీల కూటమి తొలుత ప్రమాణ స్వీకారాన్ని బహిష్కరించాలని నిర్ణయించింది. అయితే, కొద్దిసేపటికే ఈ రాజకీయ డ్రామాకు తెరపడింది. జమాత్ నేతృత్వంలోని కూటమి, స్వతంత్రులు, ఇస్లామీ ఆందోళన్ బంగ్లాదేశ్, ఎన్‌సీపీ ఎంపీలు వేర్వేరుగా ప్రమాణం చేశారు. దేశ చరిత్రలో తొలిసారిగా ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) ఏఎంఎం నసీర్ ఉద్దీన్ కొత్తగా ఎన్నికైన ఎంపీలతో ప్రమాణం చేయించడం గమనార్హం.ఫిబ్రవరి 12న 299 పార్లమెంట్ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో బీఎన్‌పీ 209 సీట్లు గెలుచుకోగా, రాడికల్ ఇస్లామిస్ట్ పార్టీ అయిన జమాత్-ఎ-ఇస్లామీ 68 స్థానాల్లో విజయం సాధించింది. రెండు చోట్ల గెలిచిన తారిక్ రెహ్మాన్, బోగ్రా-6 స్థానాన్ని వదులుకుని, ఢాకా-17 ఎంపీగా ప్రమాణం చేశారు. గత 18 నెలలుగా మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వ హయాంలో పెరిగిన అశాంతి, ఇస్లామిక్ తీవ్రవాదాన్ని అరికట్టడం కొత్త ప్రభుత్వానికి అతిపెద్ద సవాలుగా నిలవనుందని విశ్లేషకులు భావిస్తున్నారు.కాగా, ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారత కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా హాజరయ్యారు. బంగ్లాదేశ్ లో కొలువుదీరిన నూతన ప్రభుత్వానికి ఆయన భారత్ తరపున శు భాకాంక్షలు తెలియజేశారు.

# హైదరాబాదులో అక్రమంగా నివసిస్తున్న 23 మంది విదేశీయుల అరెస్ట్

హైదరాబాద్ నగరంలో అక్రమంగా నివసిస్తున్న విదేశీయులపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. గోల్కొండ జోన్ పరిధిలోని టోలిచౌకి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి భారీ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి, వీసా గడువు ముగిసినా దేశంలోనే ఉంటున్న 23 మంది విదేశీయులను అదుపులోకి తీసుకున్నారు.గోల్కొండ జోన్ డీసీపీ జి. చంద్రమోహన్ ప్రత్యక్ష పర్యవేక్షణలో సుమారు 250 మంది పోలీసు సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. పారామౌంట్ కాలనీ (గేట్లు 1 నుంచి 4), ఐఏఎస్ కాలనీ, హకీంపేట్ కుంట ప్రాంతాల్లో పక్కా సమాచారంతో పోలీసులు ఏకకాలంలో సోదాలు చేపట్టారు. ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్ఆర్ఆర్ఓ) అధికారుల సహాయంతో ఈ సోదాలు జరిగాయి. వివిధ దేశాలకు చెందిన 23 మంది అక్రమంగా నివసిస్తున్నట్లు గుర్తించారు. వీరి వీసా, పాస్‌పోర్ట్ గడువు ముగిసినట్లు తేలింది.ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలు, అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్న 9 గ్యాస్ సిలిండర్లు, చట్టవిరుద్ధంగా నిల్వ ఉంచిన 53 మద్యం బాటిళ్లను కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు మంగళవారం తెలిపారు.ప్రజా భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, నివాస చట్టాలను కఠినంగా అమలు చేస్తామని డీసీపీ చంద్రమోహన్ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు. కాగా, అదుపులోకి తీసుకున్న విదేశీయులు ఏ దేశస్థులనే వివరాలను పోలీసులు వెల్లడించలేదు. టోలిచౌకి, పారామౌంట్ కాలనీ ప్రాంతాల్లో ఆఫ్రికన్ దేశాలకు చెందిన వారు ఎక్కువగా నివసిస్తుంటారు. గతంలోనూ డ్రగ్స్ సంబంధిత కేసుల్లో ప్రమేయం ఉన్న పలువురు విదేశీయులను పోలీసులు అరెస్ట్ చేసి, వారి దేశాలకు తిప్పి పంపిన విషయం తెలిసిందే.

# నీ ఫ్రస్టేషన్ ఇంకెక్కడైనా చూపించుకో బాల్క సుమన్.. చెన్నూరులో కాదు



**హైదరాబాద్ పెన్ పవర్:**బాల్క సుమన్ గుండా గిరిపై మంత్రి వివేక్ వెంకటస్వామి ఫైర్ అయ్యారు. ఇలాంటి గుండాగిరి రాష్ట్రంలో ఎక్కడా లేదన్నారు. ఓడిపోయిన ఫ్రస్టేషన్ తోనే బాల్క సుమన్ తమ కాన్వాయ్ పై దాడులకు పాల్పడ్డారని మంత్రి అన్నారు. బీఆర్ ఎస్ హయాంలోనే ప్రజాస్వామ్యం ఖూని అయ్యింది.. కాంగ్రెస్ హయాంలో అంతా ప్రజాస్వామ్య బద్ధంగానే ఎన్నిక జరిగిందన్నారు. క్యాతనపల్లిలో అంతా ప్రజాస్వామ్య బద్దంగానే మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. చైర్మన్ ఎన్నిక కూడా ఎలాంటి గొడవలు లేకుండానే జరిగింది. చైర్మన్ ఎన్నికపై బీఆర్ ఎస్ కూడా ఎలాంటి కంప్లైంట్ చేయలేదు.. బాల్క సుమన్ ఫ్రస్టేషన్ తో మా కాన్వాయ్ పై రాళ్ల దాడి చేశారు. మాజీ ఎంపీగా, మాజీ ఎమ్మెల్యేగా

-4 లో

# పెన్ పవర్ తెలంగాణ రౌండప్








## రూ. లక్ష లంచం ఆరోపణలపై..!

# ఏసీబి సోదాలు

### చింతల్ సర్కిల్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ వహీద్‌ను అదుపులోకి తీసుకుని విచారణ..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, ఫిబ్రవరి 17:** కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయంలో మంగళవారం ఉదయం ఉద్రిక్తత నెలకొంది.. అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆకస్మికంగా సోదాలు నిర్వహించారు.. చింతల్ జీహెచ్ఎంసి సర్కిల్‌లో విధులు నిర్వర్తించే ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ వహీద్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.. ఈ దాడులను రంగారెడ్డి రేంజ్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ నేతృత్వంలోని బృందం విచారణ చేపట్టింది.. ఏసీబి డిఎస్పి ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం.. గతంలో గాజులరామారం జీహెచ్ఎంసి సర్కిల్‌లో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన సమయంలో, ఓ వ్యక్తి తాను కొనుగోలు చేసిన ఇంటికి, హౌస్ నెంబర్ (ట్యాక్స్ అసెస్‌మెంట్) మరియు మ్యుటేషన్ ప్రక్రియ పూర్తి చేయడానికి వహీద్ రూ.లక్ష డిమాండ్ చేసినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు.. డిమాండ్ చేసిన మొత్తం లక్ష రూపాయల్లో రూ.10 వేలు స్వీకరించాడని, మిగిలిన డబ్బుల కోసం బాధితుడిని తరచూ వేధిస్తున్న నేపథ్యంలో బాధితుడు ఏసీబీ అధికారులను సంప్రదించగా, డీఎస్పీ ఆనంద్ కుమార్ బృందం దర్యాప్తు ప్రారంభించింది. అనంతరం కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయంలో మంగళవారం సోదాలు నిర్వహించి, సంబంధిత పత్రాలు, ఆధారాలను సేకరించి వహీద్‌ను విచారిస్తున్నారు..ప్రస్తుతం కార్యాలయంలో విచారణ కొనసాగుతుండగా, పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడించే అవకాశం ఉందని ఏసీబీ వర్గాలు తెలిపాయి. అవినీతి ఆరోపణలపై మరిన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నట్లు సమాచారం..




ప్రెస్‌మీట్‌లో.. ఏసీబీ డిఎస్పి ఆనంద్ కుమార్.



ఏసీబి విచారణ జరుగుతున్న చింతల్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ వహీద్..ఫైల్‌ఫోటో..

- ఇంటి నెంబర్, మ్యుటేషన్ కోసం రూ.లక్ష డిమాండ్ చేసినట్లు ఆరోపణ..
- రూ.10 వేల స్వీకరణ తర్వాత మిగిలిన డబ్బుల కోసం వేధింపులు..
- బాధితుడి ఫిర్యాదుతో 'అనిశా' దర్యాప్తు కొనసాగింపు..
- కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయంలో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ వహీద్‌పై విచారణ..

## హైదరాబాద్‌లో ఘోర ప్రమాదం..

### టిప్పర్ కిందపడి విద్యార్థి మృతి



- నాదర్‌గుల్ నుంచి కాలేజీకి బైక్ పై వెళుతుండగా దుర్ఘటన
- టిప్పర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన విద్యార్థి
- కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు

-4 లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ప్రపంచ బయోసైన్సెస్ రాజధానిగా హైదరాబాద్

## బయోఏసియా 2026 సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి..





**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ బయోసైన్సెస్ రాజధానిగా హైదరాబాద్ ఎదిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 23 ఏళ్ల క్రితం బయో ఏసియా ప్రారంభమైనప్పుడు హైదరాబాద్ కు చార్మినార్, బిర్యానీ, ఔషధ తయారీ, సాఫ్ట్ వేర్ నగరం అనే గుర్తింపు మాత్రమే ఉండేదని, ఈ రోజు మాత్రం హైదరాబాద్ ప్రపంచ వ్యాక్సిన్ తయారీ కేంద్రంగా ఎదిగిందని తెలిపారు. హైదరాబాద్ లో బయోఏషియా సదస్సు వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రసంగం చేశారు. దూరదృష్టిగల నాయకత్వం, స్పష్టమైన విధానాలు, నైపుణ్యంతో కూడిన మానవ వనరులు, ప్రతిష్టాత్మక విద్యాసంస్థల బలంతో హైదరాబాద్ గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు, పరిశోధన, డిజైన్ రంగాల్లో ప్రపంచ కేంద్రంగా ఎదిగిందని సీఎం చెప్పారు. గత రెండేళ్లలోనే బయో సైన్సెస్ రంగంలో 73 వేల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని వెల్లడించారు. కొద్ది వారాల క్రితం దావోస్ లో కొత్త లైఫ్ సైన్సెస్ పాలసీని ప్రకటించామని, జీనోమ్ వ్యాలీ విస్తరణ, వన్ బయో ప్రారంభం, గ్రీన్ ఫార్మా సిటీ వేగవంతం, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లకు ఆహ్వానం వంటి చర్యలు చేపట్టామని తెలిపారు. ఇది సాధారణ అభివృద్ధి కాదని, దృఢమైన దృష్టి ఫలితమని స్పష్టం చేశారు. దానికి ప్రత్యక్ష సాక్ష్యమే బయోఏషియా

-4 లో

# రాజకీయాల్లో ఉండాలా, వద్దా అనేది అర్థం కావడం లేదు



## ఎర్రబెల్లి దయాకర్ రావు కన్నీరు

- తొర్రూరు మున్సిపాలిటీ కాంగ్రెస్ వశం కావడంపై కంటతడి
- అప్రజాస్వామికంగా మున్సిపాలిటీని కైవసం చేసుకున్నారని ఆరోపణ
- కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు ఏం సమాధానం చెప్పాలన్న ఎర్రబెల్లి

**హైదరాబాద్ పెన్ పవర్:**తొర్రూరులో జరిగిన మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక తీరును చూశాక రాజకీయాల్లో ఉండాలా, వద్దా అనేది అర్థం కావడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి దయాకర్ రావు కన్నీళ్లు పెట్టుకున్నారు.

-4 లో

# కేసీఆర్ కు గ్రీన్ సెల్యూట్...

## వినూత్న రీతిలో పుట్టినరోజు శుభాకాంక్షలు

- కేసీఆర్ 72వ పుట్టినరోజు సందర్భంగా సుందర్బన్స్‌లో ప్రత్యేక కార్యక్రమం
- గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా 10,000 మడ అడవుల మొక్కల పెంపకం
- తెలంగాణ 'హరితహారం' స్ఫూర్తితో దేశవ్యాప్తంగా పర్యావరణ ఉద్యమం
- అధునాతన టెక్నాలజీతో మడ అడవుల పునరుద్ధరణ పనులు



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) 72వ జన్మదినం సందర్భంగా ఆయనకు ఒక వినూత్న హరిత కానుక అందింది. ఆయన పర్యావరణ దార్శనికత స్ఫూర్తితో, ప్రపంచంలోనే అత్యంత కీలకమైన పర్యావరణ ప్రాంతాల్లో ఒకటైన సుందర్బన్స్‌లో భారీ మొక్కల పెంపకం కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా, కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకుని సుందర్బన్స్‌లో 10,000 మడ అడవుల (మాంగ్రూవ్) మొక్కలను నాటారు. భారత్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లోని గంగ-బ్రహ్మపుత్ర-మేఘన డెల్టాలో సుమారు 10,000 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న సుందర్బన్స్, ప్రపంచంలోనే అతిపెద్ద మడ అడవుల పర్యావరణ వ్యవస్థగా ప్రసిద్ధి చెందింది. ఈ అడవులు తుపానులు, సముద్రపు అలల తాకిడి, తీర ప్రాంత కోత నుంచి లక్షలాది మందికి సహజ రక్షణ కవచంలా నిలుస్తున్నాయి. అయితే, పెరుగుతున్న సముద్ర మట్టాలు, వాతావరణ మార్పుల కారణంగా ఈ ప్రాంతం తీవ్రమైన ప్రమాదాలను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో ఇక్కడ మడ అడవులను బలోపేతం చేయడం అత్యవసరంగా మారింది. కేసీఆర్

-4 లో

# నీ ఫ్రస్టేషన్ ఇంకెక్కడైనా చూపించుకో బాల్క సుమన్.. చెన్నూరులో కాదు

-3 పేజి తరువాయి
ఇలాంటి దాడులు చేయడం సరైంది కాదని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. మంగళవారం(ఫిబ్రవరి17 చెన్నూరు నియోజకవర్గంలోని క్యాతనపల్లిలో మంత్రి వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ క్వాన్వాయ్ ప దాడి జరిగింది. క్యాతనపల్లి మున్సిపల్ కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం, చైర్మన్ ఎన్నిక సందర్భంగా కో ఆప్షన్ మెంబర్స్ గా సమావేశానికి హాజరు కాగా మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ , అతని అనుచరులు దాడి చేశారు. బాల్క సుమన్ స్వయంగా ట్రాఫిక్ కోన్ తో మంత్రి కారుపై దాడి చేశారు. దీంతో క్యాతనపల్లిలో ఉద్రికత్త నెలకొంది. ఈ దాడిలో ఓ పోలీస్ కానిస్టేబుల్ కు కూడా గాయాలయ్యాయి. ఓడిపోయామన్న ఫ్రస్టేషన్ తోనే బాల్క సు మన్ దాడికి దిగారని మంత్రి మండిపడ్డారు. ఇలాంటి దాడులను ప్రోత్సహించడం బాల్కసుమన్ కు మానుకోవాలని మంత్రి హెచ్చరించారు.

# ప్రపంచ బయోసైన్సెస్ రాజధానిగా హైదరాబాద్

-3 పేజి తరువాయి
2026 అని అన్నారు.
బయోఏషియా తన పేరును దాటి బయోవరల్డ్ గా మారుతోందని వ్యాఖ్యానించారు. ప్రపంచవ్యాప్తంగా 500 ప్రముఖ సంస్థలకు చెందిన 4 వేల మందికి పైగా ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారని తెలిపారు. ఫార్మా, బయో సైన్సెస్, ఐయోటెక్, బల్క్ డ్రగ్స్, వ్యాక్సిన్లు, ఆరోగ్యరంగాల ప్రముఖులు, బిజినెస్ లీడర్లు ఇక్కడ ఉన్నారని చెప్పారు. హైదరాబాద్లో జరుగుతున్న బయోఏషియా సదస్సు వరల్డ్ ఎకనామిక్ ఫోరం స్థాయిలో అంతర్జాతీయ గుర్తింపు పొందుతుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు.
ఇటీవల ప్రకటించిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ ప్రకారం 2014నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యసస్థగా ఎదగడమే లక్ష్మమని సీఎం చెప్పారు. ప్రస్తుత బయో సైన్సెస్ ధోరణుల్లో పరిశోధన సంస్థలు, కార్పొరేట్లు, స్టార్టప్, చిన్న మధ్య తరహా సంస్థలు, ప్రభుత్వం మధ్య బలమైన భాగస్వామ్యం అవసరమని అన్నారు. విశ్వసనియమైన, స్థిరమైన పెట్టుబడి వాతావరణం కావాలంటే తెలంగాణే సమాధానమని, హైదరాబాద్ మీ గమ్యమని స్పష్టం చేశారు. బల్క్ డ్రగ్స్ నుంచి బయాలజిక్స్ వరకు తయారీ నుంచి ఆవిష్కరణ వరకు తెలంగాణ ప్రపంచ స్థాయిలో ముందుకు సాగుతోందని అన్నారు.
భారత్లోనే కాదు. ప్రపంచంలోని అగ్రగామి క్లస్టర్లతో పోటీ పడుతున్నామని చెప్పారు. హైదరాబాద్ ఇప్పటికీ గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లకు ప్రాధాన్య గమ్యస్థానంగా మారిందని, ఇప్పుడు కలిసి సమగ్ర బయో సైన్సెస్ రంగానికి ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు. ఇక్కడ పెట్టుబడులు పెట్టాలని, జీసీసీలు స్థాపించాలని, ఆవిష్కరణ కేంద్రాలు నిర్మించాలని కోరారు. మాలిక్యూల్స్, ఔషధాల డిజైన్, క్లినికల్ అనలిటిక్స్, ఏఐ ప్లాట్ ఫారమ్ లు, డిజిటల్ తయారీకి తెలంగాణ పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. హైదరాబాద్ ప్రపంచ వ్యాక్సిన్ రాజధానిగా ఉన్న స్థితి నుంచి ప్రపంచ బయో సైన్సెస్ రాజధానిగా ఎదుగుతుందని అన్నారు. ప్రపంచానికి తెలంగాణ సిద్ధంగా ఉందని, తెలంగాలు అంటే వ్యాపారమని, తెలంగాణ ఎదుగుతోందని స్పష్టం చేస్తూ ఈ ఎదుగుదల లో భాగస్వాములు కావాలని ఆహ్వానించారు.

## హైదరాబాద్లో ఘోర ప్రమాదం.. టిప్పర్ కిందపడి విద్యార్థి మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్లో విషాదం చోటు చేసుకుంది. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మీర్పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక విద్యార్థి మృతి చెందాడు. నాదర్గుల్ నుంచి కాలేజీకి ద్విచక్ర వాహనంపై వెళుతున్న విద్యార్థి ప్రమాదవశాత్తు టిప్పర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిని నాదర్గుల్ నివాసి వర్ధన్గా గుర్తించారు.వర్ధన్ బాలాపూర్లోని ఒక ప్రైవేటు కాలేజీలో ఐటీఐ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ద్విచక్ర వాహనంపై కాలేజీకి వెళుతుండగా టిప్పర్, ఆటో మధ్యలో నుంచి వాటిని దాటే ప్రయత్నంలో టిప్పర్ ముందు చక్రం కిందపడి మృతి చెందాడు.వర్ధన్ టిప్పర్ను దాటుదామనుకున్న సమయంలో ఆటో నిలబడి ఉంది. కానీ అంతలోనే ఆటో కదలడంతో బైక్ను కొద్దిగా టిప్పర్ వైపు తిప్పడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మీర్ పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కేసీఆర్ కు గ్రీన్ సెల్యూట్... వినూత్న రీతిలో పుట్టినరోజు శుభాకాంక్షలు

-3 పేజి తరువాయి
తెలంగాణలో ప్రారంభించిన 'తెలంగాణకు హరితహారం' కార్యక్రమమే ఈ బృహత్తర ఉద్యమానికి అసలు స్ఫూర్తి. పర్యావరణ పరిరక్షణను ప్రభుత్వ విధానంలో అంతర్భాగం చేసిన కేసీఆర్, హరితహారాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా, ఒక ప్రజా ఉద్యమంగా మలిచారు. ఈ స్ఫూర్తితోనే మాజీ రాజ్యసభ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్'ను ప్రారంభించి, దానిని దేశవ్యాప్త ఉద్యమంగా మార్చారు.సుందర్బన్స్లో చేపట్టిన ఈ కార్యక్రమం కేవలం లాంఛనప్రాయమైనది కాదు. ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని దీనికి జోడించారు. నాటిన మొక్కల మనుగడను పర్యవేక్షించేందుకు జియో-ట్యాగింగ్, వాతావరణ మార్పులను గమనించేందుకు మైక్రో-క్లైమేట్ సెన్సార్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటివి వినియోగిస్తున్నారు. తెలంగాణలో మొదలైన హరిత స్ఫూర్తి, దేశ సరిహద్దుల్లోని సుందర్బన్స్ పరిరక్షణ వరకు విస్తరించడం కేసీఆర్ పర్యావరణ దార్శనికతకు నిదర్శనంగా నిలుస్తోంది.

## రాజకీయాల్లో ఉండాలా, వద్దా అనేది అర్థం కావడం లేదు

-3 పేజి తరువాయి
తొర్రూరులో 16 వార్డులకు గాను 9 బీఆర్ఎస్, 7 కాంగ్రెస్ గెలుచుకున్నాయి. ఎక్స్అఫీషియో ఓట్లతో కలిపి రెండు పార్టీల బలాలు సమానమయ్యాయి. దీంతో లాటరీ తీయడంతో కాంగ్రెస్ రెండో వార్డు కౌన్సిలర్ శ్రావణ్ కుమార్ చైర్మన్ అయ్యారు.
చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో తొర్రూరులో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఓ సమయంలో ఎర్రబెల్లి దయాకర్ రావుతో పాటు, పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం జరిగిన ఎన్నికలో కాంగ్రెస్ మున్సిపాలిటీని దక్కించుకుంది.తొర్రూరు మున్సిపాలిటీని కోల్పోవడంతో ఎర్రబెల్లి దయాకర్ రావు తీవ్ర భావోద్వేగాలకు లోనయ్యారు. రేయింబవళ్లు పార్టీ గెలుపు కోసం కష్టపడిన కార్యకర్తలకు ఏం సమాధానం చెప్పాలని రోదిస్తూ అక్కడున్న పోలీసులను ప్రశ్నించారు. పోలీసుల తీరు సరిగ్గా లేదని అన్నారు. ఇంత అరాచకంగా ఎన్నికలు నిర్వహించడమేమిటని ప్రశ్నించారు. కార్యకర్తలు తెగించి పోరాడారని అన్నారు. పోలీసులు రాజ్యాంగ విరుద్ధంగా పని చేశారని అసహనం వ్యక్తం చేశారు. తన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇంత దగా, మోసం చూడలేదని కన్నీరు పెట్టుకున్నారు. ఎన్నిక అప్రజాస్వామికంగా నిర్వహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇలాంటివి చూస్తుంటే రాజకీయాల్లో ఉండాలో, వద్దో కూడా అర్థం కావడం లేదని అన్నారు. తొర్రూరు ప్రజలు తమకు పట్టం కడితే ఈ ప్రభుత్వం అన్యాయంగా మున్సిపాలిటీని దక్కించుకుందని అన్నారు. తనను, తన భార్యను అన్యాయంగా అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తొర్రూరులోని తన కార్యాలయానికి కూడా వెళ్లనీయడం లేదని ఆరోపించారు. విప్ జారీ చేయకుండా అన్యాయంగా అరెస్టు చేశారని అన్నారు.

## శివుడి ప్రసాదంగా మాదకద్రవ్యాలు.. సజ్జనార్ సీరియస్

### శివుడికి గంజాయితో నైవేద్యం పెడుతూ రీల్ చేసిన యువకులు
### సోషల్ మీడియాలో వీడియో వైరల్ కావడంతో తీవ్ర ఆగ్రహం
### స్పందించిన సీపీ సజ్జనార్, కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
### రంగంలోకి దిగిన పోలీసులు ముగ్గురు యువకుల అరెస్ట్




**హైదరాబాద్ పెన్ పవర్:**మహా శివరాత్రి పర్వదినాన శివుడికి మాదకద్రవ్యాలను నైవేద్యంగా పెడుతున్నట్లు చిత్రీకరించి, సోషల్ మీడియాలో రీల్ చేసిన ముగ్గురు యువకులను హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వీడియో వైరల్ కావడంతో నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలను ఉపేక్షించబోమని, నిందితులపై ఎన్డీపీఎస్ చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించిన కొద్ది గంటల్లోనే పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.వివరాల్లోకి వెళితే, మహా శివరాత్రి రోజున కొందరు యువకులు శివుడి విగ్రహం ముందు గంజాయిని ఉంచి, దానిని 'ప్రసాదం' అంటూ ఓ వీడియో రీల్ రూపొందించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వేగంగా వ్యాప్తి చెందడంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ ఘటనపై సీపీ సజ్జనార్ తన 'ఎక్స్' ఖాతా ద్వారా స్పందించారు. "లైక్స్ కోసం లోకాన్ని మరిచి, వ్యూస్ కోసం విలువలను వదిలేస్తారా? ఇది కటకటాల వెనుకకు చేర్చే తీవ్రమైన నేరం. ఇలాంటి చర్యలను ఏమాత్రం సహించం" అని ఆయన తీవ్రంగా హెచ్చరించారు.సీపీ పోస్టుతో వెంటనే రంగంలోకి దిగిన చార్మినార్ జోన్ టాస్క్ఫోర్స్ పోలీసులు, ఫలక్నుమా జంగంమెట్కు చెందిన ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారిని తదుపరి విచారణ నిమిత్తం ఫలక్నుమా పోలీస్ స్టేషన్కు తరలించారు. క్షణికానందం కోసం యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, సోషల్ మీడియాను సృజనాత్మకతకు వేదికగా మార్చుకోవాలని సీపీ సజ్జనార్ సూచించారు.

## సుద్ధ ముక్క పై కేసీఆర్ చిత్రం

**కోదాడ, ఫిబ్రవరి 17పెన్ పవర్:** కోదాడకు చెందిన సూక్ష్మ కళాకారుడు వేగ్గలం నరేష్ చారి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా మంగళవారం అంగుళం సుద్ధ ముక్కపై కేసీఆర్ ప్రతిమను చెక్కి తన కళాత్మకతను ప్రదర్శించారు. గతంలో బియ్యం, పప్పు, చింత గింజలపై సూక్ష్మ కళాఖండాలను చెక్కి పలువురి ప్రశంసలు అందుకున్న చారి, ప్రభుత్వం ప్రోత్సహిస్తే సూక్ష్మ కళలో రాణించి కోదాడకు పేరు తెస్తానని పేర్కొన్నారు.

## కోదాడ లో కేసీఆర్ జన్మ దిన వేడుకలు

**సూర్యాపేట, ఫిబ్రవరి 17పెన్ పవర్:**కోదాడ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. స్వరాష్ట్ర సాధనలో కేసీఆర్ పాత్రను, రాష్ట్రంలో ఆయన అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఆయన కొనియాడారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే ఏర్పడుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## దారుణం.. చెట్ల పొదల్లో అప్పుడే పుట్టిన ఆడ శిశువు

**తుంగతుర్తి, ఫిబ్రవరి 17పెన్ పవర్:** కోదాడ మండలం గుడిబండ గ్రామంలో అమానుష ఘటన చోటుచేసుకుంది. అప్పుడే పుట్టిన ఆడ శిశువును గుర్తు తెలియని దుండగులు చెట్ల పొదల్లో పడేసి వెళ్లారు. ఆడపిల్ల పుట్టిందనే కారణంతో తల్లితండ్రులే శిశువును వదిలి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు. శిశువు అరుపులు విని అప్రమత్తమైన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన పోలీసులు పసికందును కోదాడ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## సీఎం కప్ పోటీల్లో విజేత గా రక్షిత్ నాయక్

**హుజూర్నగర్, ఫిబ్రవరి 17పెన్ పవర్:** కోడాడలోని తేజ టాలెంట్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్న బి. రక్షిత్ నాయక్, జిల్లా స్థాయి సీఎం కప్ బ్యాడ్మింటన్ సింగిల్స్ పోటీల్లో మొదటి స్థానం సాధించి, సూర్యాపేట జిల్లా తరపున రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నాడు. ఈ విజయంపై ప్రిన్సిపాల్, యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

## రోడ్డు విస్తరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి:

**భువనగిరి, ఫిబ్రవరి 17పెన్ పవర్:**ఫుట్ పాత్లపై ఉన్న ఆక్రమణలు తొలగించి రహదారి విస్తరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి కోమటిరెడ్డి అధికారులను ఆదేశించారు. నల్గొండ జిల్లా కేంద్రంలో మంగళవారం ఉదయం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పర్యటించారు. ప్రకాశం బజార్లో ఫుట్ పాత్పై ఉన్న ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. దాంతో మున్సిపల్ యంత్రాంగం వెంటనే చర్యలు చేపట్టింది. పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కమిషనర్ను ఆదేశించారు.

## అధికారం చెరిసగం : ఎమ్మెల్యే కుంభం

**ఆలేరు, ఫిబ్రవరి 17పెన్ పవర్:** కాంగ్రెస్ పార్టీ నుంచి విజేతలుగా నిలిచిన ఇద్దరు మహిళా కౌన్సిలర్లు ఛైర్పర్సన్ పదవీ కాలాన్ని చెరి రెండున్నరేళ్లు పంచుకుంటారని ఎమ్మెల్యే కుంభం అనిల్కుమార్రెడ్డి అన్నారు. పట్టణంలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఇప్పటి నుంచి రెండున్నరేళ్ల పాటు తంగెళ్లపల్లి శ్రీవాణి ఛైర్పర్సన్గా కొనసాగుతారని, మరో రెండున్నరేళ్లు మరో మహిళా కౌన్సిలర్ ఛైర్పర్సన్ పదవి చేపడతారని.. ఇది జరిగిన ఒప్పందమని స్పష్టం చేశారు. పట్టణ ప్రజలు, నాయకుల అభీష్టం మేరకు ప్రస్తుతం ఛైర్పర్సన్గా బీసీ మహిళను ఎంపిక చేయాల్సి వచ్చిందని వివరించారు.

## షబ్బీర్ అలీకి నన్ను విమర్శించే అర్హత లేదు

**కామారెడ్డి, ఫిబ్రవరి 17పెన్ పవర్:** కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కేవీ. రమణారెడ్డి మంగళవారం కామారెడ్డిలో మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకుడు, ప్రభుత్వ సలహాదారుడు మహమ్మద్ అలీ షబ్బీర్ కు తనను విమర్శించే నైతిక హక్కు లేదని అన్నారు. షబ్బీర్ అలీ గతంలో హైదరాబాద్ లోని ఉగ్రవాదుల ఇంటికి వెళ్లారని, మున్సిపల్ ఛైర్పర్సన్ వద్ద ఎంత వసూలు చేశాడో తాను నిరూపిస్తానని, కామారెడ్డి ప్రజలకు షబ్బీర్ ఆలీ ఏం చేశారో తెలుసని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కేసీఆర్, బాజిరెడ్డి జన్మదిన వేడుకలు



**బాన్సువాడ, ఫిబ్రవరి 17పెన్ పవర్:**బీర్కుర్ మండల కేంద్రంలో మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర రావు, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ల జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించి, స్థానిక హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గాంధీ చౌక్ వద్ద కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అరిగే ధర్మతేజ, నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు నార్ల రత్నకుమార్, షేక్ జుబేర్, అంజిరెడ్డి, మరియు మండల నాయకులు బాలకృష్ణ, నవీన్, శివకుమార్, రాములు, దత్తు, సాయిలు పాల్గొన్నారు.

## పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్


**ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 17పెన్ పవర్:** కామారెడ్డి జిల్లాలో పదవ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్లో జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. మార్చి 14 నుంచి ప్రారంభం కానున్న పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా 65 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

## కామారెడ్డిలో ఏకంగా బీరువానే ఎత్తుకెళ్లిన దొంగలు

**జుక్కల్, ఫిబ్రవరి 17పెన్ పవర్:** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓల్డ్ ఎసీపీఆర్ స్కూల్ సమీపంలో శమీమున్నీసా బేగానికి చెందిన ఇంట్లో దొంగలు బీరువాను ఎత్తుకెళ్లారు. ఇంట్లో ఉన్న 2 తులాల బంగారం, కొంత నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. దుండగులు తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని సీసీ ఫుటేజీల ఆధారంగా విచారణ చేపట్టారు.

## విచారణ చేసి చర్యలు తీసుకుంటాం:

**షాద్నగర్, ఫిబ్రవరి 17పెన్ పవర్:** షాద్ నగర్ పట్టణంలోని పరిగి రోడ్డులో ఇద్దరు కానిస్టేబుల్స్ ఒక వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై సోషల్ మీడియాలో వచ్చిన కథనానికి షాద్ నగర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) లక్ష్మీ నారాయణ వెంటనే స్పందించారు. బాధితుడు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేస్తే, సంఘటనపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ లక్ష్మీ నారాయణ తెలిపారు. దాడికి గల కారణాలు, ఇరువురి మధ్య జరిగిన సంఘటన వివరాలు, దాడి జరిగిన తీరుపై సమగ్ర విచారణ జరుపుతామని ఏసీపీ హామీ ఇచ్చారు.




# జీవన్ రెడ్డికి కాంగ్రెస్ షాక్..

**కరీంనగర్, ఫిబ్రవరి 17, పెన్ పవర్:** జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం కోసం కాంగ్రెస్ పార్టీలోని రెండు వర్గాలు తీవ్రంగా ప్రయత్నాలు చేసిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌లు తమ వర్గానికి చెందిన వారికే చైర్మన్ పదవి ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో కాంగ్రెస్ పెద్దలు రంగంలోకి వారి మధ్య సయోధ్య కుదర్చేందుకు చర్చలు జరిపారు. చివరికి కాంగ్రెస్ అధిష్టానం ఆ పార్టీ సీనియర్ నేత జీవన్ రెడ్డికి బిగ్ షాకిచ్చింది. జగిత్యాల చైర్మన్ పీఠం సంజయ్ వర్గానికే కట్టబెడుతూ నిర్ణయించింది.జగిత్యాల మున్సిపాలిటీలో మొత్తం 50 వార్డులు ఉండగా చైర్‌పర్సన్‌ను ఎన్నుకోవాలంటే కనీసం 25 మంది కౌన్సిలర్ల మద్దతు అవసరం. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ 23 చోట్ల, స్వతంత్రులు 15 చోట్ల గెలుపొందారు. బీజేపీ ఆరు, బీఆర్ఎస్ నాలుగు, ఎంఐఎం రెండు స్థానాలు గెలుచుకుంది.కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గం నుంచి 33 మంది పోటీ చేయగా 14మంది, మాజీ మంత్రి జీవన్ రెడ్డి వర్గం నుంచి 17 మంది పోటీ చేయగా తొమ్మిది మంది విజయం సాధించారు. స్వతంత్రుల్లో తొమ్మిది మంది జీవన్ రెడ్డి వర్గం కాగా.. నలుగురు ఎమ్మెల్యే వర్గీయులు, ముగ్గురు బీజేపీ రెబల్స్ ఉన్నారు.ఈ క్రమంలో చైర్మన్ పీఠం కోసం జీవన్ రెడ్డి, సంజయ్ కుమార్ పోటీ పడ్డారు. దీంతో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పెద్దలు రంగంలోకి దిగారు. జీవన్ రెడ్డితో పలు దఫాలుగా చర్చలు జరిపారు. ఈచర్చల్లో భాగంగా సంజయ్ వర్గానికి చైర్‌పర్సన్ పదవి అప్పగించేందుకు నిర్ణయించారు.జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ గా సంజయ్ వర్గానికి చెందిన సమిండ్ల వాణిని కాంగ్రెస్ అధిష్టానం ఎంపిక చేసింది. భవిష్యత్తులోజడ్పీటీసీ, మార్కెట్ కమిటీ పదవుల విషయంలో ప్రాధాన్యత కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ పెద్దలు జీవన్ రెడ్డికి హామీ ఇవ్వడంతో ఆయన వెనక్కు తగ్గినట్లు తెలిసింది. దీంతో గత రెండు రోజులుగా జీవన్ రెడ్డి వర్సెస్ సంజయ్‌కుమార్ మధ్య జరుగుతున్న వార్ లో పార్టీ పెద్దలతో సహకారంతో సంజయ్ కుమార్ పంతం నెగ్గించుకున్నట్లయింది.

## పటాన్ చెరు నియోజకవర్గంలో క్లీన్ స్వీప్ చేసిన బిఆర్ఎస్

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 17 పెన్ పవర్:** పటాన్ చెరు నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీలలో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఘన విజయం సాధించింది. ఇంద్రేశం, ఇస్నాపూర్, గడ్డపోతారం, జిన్నారం, గుమ్మడిదల మున్సిపాలిటీలలో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందారు. ఈ విజయానికి నియోజకవర్గ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కీలక పాత్ర పోషించారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ ఫలితాలు స్థానిక రాజకీయాల్లో బీఆర్ఎస్ బలాన్ని చాటిచెప్పాయి.

## కేసీఆర్ జన్మదిన వేడుకలు: తెలంగాణ సాధనలో ఆయన కృషికి నివాళి

**ఆందోల్, ఫిబ్రవరి 17పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లా నాగల్ గిద్ద మండల కేంద్రంలో భారతీయ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ అధ్యక్షులు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మండల పార్టీ అధ్యక్షులు పండరి యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు షేక్ సద్దామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ చేసిన అహర్నిశల కృషి, ప్రజల కోసం అందించిన సేవలను నాయకులు కొనియాడారు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో, ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మహబూబ్ నగర్ జట్టు రాష్ట్రస్థాయి టోర్నీలో విజయం

**జడ్చర్ల, ఫిబ్రవరి 17పెన్ పవర్:** జడ్చర్లలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ అండర్-17 టోర్నీ ఫైనల్‌లో మహబూబ్ నగర్ జట్టు 4 పరుగుల తేడాతో ఖమ్మం జట్టుపై విజయం సాధించింది. మహబూబ్ నగర్ 15 ఓవర్లలో 110/5 పరుగులు చేయగా, ఖమ్మం 107/5 పరుగులు చేసింది. మహబూబ్ నగర్ తరపున రామ్ చారి 31, కేతాన్ 30 పరుగులు చేయగా, నాయక్ 2 వికెట్లు తీశారు. ఖమ్మం తరపున మాన్విత్ 30, సులేమాన్ 29 పరుగులు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతి పాల్గొన్నారు.

## కర్నే గ్రామ శివారులో 30-40 చెట్లు దహనం: విచారణకు ఆదేశం

**మక్తల్, ఫిబ్రవరి 17పెన్ పవర్:** నారాయణపేట జిల్లా మక్తల్ మండలం కర్నే గ్రామ శివారులో కొందరు వ్యక్తులు దాదాపు 30 నుండి 40 చెట్లను కాల్చివేశారు. ఈ ఘటనపై గ్రామ కార్యదర్శి మోహన్ ను వివరణ కోరగా, ఎవరు చేశారో తమకు తెలియదని, విచారించి చర్య తీసుకుంటామని తెలిపారు. అటవీ శాఖ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

## ఆత్మకూరులో కేసీఆర్ జన్మదిన వేడుకలు: కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ

**నారాయణపేట, ఫిబ్రవరి 17పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమకారుడు, మాజీ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారి జన్మదినాన్ని పురస్కరించుకుని, ఆత్మకూరు మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. స్థానిక బిఆర్ఎస్ జండా కట్ట వద్ద కేక్ కట్ చేసి, ప్రభుత్వ ఆసుపత్రిలో పాలు, పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు బిఆర్ఎస్ మండల ముఖ్య నాయకులు, టౌన్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు పాల్గొన్నారు.

## పాఠశాల స్థాయిలో భౌతిక-రసాయన శాస్త్ర ప్రతిభా పరీక్షలు

**కల్వకుర్తి, ఫిబ్రవరి 17పెన్ పవర్:** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని బలిజపల్లి-జంగమయ్యపల్లి ఉన్నత పాఠశాలలో 8, 9 తరగతుల విద్యార్థులకు భౌతిక-రసాయన శాస్త్ర ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ఎంపికైన మొదటి, రెండవ, మూడవ ర్యాంకుల విద్యార్థులకు మండల, జిల్లా స్థాయిల్లోనూ పోటీలు నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురికి పురస్కారాలు అందజేస్తారని ఉపాధ్యాయులు వేణుగోపాల్ రెడ్డి, సునీత, వైశేకర్ తెలిపారు.

## వెల్దండలో బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

**నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 17 పెన్ పవర్:** నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల పార్టీ కార్యాలయాన్ని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. మంగళవారం పార్టీ కార్యాలయానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చైర్మన్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## వెల్దండలో కేసీఆర్ జన్మదిన వేడుకలు

**అచ్చంపేట, ఫిబ్రవరి 17పెన్ పవర్:**నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో బస్టాండ్‌లో రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం మాజీ సీఎం కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# 15 ఏళ్ల అమ్మాయిలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్




**హైదరాబాద్, ఫిబ్రవరి 17, పెన్ పవర్:** మీకు 14 ఏళ్లు నిండి 15 ఏళ్ల వయసున్న అమ్మాయిలు ఉన్నారా? అయితే మీకో అలర్ట్. త్వరలోనే తెలంగాణ ప్రభుత్వం మీ అమ్మాయిలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను వేయించనుంది. రాష్ట్రంలో మొత్తం 4 లక్షల మందికిపైగా ఈ వయసు ఉన్న కిశోర బాలికలు ఉన్నారని గుర్తించారు. వీరందరికీ టీకాలు వేయనున్నారు. అసలు ఈ వ్యాక్సిన్ ఎందుకు వేయిస్తారు..మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 14 నుంచి 15 ఏళ్ల వయసున్న బాలికల కోసం కేంద్రంతో కలిసి ఉచితంగా సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్‌ను పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ వయసున్న బాలికలు రాష్ట్రంలో 4 .60 లక్షల మంది వరకు ఉంటారని అంచనా. వ్యాక్సినేషన్ చేపట్టడానికి ముందు మైక్రో ప్లానింగ్ సర్వే నిర్వహించనున్నారు. దీని ద్వారా ఈ వయసున్న అమ్మాయిలు స్కూళ్లలో ఎంత మంది ఉన్నారు, బయట ఎంత మంది ఉన్నారనే వివరాలను సమగ్రంగా సేకరిస్తారు.తెలంగాణలోని క్యాన్సర్ కేసులను పరిశీలిస్తే.. మహిళల్లో ఎక్కువ మంది రొమ్ము క్యాన్సర్ బారిన పడుతుండగా.. ఆ తర్వాతి స్థానంలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ఉంది. దీన్నే సర్వైకల్ క్యాన్సర్ అని పిలుస్తారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించడం ద్వారా సర్వైకల్ క్యాన్సర్‌ను సమర్థవంతంగా అడ్డుకోవచ్చని పరిశోధనలు చెబుతున్నాయి. మహిళలకు సోకే సర్వైకల్ క్యాన్సర్లలో 85 నుంచి 90 శాతం హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) వల్లే సోకుతోంది.ఎక్కువసార్లు ప్రసవాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం, చిన్న వయసులోనే పెళ్లి కావడం, లైంగిక సంబంధాల వల్ల హ్యూమన్ పాపిలోమా వైరస్ సోకుతుంది. అయితే ఇది సోకిన వెంటనే క్యాన్సర్ రాదు. వైరస్ సోకిన 10-15 ఏళ్ల తర్వాత మహిళల్లో క్యాన్సర్ బయటపడుతుంది. దీంతో అమ్మాయిలు యుక్త వయసులోకి వచ్చిన తర్వాత, లైంగిక జీవితాన్ని ప్రారంభించడానికి ముందు హెచ్‌పీవీ టీకాలు వేయిస్తే.. క్యాన్సర్‌ను అరికట్టడంలో మంచి ఫలితం ఉంటుందని డాక్టర్లు చెబుతున్నారు.సర్వైకల్ క్యాన్సర్ తొలి దశలో ఎలాంటి లక్షణాలు కనిపించవు అందుకే దీన్ని సైలెంట్ కిల్లర్ అని పిలుస్తారు. వ్యాధి ముదురుతున్న కొద్దీ లక్షణాలు ఒక్కొక్కటిగా బయటపడతాయి. వ్యాధి బారిన పడ్డామని గ్రహించేలోపే అది ముదిరిపోతోంది. దీని వల్ల చికిత్స ఖర్చు పెరిగిపోవడంతోపాటు ప్రాణాలు కాపాడటం కష్టంగా మారుతోంది. ఈ పరిస్థితిని అధిగమించడానికి కిశోర బాలికలకు వ్యాక్సిన్ ఇవ్వడం ఉత్తమ పరిష్కారంగా డాక్టర్లు చెబుతున్నారు. 30 ఏళ్ల వయసు దాటిన మహిళలు క్రమం తప్పకుండా స్క్రీనింగ్ చేయించుకోవాలని సూచిస్తున్నారు.హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను బయట కొనుగోలు చేయాలంటే.. ఒక్కో డోసుకు కనీసం రూ.2 వేల నుంచి గరిష్ఠంగా రూ.4 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. 15 ఏళ్లు వచ్చిన అమ్మాయిలకు మూడు డోసుల వ్యాక్సిన్ ఇస్తారు. ఇది తల్లిదండ్రులకు ఆర్థికంగా భారం అవుతుంది. దీంతో ప్రభుత్వమే ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయించుకుంది. ఇందుకోసం వైద్య ఆరోగ్య శాఖ ఇప్పటికే ఏర్ప?ట్లు పూర్తి చేసింది. టీకాలు పంపిణీ చేసే సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు.

# 3 నగరాల్లో ఫుడ్ స్ట్రీట్స్...

**వరంగల్ ఫిబ్రవరి 17, పెన్ పవర్:** తెలంగాణలోని హన్మకొండ, నిజామాబాద్, మహబూబ్‌నగర్ నగరాల ప్రజలకు గుడ్ న్యూస్. సాయంత్రం కుటుంబంతో కలిసి స్ట్రీడ్ ఫుడ్‌ను ఎంజాయ్ చేసేలా ఈ మూడు నగరాల్లో త్వరలోనే హెల్తీ అండ్ హైజినిక్ ఫుడ్‌స్ట్రీట్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే దీని కోసం స్థలాల అన్వేషణ పూర్తి కాగా.. త్వరలోనే మిగతా ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ ఫుడ్ స్ట్రీట్లలో స్టాల్స్ ఏర్పాటు చేయాలని భావించే వారు ఫుడ్ సేఫ్టీ నిబంధనలనుతప్పనిసరిగా పాటించాలి.చాలా మందికి స్ట్రీట్ ఫుడ్ అంటే ఇష్టం. సాయంత్రం అయితే చాలు బజ్జీలు, పునుగులు, పానీపూరీ.. ఇలా ఏదో ఒకటి లాగించకపోతే మనసు ఊరుకోదు. అయితే వాటిని తయారు చేయడానికిఎలాంటి పదార్థాలు వాడుతున్నారు? వాటిని విక్రయించే ప్రదేశాల్లో పరిసరాలు శుభ్రంగా ఉంటాయో లేవో అనే భయం చాలా మందికి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ప్రజలకు హైజనిక్ స్ట్రీట్ ఫుడ్ అందేలా చూడటం కోసంకేంద్రం ప్రభుత్వం కీలక ప్రయత్నం చేస్తోంది. దేశవ్యాప్తంగా 100 హెల్తీ అండ్ హైజినిక్ ఫుడ్ స్ట్రీట్లను ఏర్పాటు చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటికే 86 సెంటర్లకు అనుమతులు ఇచ్చింది. నేషనల్ హెల్త్‌మిషన్ ద్వారా ఒక్కో సెంటర్ కోసం కోటి రూపాయలు చొప్పున నిధులు మంజూరు చేస్తోందిఈ క్రమంలోనే తెలంగాణలోని హనుమకొండ, నిజామాబాద్, మహబూబ్‌నగర్ నగరాల్లో హెల్తీ అండ్ హైజినిక్ ఫుడ్ స్ట్రీట్లనుఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఈ నగరాల్లో ఫుడ్ స్ట్రీట్ల ఏర్పాటుకు అనువైన స్థలాలను సైతం గుర్తించారు. సామాన్య ప్రజలు ఆహారం క్వాలిటీ గురించి, అందులో వాడిన పదార్థాల గురించి ఎలాంటి భయం లేకుండా..ఆహ్లాదకరమైన వాతావరణంలో ఫుడ్‌ను ఎంజాయ్ చేసేలా ఫుడ్ స్ట్రీట్స్ ఉంటాయి. దుమ్ము ధూళితో ఇబ్బంది లేకుండా చూడటం కోసం, సులభంగా శుభ్రం చేసేందుకు వీలుగా ఫుడ్ స్ట్రీట్స్ ప్రాంగణం మొత్తం టైల్స్ వేస్తారు. రాత్రి టైంలో ఆకర్షణీయమైన లైటింగ్‌ను సైతం ఏర్పాటు చేయనున్నారు.ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సర్టిఫికెట్ ఉన్న వారికి మాత్రమే ఫుడ్ స్ట్రీట్స్‌లో స్టాల్స్ కేటాయిస్తారు. ఖీూూా× నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చూస్తారు. ఆహార పదార్థాలను ఎలాజాగ్రత్తపర్చాలి, పరిశుభ్రంగా ఎలా ఉండాలనే విషయమై వెండర్లకు ట్రైనింగ్ కూడా ఇవ్వనున్నారు. ఈ స్టాల్స్‌లో వంట చేసే వారు, ఆహారాన్ని అందించేవారు తప్పనిసరిగా చేతులకు గ్లోవ్స్ పెట్టుకోవాలి. వెంట్రుకలుఆహారంలో పడకుండా తలకు ఆప్రాన్ పెట్టుకోవాలి. గోర్లు పెంచుకోవడం, వేళ్లకు ఉంగరాలు పెట్టుకోవడం కుదరదు. పొగాకు నమలడం, సిగరెట్లు, బీడీలు కాల్చడం నిషేధం. ఆహార పదార్థాల తయారీకి వాడేముడిసరుకులతోపాటు, ఫుడ్ ఐటెమ్స్ క్వాలిటీని ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తారు.అంతే కాదు ఈ ఫుడ్ స్ట్రీట్స్‌లో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి కస్టమర్లు తాగడానికి శుద్ధ జలాన్ని అందిస్తారు. చేతులుశుభ్రం చేసుకోవడానికి ప్రత్యేకంగా వాష్ ఏరియాలు ఉంటాయి. ఫ్యామిలీతో సరదాగా టైం గడుపుతూ, ఫుడ్‌ను ఎంజాయ్ చేయడం కోసం బెంచీలను ఏర్పాటు చేస్తారు.

# ఆర్గానిక్ వస్తువుల కోసం యాప్

**హైదరాబాద్, ఫిబ్రవరి 17, పెన్ పవర్:** ం: తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. సేంద్రియ ఉత్పత్తులకు ప్రత్యేక యాప్ తీసుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం యాప్‌ను సిద్ధం చేస్తోంది. నకిలీల నుంచి విముక్తి కల్పించేలా యాప్ తీసుకొస్తున్నారు. ఈ యాప్‌లో సమగ్ర సమాచారం ఉండేలా ప్లాన్ చేశారు. అటు రైతులు, ఇటు ప్రజలకు ఉపయోగంగా ఉండేలా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. త్వరలోనే ఈ యాప్ అందుబాటులోకి వస్తుంది అంటున్నారు.తెలంగాణలో రైతులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. కొంతకాలంగా ప్రజలు ఆర్గానిక్ ఉత్పత్తులు ఉపయోగిస్తున్నారు.. కొంతకాలంగా విక్రాలు కూడా పెరిగాయి. ఇదే క్రమంలో ఆర్గానిక్ పేరుతో నకిలీవి కూడా మార్కెట్‌లోకి వస్తున్నాయి. ఈ క్రమంలో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.. అసలు ఏదో, నకిలీవి ఏవో తెలియడం లేదు.. రైతులు కూడా ఇబ్బందిపడుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. ఓ యాప్‌ను తీసుకొస్తోంది. త్వరలోనే ఆర్గానిక్ యాప్‌ను సిద్ధం చేస్తామని అధికారులు చెబుతున్నారు. రైతులు వారి ఉత్పత్తులతో ఆదాయం పెంచుకునేందుకు ఈయాప్ ఎంతో ఉపయోగంగా ఉంటుంది. సాగును ప్రోత్సహించేందుకు రాయితీలూ ఇవ్వనుంది.తెలంగాణలో 50వేల ఎకరాల్లో 10వేలమంది వరకు రైతులు ఆర్గానిక్ వ్యవసాయం చేస్తున్నారు. వరితో పాటుగా కూరగాయలు, నూనె గింజలు, పప్పుధాన్యాలు సాగు చేస్తున్నారు. మరికొందరు రైతులు పండ్ల తోటలు కూడా సాగు చేస్తున్నారు. రైతులు ఈ ఆర్గానిక్ సాగు కోసం ఎలాంటి పురుగుల మందు, ఎరువులు, ఇతర కెమికల్స్ ఉపయోగించరు. కేవలం జీవ పదార్థాలతో పంటల్ని సాగు చేస్తారు. అయితే పంట చేతికి వచ్చిన తర్వాత మార్కెటింగ్ ఎలా చేయాలో తెలియని పరిస్థితి. వీరు షాపులు, షాపింగ్ మాల్స్, షాపులకు ఈ ఉత్పత్తుల్ని పంపిస్తారు. ఆర్గానిక్ ఉత్పత్తుల్ని పెద్దగా ఎగుమతి కూడా చేయడం లేదు.ఆర్గానిక్ విత్తనాలు, ఉత్పత్తులకు 2015లో టీఎస్ఎస్వోసీఏ (తెలంగాణ రాష్ట్ర విత్తన, సేంద్రియ ధ్రువీకరణ ప్రాధికార సంస్థ) ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆర్గానిక్ ఉత్పత్తుల కోసం ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.. లైసెన్స్ వచ్చిన తర్వాత లేబుల్స్‌తో ఈ ఉత్పత్తుల్ని విక్రయించాల్సి ఉంటుంది. అయితే తెలంగాణలో 200 సంస్థలు లైసెన్సులు తీసుకున్నాయి. రైతులు కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. అయితే చాలామంది రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవడం లేదు. కొందరు రైతులు వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి సమస్యను వివరించారు. తాము నకిలీ ఉత్పత్తుల కారణంగా నష్టపోతున్నామని మంత్రికి ఫిర్యాదు చేశారు. దీంతో స్పెషల్‌గా యాప్ తీసుకురావాలని మంత్రి తుమ్మల సూచించారు. ఈ క్రమంలో యాప్‌ను సిద్ధం చేస్తున్నారు.టీఎస్ఎస్వోసీఏ (తెలంగాణ విత్తన, సేంద్రియ ధ్రువీకరణ ప్రాధికార సంస్థ) యాప్ ద్వారా సమాచారాన్ని పొందుపరుస్తారు. ఈ మేరకు రాష్ట్రంలో ఏ రైతు, ఏ పంట సాగు చేస్తున్నారో, ఎక్కడ సాగు చేస్తున్నారో, ఆ ఉత్పత్తులు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయో వివరాలు అందుబాటులో

ఉంటాయి. రైతుల సమాచారం (అడ్రస్, మొబైల్ నంబర్, ఫోటోలు, వీడియోలు) నమోదు చేస్తారు. ఈ యాప్‌తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన యాప్‌ను కనెక్ట్ చేస్తారు. ఆర్గానిక్ ఉత్పత్తులు కొనుగోలు చేయడం.. ఎగమతుల సంస్థల వివరాలు కూడా ఉంటాయి. ఉత్పత్తులకు సంబందించిన వివరాలు వినియోగదారులకు అందుబాటులో ఉంటాయి.

# వంటనూనెల్లో స్వావలంబన దిశగా తెలంగాణ

**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశ ఆర్థిక వ్యవస్థలో వంట నూనెల దిగుమతి భారం ఒక తీరని లోటుగా మారుతోంది. ఏటా సుమారు రూ. 1.5 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని మనం కేవలం పామ్ ఆయిల్ దిగుమతుల కోసమే వెచ్చిస్తున్నాం.ఈ నేపథ్యంలో, దేశాన్ని వంట నూనెల రంగంలో 'ఆత్మనిర్భర్' గా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకమైన నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్‌ను ప్రవేశపెట్టాయి.. ఈ లక్ష్య సాధనలో తెలంగాణ రాష్ట్రం, ముఖ్యంగా ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఒక నిశ్శబ్ద విప్లవానికి నాంది పలికింది. తెలంగాణ ప్రభుత్వం వంట నూనెల దిగుమతి భారాన్ని తగ్గించే లక్ష్యంతో ఆయిల్ పామ్ సాగును ఉద్యమంలా ముందుకు తీసుకెళ్తోంది. కేవలం సాగుకే పరిమితం కాకుండా, దానిని పారిశ్రామికాభివృద్ధితో అనుసంధానించటం ద్వారా రాష్ట్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థను సమూలంగా మారుస్తోంది. ఆయిల్ పామ్ సాగు కేవలం పొలాల్లోనే కాకుండా, పరిశ్రమల స్థాపనలోనూ కీలక పాత్ర పోషిస్తోంది. పండించిన గెలలను (ఈఈః) తక్షణమే ప్రాసెస్ చేయాల్సి ఉండటంతో, ప్రతి సాగు జోన్‌లో ప్రాసెసింగ్ మిల్లుల నిర్మాణం యుద్ధ ప్రతిపాదికన జరుగుతోంది. ఉపాధి విషయానికి వస్తే ఒక్కో ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా వందలాది మందికి నేరుగా, వేలాది మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తోంది. ఒకప్పుడు ఆయిల్ పామ్ అంటే కేవలం కోస్తా తీర ప్రాంత పంట అనే అపోహ ఉండేది. కానీ నేడు తెలంగాణలోని ఉమ్మడి ఖమ్మం జిల్లా, మహబూబాబాద్, జనగామ, సిద్దిపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల్, నారాయణపేట, సూర్యాపేట వంటి జిల్లాల్లో ఈ పంట ఆశాజనకమైన ఫలితాలను ఇస్తోంది. క్షేత్రస్థాయిలో మేము గమనించిన ప్రధాన మార్పు 'ప్రభుత్వ భరోసా'. గతంలో కొన్ని ప్రైవేటు కంపెనీల వైఫల్యాల వల్ల రైతుల్లో నెలకొన్న అపనమ్మకాన్ని తొలగించి, ఆయిల్ ఫెడ్ నేరుగా రంగంలోకి దిగడం సాగు విస్తరణకు బలమైన ఊతాన్నిచ్చింది. ఈ విప్లవం విజయవంతం కావడం వెనుక వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, టీజీ ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డిల సమన్వయం కీలకమైంది. ప్రతి జిల్లాలో ప్రాసెసింగ్ యూనిట్లు ఉండాలన్నది మంత్రి ఆశయం. ప్రైవేటు కంపెనీలు జాప్యం చేస్తే, ఆ జోన్లను రద్దు చేసి ప్రభుత్వ సంస్థ అయిన ఆయిల్ ఫెడ్‌కు అప్పగిస్తామని ఆయన కఠినంగా వ్యవహరిస్తూ, పనులను వేగవంతం చేస్తున్నారు.. ఆయిల్ ఫెడ్ చైర్మన్ హోదాలో క్షేత్రస్థాయిలో ఉమ్మడి 10 జిల్లాల్లో పది లక్షల ఎకరాల సాగు లక్ష్యంతో రైతుల్లో నమ్మకాన్ని నింపుతున్నారు. ఉమ్మడి పది జిల్లాలలో 10 లక్షల ఎకరాల సాగు లక్ష్యంతో విస్తృత ప్రచారం నిర్వహిస్తూ, రైతులకు సాంకేతిక ఆర్థిక భరోసాను అందిస్తున్నారు. ఆయిల్ పామ్ రైతుకు ఒక రకంగా 'పెన్షన్' వంటి పంట. సంప్రదాయ పంటలతో పోలిస్తే ఇది అత్యధిక ఆదాయాన్నిస్తుంది. ఒక ఎకరా తోట ద్వారా ఏడాదికి సగటున (ప్రారంభంలో 6 నుంచి ఆ పైన) 10 నుండి 12 టన్నుల గెలల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం టన్ను ధర సుమారు ?20,456- (జనవరి 2026 నాటికి) ఉంది. అంటే, ఎకరాకు అన్ని ఖర్చులు పోను ఏడాదికి ? 1.5 లక్షల నుండి? 2 లక్షల నికర ఆదాయం రైతుకు లభిస్తుంది. సూక్ష్మ నీటి పారుదల ద్వారా ఇతర పంటల కంటే 40% నీటిని ఆదా చేయవచ్చు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట వద్ద ఆయిల్ ఫెడ్ నిర్మించిన ప్రాసెసింగ్ మిల్లు తెలంగాణ గర్వించదగ్గ సాంకేతిక అద్భుతం. సుమారు ?300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ మిల్లు ఆరంభ దశలో గంటకు 30 మెట్రిక్ టన్నుల గెలలను క్రష్ చేసే సామర్థ్యం కలిగి ఉంది, దీనిని భవిష్యత్తులో 60 ఒఖఊ కి విస్తరించే అవకాశం ఉంది. ఇది 'జీరో వేస్ట్' టెక్నాలజీతో పని చేస్తుంది. ఇక్కడ వెలువడే వ్యర్థాల నుండి విద్యుత్ ఉత్పత్తి, సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాలు కూడా అనుసంధానించబడి ఉన్నాయి. ఇది రైతులకు స్థానికంగానే మార్కెటింగ్ భరోసాను కల్పిస్తోంది. ఇందులో 4 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం, అత్యాధునిక రిఫైనరీ మరియు నీటి పునర్వినియోగం వంటి సౌకర్యాలు ఉన్నాయి. ఇది సిద్దిపేటతో పాటు యాదాద్రి భువనగరి, జనగామ, మహబూబాబాద్, గద్వాల్, నారాయణపేట

జిల్లాల రైతులకు కూడా ప్రయోజనం చేకూ ర్చనుంది. గతంలో ఎదురైన చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఇప్పుడు ప్రభుత్వం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ రీసెర్చ్ ధృవీకరించిన మేలురకం మొక్కలను మాత్రమే సరఫరా చేస్తోంది. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ రైతులకు 100%, ఇతరులకు 90% డ్రిప్ రాయితీనిస్తోంది. అలాగే, మొక్కలు నాటిన మొదటి నాలుగేళ్లలో నిర్వహణ కోసం ఎకరానికి సుమారు ?52,000 వరకు రాయితీ నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేయబడుతోంది. తెలంగాణను 'ఆయిల్ పామ్ హబ్'గా మార్చాలన్న ప్రభుత్వ సంకల్పానికి ఉత్తర తెలంగాణ, దక్షిణ తెలంగాణ జిల్లాల రైతులు అద్భుతంగా స్పందిస్తున్నారు. ప్రైవేటు సంస్థ ల వైఫల్యం తర్వాత పగ్గాలు చేపట్టిన ఆయిల్ ఫెడ్, నర్మెట్ట, బీచుపల్లి ఫ్యాక్టరీల ఏర్పాటు ద్వారా పారిశ్రామిక తోడ్పా టును అందిస్తోంది. జర్నలిజం సమాచారాన్ని విశ్లేషిస్తే, లైజనింగ్ వ్యవస్థ దాన్ని అమలులోకి తెస్తుంది. ఈ రెండింటి సమన్వయంతో తెలంగాణ రైతు పాలిట ఆయిల్ పామ్ సాగు నిజమైన 'అక్షయ పాత్ర'గా నిలవబోతోంది.

# రాజకీయ రొచ్చులోకి హీరోయిన్లు
# తెలంగాణలో రకుల్.. తమిళంలో త్రిష

**హైదరాబాద్ పెన్ పవర్:**
అమ్మ, ఆలి, చెల్లి... ఆడవాళ్ళ ప్రస్తావన లేకుండా తిట్టు చూద్దాం అని ఓ సినిమాలో విలన్‌కు సవాల్ విసురుతాడు హీరో. ఇప్పుడు రాజకీయ నాయకులకు సైతం ఈ విధమైన సవాల్ విసరాలేమో!? హీరోయిన్లను అడ్డు పెట్టుకుని విమర్శలు వద్దని, కేవలం రాజకీయాలకు మాత్రమే పరిమితం కావాలని! ఎందుకంటే... తెలంగాణలో రకుల్ ప్రీత్ సింగ్, తమిళనాడులో త్రిషను కొందరు నేతలు తమ స్వార్థం కోసం రాజకీయాల్లోకి లాగుతూ ప్రత్యర్థి పార్టీ నాయకులను టార్గెట్ చేశారు.త్రిషకు, రాజకీయాలకు సంబంధం లేదు. ప్రత్యేక్షంగా ఎవరికీ, ఏ రాజకీయ పార్టీకి త్రిష మద్దతు ఇచ్చిన సందర్భాలు లేవు. కానీ, ఇప్పుడు తమిళ రాజకీయాలు ఆమె చుట్టూ తిరుగుతున్నాయి. అందుకు కారణం కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ పార్టీ స్థాపించి రాజకీయాల్లోకి రావడం.తమిళ రాజకీయాల్లో తాను ఒంటరిగా పోటీ చేస్తానని దళపతి విజయ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దాంతో మిగతా రాజకీయ పార్టీలు ఆయనపై కత్తి కట్టాయి. అది సహజం. విజయ్ 'జన నయగన్' విడుదలకు అడ్డంకులు ఏర్పడ్డాయి. అందులో రాజకీయ కోణం చూస్తున్నారు కొందరు. నిజానిజాలు పక్కన పెడితే... విజయ్ వరకు సంబంధించిన వ్యవహారం అది.విజయ్ మీద విమర్శలు గుప్పించే క్రమంలో తమిళనాడు భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు నయనార్ నాగేంద్రన్ ఓ అడుగు ముందుకేసి... త్రిష ఇంటి నుంచి విజయ్ బయటకు రావాలని కామెంట్ చేశారు. ఆయన వ్యాఖ్యలపై విజయ్ - త్రిష అభిమానులు, మహిళా సంఘాలు భగ్గుమన్నాయ్. తెలంగాణలోనూ ఈ విధమైన నీచ రాజకీయాలు ఇటీవల జరిగాయి.భారతీయ రాష్ట్ర సమితి నాయకుడు, కేసీఆర్ తనయుడు కల్వకుంట్ల తారక రామారావు (కేఆర్ఆర్)కు, కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్‌కు ముడి పెడుతూ విమర్శలు చేశారు, ఇంకా చేస్తున్నారు ప్రత్యర్థులు. ఆ మధ్య సమంత వ్యక్తిత్వాన్ని తక్కువ చేసేలా విమర్శలు చేసి తర్వాత క్షమాపణలు చెప్పారు కొండా సురేఖ. తెలంగాణ రాజకీయ విమర్శల్లో అప్పుడప్పుడూ సురేఖా



వాణి పేరూ వినిపిస్తూ ఉంటుంది. ఆ మధ్య తమిళనాడు రాజకీయాల్లో ప్రదీప్ రంగనాథన్ 'డ్రాగన్', విశ్వక్ సేన్ 'ఫంకీ' హీరోయిన్ కయాదు లోహర్ పేరు హైలైట్ అయ్యింది. ఎందుకు? రాజకీయాల్లో హీరోయిన్లను టార్గెట్ చేయడం ఎందుకు? ఇప్పుడు చిత్ర పరిశ్రమ నుంచి కాదు... సామాన్యుల నుంచి వ్యక్తం అవుతున్న ప్రశ్న. విలువలతో కూడిన రాజకీయాలను కొందరు ఎప్పుడో వదిలేశారు. కనీసం ఆడవాళ్లను తీసుకు రాకుండా రాజకీయాలు చేయలేరా? సినిమాల్లో విజయ్ - త్రిషది హిట్ పెయిర్. కొన్ని సినిమాలు చేసిన హీరో హీరోయిన్ల మధ్య పరిచయం ఉంటుంది. సినిమాల్లో ఉన్నట్టు బయట ఉంటారని విమర్శలు చేయడం ఎంత వరకు సబబు? అసలు రాజకీయాలతో సంబంధాలు లేని రకుల్ పేరు లాగడం ఎందుకు??తమిళనాడులో త్రిష... తెలంగాణలో రకుల్... రాజకీయాలకు సాఫ్ట్ టార్గెట్ కింద మారారు. సినిమాల్లో నటించడం, తమ పని ఏదో తాము చూసుకోవడం తప్ప ఈ తరహా రాజకీయ విమర్శలకు బదులు ఇవ్వరు. ఒకవేళ ఇస్తే మళ్ళీ మళ్ళీ వచ్చే రాజకీయ విమర్శలు అన్నిటికీ బదులు ఇవ్వవలసి ఉంటుంది. అందుకని, త్రిష - రకుల్ మౌనం వహిస్తున్నారు. విమర్శలను వాదిస్తున్నారు. దాంతో కొందరు రాజకీయ నాయకులు - వాళ్ళ అనుచరులకు చెందిన సోషల్ మీడియా ఖాతాల్లో హీరోయిన్లపై వ్యక్తిత్వ దాడి కొనసాగిస్తోంది. దీనికి చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది.

# రాజకీయామా నీదే పార్టీ

**హైదరాబాద్ పెన్ పవర్:**
తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత విచిత్రమైన , ఆసక్తికరమైన సమీకరణాలకు తెరలేపాయి. సిద్ధాంతపరంగా బద్ధశత్రువులుగా కనిపించే పార్టీలు క్షేత్రస్థాయిలో అధికారం కోసం చేతులు కలపడం 'అవకాశవాద రాజకీయం'గా కనిపిస్తున్నా, దీని వెనుక లోతైన వ్యూహాలు దాగి ఉన్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీల కంటే స్థానిక గెలుపు గుర్రాలే కీలకం కావడంతో చాలా చోట్ల అనూహ్య పొత్తులు కనిపించాయి. బీజేపీ-కాంగ్రెస్, బీఆర్ఎస్-బీజేపీ వంటి అసంభవమైన కలయికలు కొన్ని మున్సిపాలిటీల్లో అధికార పీఠాలను కైవసం చేసుకున్నాయి. నిజామాబాద్ వంటి చోట్ల కాంగ్రెస్-మజ్లిస్ జతకట్టడం గమనార్హం. రాష్ట్ర స్థాయిలో నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నా, స్థానిక కౌన్సిలర్లు మాత్రం తమ ఉనికిని కాపాడుకోవడానికి పార్టీల మధ్య ఉన్న గీతలను చెరిపివేశారు.బీఆర్ఎస్ నేత హరీష్ రావు వంటి వారు ఇతర పార్టీల అనైతిక పొత్తులపై విమర్శలు గుప్పిస్తున్నప్పటికీ, స్థానిక సమీకరణాలు ఎప్పుడూ భిన్నంగానే ఉంటాయి. గ్రామీణ , పట్టణ స్థానిక సంస్థల్లో నాయకత్వం వ్యక్తిగత ప్రాబల్యంపై ఆధారపడి ఉంటుంది. అసెంబ్లీ లేదా పార్లమెంట్ ఎన్నికల నాటికి ఈ సమీకరణాలు మారిపోయి, మళ్ళీ ఆయా పార్టీల అధిష్టానాల ఆదేశాల మేరకు

రాజకీయాలు నడుస్తాయి. అయితే ఈ మున్సిపల్ ఎన్నికలు పార్టీల మధ్య ఉన్న రాజకీయ అంటరానితనం పోయిందని స్పష్టం చేశాయి.ఈ ఎన్నికల తర్వాత అత్యంత ఆసక్తికరమైన చర్చ బీజేపీ - బీఆర్ఎస్ పొత్తు గురించి మొదలైంది. కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోవాలంటే ఈ రెండు పార్టీలు కలవడం ద్వారా ఓటు బ్యాంక్ ఏకీకరణ జరుగుతుందని ఒక వర్గం అభిప్రాయపడుతోంది. ముఖ్యంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు పార్టీల ఓట్ షేర్ కలిపితే అది అధికార పార్టీ కంటే ఎక్కువగా ఉండటమే ఈ చర్చకు ప్రధాన కారణం. కాంగ్రెస్‌ను బలహీనపరచడానికి ఈ రహస్య లేదా బహిరంగ పొత్తు మున్సిపల్ స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి వెళ్లే అవకాశం ఉందా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.బీజేపీకి పట్టణ ప్రాంతాల్లో, బీఆర్ఎస్‌కు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పట్టును కలిపితే బలమైన శక్తిగా ఎదగవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ఒంటరిగా ఎదుర్కోవడం కంటే, ఉమ్మడి శత్రువును ఓడించడానికి రెండు పార్టీలు చేతులు కలపడం వ్యూహాత్మకంగా లాభిస్తుంది. అయితే, ఈ పొత్తు వల్ల ఇరు పార్టీల సిద్ధాంతాలకు తూట్లు పొడిచినట్లవుతుందనే భయం కూడా నాయకత్వాల్లో ఉంది. మైనారిటీ ఓట్లు కోల్పోతామనే భయం బీఆర్ఎస్‌కు ఉంటే, హిందుత్వ ఓటు బ్యాంకులో చీలిక వస్తుందేమోనన్న ఆందోళన బీజేపీలో ఉంది.రాబోయే రోజుల్లో ఈ రెండు పార్టీలు పొత్తుల గురించి ఆలోచన చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఎందుకంటే, తెలంగాణలో కాంగ్రెస్‌ను ఒంటరిగా ఢీకొట్టడం ప్రస్తుత పరిస్థితుల్లో కష్టతరమని ఈ మున్సిపల్ ఫలితాలు నిరూపించాయి. రాష్ట్ర స్థాయి రాజకీయం ఎప్పుడూ అధికారం చుట్టూనే తిరుగుతుంది కాబట్టి, భవిష్యత్తులో బీజేపీ-బీఆర్ఎస్ కలిసి పనిచేయడం అనేది అసాధ్యమేమీ కాదు. అయితే అది బహిరంగ పొత్తుగా ఉంటుందా లేదా లోపాయికారి ఒప్పందంగా ఉంటుందా అనేది కాలమే నిర్ణయించాలి.

## అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యం: కోరం

**పినపాక, ఫిబ్రవరి 17 పెన్ పవర్:** ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎంపికపై అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యమని ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. స్వతంత్ర అభ్యర్థులుగా గెలిచిన కొర్లపాటి శివకిరణ్, షేక్ సైదుమియాకు ఇల్లెందు క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మంగళవారం ఉదయం 11 గంటల్లోపు గెలిచిన అభ్యర్థులంతా ప్రమాణ స్వీకారం నిమిత్తం పురపాలిక కార్యాలయానికి రావాలని సూచించారు. అధిష్ఠానం ప్రకటించిన ఛైర్మన్, వైస్ ఛైర్మన్లకు కాంగ్రెస్ అభ్యర్థులు మద్దతు తెలపాలన్నారు.

## కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

**మహబూబాబాద్, ఫిబ్రవరి 17 పెన్ పవర్:** మహబూబాబాద్ పట్టణానికి చెందిన బిఆర్ఎస్ యువ నాయకులు, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదినాన్ని పురస్కరించుకుని కురవిలోని గుండ్రాతి మడుగు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేసీఆర్ పై అభిమానంతో, ఆయన మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 2028 సార్వత్రిక ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి మళ్లీ అధికారంలోకి వచ్చి ప్రజలకు మంచి పాలన అందించాలని వారు కోరుకున్నారు.

## డోర్నకల్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ గా కొండేటి రాజకుమారి



**డోర్నకల్, ఫిబ్రవరి 17 పెన్ పవర్:**మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మున్సిపాలిటీలో చైర్ పర్సన్ గా కాంగ్రెస్ పార్టీకి చెందిన కొండేటి రాజకుమారి, వైస్ చైర్మన్ గా మాదా లావణ్య ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల ఫలితాలను మంగళవారం అడిషనల్ కలెక్టర్ అనిల్ కుమార్ ప్రకటించారు. మొత్తం 15 వార్డులకు గాను, కాంగ్రెస్ 11 వార్డుల్లో విజయం సాధించగా, బీఆర్ఎస్ 4 వార్డుల్లో గెలుపొందింది. ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ నిన్న హాజరు కాకపోవడంతో నేడు చైర్ పర్సన్ ఎన్నిక ప్రక్రియ జరిగింది.

## లక్కీడ్రా లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చైర్ పర్సన్

**జనగామ, ఫిబ్రవరి 17 పెన్ పవర్:** జనగామ మున్సిపాలిటీలో రెండు రోజులుగా ఉత్కంఠభరితంగా సాగిన ఛైర్మన్ పీఠం ఎంపికలో లక్కీ డ్రా ద్వారా కాంగ్రెస్ అభ్యర్థి బాలమణి విజయం సాధించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు సమాన బలం ఉండటంతో, అధికారులు డ్రా పద్ధతిలో ఛైర్మన్ పదవికి అభ్యర్థిని ఖరారు చేశారు. ఈ ఫలితంతో జనగామ మున్సిపాలిటీలో రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి.

## లక్కీడ్రాలో తొర్రూరు మున్సిపాలిటీ కాంగ్రెస్ వశం!

**పాలకుర్తి, ఫిబ్రవరి 17 పెన్ పవర్:**మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. రెండవ వార్డు కౌన్సిలర్ తూనం శ్రవణ్ ఛైర్మన్ పదవిని గెలుచుకున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి అలివేలు, కాంగ్రెస్ అభ్యర్థి శ్రావణ్ ఇద్దరికీ సమాన ఓట్లు రావడంతో అధికారులు డ్రా తీయగా, శ్రావణ్ పేరు రావడంతో కాంగ్రెస్ పార్టీ ఛైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంది.

## నిజాంపేట్ ఆలయంలో అన్నదానం: వేలాది మందికి ప్రసాద వితరణ

**స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 17 పెన్ పవర్:** నిజాంపేట్ శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రతి మంగళవారం భక్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వంద మందితో ప్రారంభమైన ఈ సేవా కార్యక్రమం ప్రస్తుతం కనీసం 2000 మందికి అన్న ప్రసాదం అందిస్తోంది. భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో, ఈ అన్నదానం స్థానికంగా ఆదర్శంగా నిలుస్తోంది. బాచుపల్లిలో జరుగుతున్న ఈ కార్యక్రమం భక్తి భావంతో కొనసాగుతోంది.

## నర్సింహులపేట లో బిఆర్ఎస్ పార్టీ శ్రేణుల నిరసన

**ములుగు, ఫిబ్రవరి 17 పెన్ పవర్:** మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రం వద్ద మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును తొర్రూర్ లో అరెస్ట్ చేసి మహబూబాబాద్ కు తరలిస్తుండగా, నర్సింహులపేట వద్ద బీఆర్ఎస్ శ్రేణులు పోలీసు వాహనాలను అడ్డుకుని నిరసన తెలిపారు. అరెస్టును ఖండిస్తూ నినాదాలు చేశారు. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చి వాహనాన్ని ముందుకు తరలించారు.

## మండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి అరెస్ట్

**భూపాలపల్లి, ఫిబ్రవరి 17 పెన్ పవర్:** వరంగల్ తొర్రూరు మున్సిపాలిటీ ఛైర్మన్ ఎన్నిక వాయిదా పడటంతో, శాసన మండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారిని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇంఛార్జిగా నియమించారు. ఈ నేపథ్యంలో, మధుసూదనాచారి తొర్రూరు వెళ్లకుండా పోలీసులు భూపాలపల్లి కేంద్రంలో హౌస్ అరెస్ట్ చేశారు. ఈ పరిణామం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశమైంది.

## జహీరాబాద్ మున్సిపల్ పీఠం కాంగ్రెస్ కైవసం

**జహీరాబాద్, ఫిబ్రవరి 17 పెన్ పవర్:** జహీరాబాద్ మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. మున్సిపల్ ప్రత్యేక అధికారి ఆర్డీవో దేవజ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు ప్రమాణస్వీకారం చేశారు. మహమ్మద్ యునుస్ ఇద్దరు ఎంఐఎం, ముగ్గురు స్వతంత్ర అభ్యర్థుల మద్దతుతో మున్సిపల్ ఛైర్మన్ గా ఎన్నికయ్యారు. కొత్త కాపు శిరీష వైస్ ఛైర్మన్ గా ఎన్నికయ్యారు. ఈ విజయంతో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి.

## జహీరాబాద్ కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం వాయిదా

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 17 పెన్ పవర్:** కోరం లేకపోవడంతో వాయిదా పడిన జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం జరిగింది. ఎమ్మెల్యే మాణిక్ రావు ప్రవేశ ద్వారం వద్ద రిజిస్టర్ లో సంతకం చేసి సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పలువురు అధికారులు, నాయకులు హాజరయ్యారు.

# కేసీఆర్ సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శం



**బెల్లంపల్లి, ఫిబ్రవరి 17 పెన్ పవర్:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పేర్కొన్నారు. మంగళవారం బెల్లంపల్లిలో కేసీఆర్ 72వ పుట్టినరోజు సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, బీఆర్ఎస్ నాయకులకు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

# మంత్రి వివేక్ కాన్వాయ్‌పై రాళ్ల దాడి!

**మంచిర్యాల, ఫిబ్రవరి 17 పెన్ పవర్:**మంచిర్యాల జిల్లా క్యాతన్పల్లిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మంత్రి వివేక్ కాన్వాయ్‌పై బీఆర్ఎస్ కార్యకర్తలు రాళ్లు విసిరారు. ఈ ఘటనలో పోలీసులపై కూడా దాడి జరిగినట్లు సమాచారం. కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుంది. పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఈ సంఘటనతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# మాజీ ఎమ్మెల్యే సుమన్ పై రాళ్లతో దాడి !

**చెన్నూరు, ఫిబ్రవరి 17 పెన్ పవర్:** మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీలో ఛైర్మెన్ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకులు రాళ్ల దాడికి పాల్పడ్డారని సమాచారం. ఈ దాడిలో బీఆర్ఎస్ నాయకుడి తలకు గాయమైంది. కౌన్సిలర్లను ఎన్నికల్లో పాల్గొనకుండా పోలీసులు అడ్డుకుంటున్నారని, అక్రమ కేసులు పెడుతున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. దీనికి నిరసనగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ నాయకులపై రాళ్లు విసిరారు. పోలీసులు బీఆర్ఎస్ నాయకులపై లాఠీఛార్జ్ చేసినట్లు సమాచారం.

# నిర్మల్ ఛైర్మెన్, వైస్ ఛైర్మన్ ఇంటింటికి వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 17 పెన్ పవర్:** నిర్మల్ జిల్లా, నిర్మల్ లో 36, 37 వార్డుల్లో ఛైర్మన్ అప్పాల కావ్య, వైస్ ఛైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి తమపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించినందుకు ఇంటింటికి వెళ్లి ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా కృషి చేస్తామని, ఎన్నికల్లో దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు కాలనీల్లోని గ్రామదేవత ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# మల్లాపూర్ లో కేసీఆర్ జన్మదిన వేడుకలు

**కోరుట్ల, ఫిబ్రవరి 17 పెన్ పవర్:**మల్లాపూర్ మండల కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక భారత మత కూడలి వద్ద మండల అధ్యక్షుడు తోట శ్రీను ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కేసీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ పాత్ర అపూర్వమని, ఆయన నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాలలో అభివృద్ధి సాధించిందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

# తండ్రి చేతిలో కొడుకు దారుణ హత్య




**ధర్మపురి, ఫిబ్రవరి 17 పెన్ పవర్:** మానకొండూరులో తండ్రి పురం కనకయ్య మద్యం మత్తులో కొడుకు శ్రీనివాస్‌ను రాయితో కొట్టి చంపాడు. ఈ ఘటనలో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. క్షణికావేశంలో జరిగిన ఈ దాడితో ఒక నిండు ప్రాణం బలి అయింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# సుల్తానాబాద్ మున్సిపల్ ఛైర్మన్ గా రాధాకృష్ణ

**పెద్దపల్లి, ఫిబ్రవరి 17 పెన్ పవర్:** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయంలో మంగళ వారం జరిగిన కార్యక్రమంలో, బిరుదు రాధాకృష్ణ మున్సిపల్ ఛైర్మన్‌గా, అంతటి పుష్పలత వైస్ ఛైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. పట్టణంలోని 15 వార్డుల నుంచి గెలుపొందిన కౌన్సిలర్లు కూడా ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణరావు నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

# రామగుండం డిప్యూటీ మేయర్ కు పాతపల్లి భరత్ శుభాకాంక్షలు

**రామగుండం, ఫిబ్రవరి 17 పెన్ పవర్:** రామగుండం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ గా బాధ్యతలు చేపట్టిన పాతిపెల్లి ఎల్లయ్య యాదవ్ ను పాతపల్లి భరత్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పాతపల్లి డివిజన్ ప్రజల తరపున కూడా ఆయన అభినందనలు తెలియజేశారు. నూతన డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ, కార్పొరేషన్ పరిధిలో రోడ్డు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, నీటి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

# వైభవంగా దుబ్బ రాజన్న ఆలయ రథోత్సవం

**జగిత్యాల, ఫిబ్రవరి 17 పెన్ పవర్:**జగిత్యాల జిల్లాలోని ప్రముఖ సేవ క్షేత్రమైన సారంగాపూర్ మండలం పెంబట్ల కోనాపూర్‌లోని దుబ్బ రాజన్న ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం రథోత్సవం ఘనంగా జరిగింది. ఒగ్గు కళాకారులు, గుస్సాడీ నృత్యాల మధ్య భక్తుల కాగడాలు, శివసత్తుల పూనకాల మధ్య శివనామ స్మరణతో భక్తులు రథం లాగారు. ఈకార్యక్రమాన్ని తిలకించడానికి భారీగా భక్తులు హాజరయ్యారు.

## ఇల్లందు నూతన మున్సిపల్ ఛైర్మెన్ గా దొడ్డ కిరణ్

**ఇల్లందు, ఫిబ్రవరి 17 పెన్ పవర్:** ఇల్లందు మునిసిపాలిటీ ఛైర్ పర్సన్ అభ్యర్థిగా రెండవ వార్డు కౌన్సిలర్ గా గెలుపొందిన దొడ్డ కిరణ్ మిత్రను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మంగళవారం ఖరారు చేసింది. దొడ్డ కిరణ్ మిత్ర భర్త పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఎన్నో సంవత్సరాలుగా పార్టీకి విధేయతగా పనిచేస్తున్న వారికే ఈ పదవి కట్టబెట్టడం విశేషం.

# మాజీ ఎమ్మెల్యేకు పలు ఆహ్వాన పత్రికలు అందజేత



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 17 పెన్ పవర్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్ నగర్ లోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ కు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, ప్రజలు పలు ఆహ్వానాలు అందజేశారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించారు. వివిధ కాలనీల వాసులు తమ సమస్యలతో కూడిన వినతి పత్రాలను ఆయన దృష్టికి తీసుకురాగా, వాటిని పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# సర్వదేవతావ్రతాల పూజలకు ఉద్దిష్టం ఫాల్గుణం

**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీమహావిష్ణువుకు ఇష్టమైన మాసాల్లో ఫాల్గుణం ఒకటి. పూర్ణిమ తిథిలో చంద్రుడు పూర్వ ఫల్గుణి లేదా ఉత్తర ఫల్గుణి నక్షత్ర సమీపంలో సంచరిస్తే, ఆ మాసాన్ని 'ఫాల్గుణి'గా పరిగణిస్తారు. ప్రధానంగా విష్ణు ప్రీతికరం అంటోంది భాగవతం. చైత్రాది మాసాల క్రమంలో చిట్ట చివరిది ఫాల్గుణం. ఇంతకు ముందు పదకొండు నెలల్లో చేసిన దేవతా పూజలు, వ్రతాలు ఈ చివరి మాసంలో మరో సారి ఆచరించడం విశేషం. అందుకే సర్వ దేవతా వ్రత సమాహారంగా, సర్వవ్రత సింహావ లోకనంగా కనిపిస్తుంది ఫాల్గుణ మాసం. ఫాల్గుణ మాసంలో ప్రతి తిథికీ ఒక ప్రత్యేకత ఉంది. ఫాల్గుణ శుద్ధ పాడ్యమి నుంచి పన్నెండు రోజులు పయోవ్రతం ఆచరించి మహా విష్ణువుకు క్షీరాన్నం నివేదిస్తే అభీష్ట సిద్ధి కలుగుతోందని భాగవత పురాణం వివరిస్తోంది. ఆదితి పయోవ్రతం ఆచరించి వామనుడిని పుత్రుడిగా పొందింది. విష్ణుపూజకు 'పయోవ్రతం' విశిష్టమైంది. దీన్ని శుద్ధ పాడ్యమి నాడు ప్రారంభించి పన్నెండు రోజుల పాటు కొనసాగిస్తారు. సమీపంలోని నదుల్లో స్నానమాచరించి, సూర్యుడికి అర్ఘ్యమిచ్చి, విష్ణువును షోడశోపచారాలతో పూజించి, పాలను నైవేద్యంగా సమర్పించడం సంప్రదాయం. పయస్సు అంటే పాలు. అదితి ఈ వ్రతం ఫలితం వల్లే వామనుడు జన్మించాడట. హరిహరసుతుడు అయ్యప్ప స్వామి, పాలకడలి నుంచి లక్ష్మీదేవి ఇదే మాసంలో జన్మించారు.

ఇక మహాత్ములైన శ్రీకృష్ణ చైతన్యులు, రామకృష్ణ పరమహంస, స్వామి దయానంద సరస్వతిలు జననం కూడా ఈ మాసంలోనే జరిగింది. అర్జునుడి జన్మ నక్షత్రం కూడా ఇదే కాబట్టి 'ఫల్గుణ' అనే పేరుంది. కురు పాండవుల్లో కొందరు ఫాల్గుణ మాసంలో జన్మించినట్లు చెబుతారు. ఫాల్గుణ బహుళ అష్టమినాడు ధర్మరాజు, ఫాల్గుణ శుద్ధ త్రయోదశి రోజున భీముడు, దుర్యోధనుడు, దుశ్శాసనులు జన్మించినట్లు పురాణాలు తెలుపుతున్నాయి. లక్ష్మీనారాయణులు, పార్వతీ పరమేశ్వరుల్ని శుద్ధ తదియనాడు పూజించి నైవేద్యం సమర్పిస్తారు. ఈ మాసంలో రెండు రోజులు వినాయకుణ్ని ఆరాధిస్తారు. శుక్ల పాడ్యమి, చతుర్థినాడు అవిఘ్న, పుత్ర గణపతి వ్రతాల్ని ఆచరిస్తారు. శుద్ధ ద్వాదశి పయోవ్రతానికి చివరిరోజు. ఈ రోజున నరసింహస్వామిని పూజిస్తారు. దివ్యౌషధంగా భావించే ఉసిరిని శుద్ధ ఏకాదశినాడు పూజించి, ఆ చెట్టు వద్దనే 'అమలక ఏకాదశి' వ్రతం నిర్వర్తిస్తారు. దీన్ని 'అమృత ఏకాదశి' గా పరిగణిస్తారు. మదురైలోని మీనాక్షి సుందరేశ్వరుల కల్యాణం రోజు ఇది. అందుకే శివపూజ చేస్తారు. వసంత పంచమి నుంచి ఫాల్గుణ పూర్ణిమ ప్రకృతి ఆహ్లాదకరంగా ఉంటుంది. కనువిందు చేస్తుంది. చలి పూర్తిగా తగ్గదు. నులివెచ్చదనం ప్రాణానికి హాయి కలిగిస్తుంటుంది. ఫాల్గుణ మాసంలో అతి ముఖ్యమైంది వసంతోత్సవం. ఇది కాముని పండుగ, హోలికా పూర్ణిమ, కామ దహనం పేరుతో ప్రఖ్యాతి చెందింది. ఈ పర్వదినాన శివుడు, మన్మథుడు, కృష్ణుడు, లక్ష్మీదేవి పూజలందుకుంటారు. ఫాల్గుణ మాసంలో పూర్ణిమ రోజున హోళీ పండుగను నిర్వహిస్తుంటారు. ఈ పూర్ణిమ శక్తితో కూడినది. ఏ సంవత్సరమైనా పూర్ణిమ, ఉత్తర ఫల్గుణి కలిసి వస్తే ఆ రోజున మహాలక్ష్మిని షోడశోపచారాలతో ఆరాధించి లక్ష్మీ అష్టోత్తర శతనామాలు కనకధారా స్తోత్రాలను పారాయణం చేయడం మంచిది. హోళీ రోజున లక్ష్మీదేవిని ఆరాధిస్తే సమస్త శుభములు కలుగుతాయని పెద్దలవాక్కు. కొన్ని దక్షిణాది ఆలయాలలో ఫాల్గుణ పూర్ణిమను చాలా గొప్పగా చేస్తారు.ఫాల్గుణ బహుళ పాడ్యమినాడే రావణుడితో యుద్ధానికి వానర సైన్యాన్ని వెంటబెట్టుకొని శ్రీరాముడు లంకకు వెళ్లాడు. చవితినాడు 'సంకట గణేశ' వ్రతం ఆచరిస్తారు. బహుళ అష్టమి నాడు సీతాదేవి భూమి నుంచి ఆవిర్భవించింది. ఫాల్గుణంలో గోదానం, ధనదానం, వస్త్రదానం, గోవిందుడికి ప్రీతి కలిగిస్తాయని శాస్త్రవచనం. అందుకే ఆ రోజున రామాయణాన్ని చదివి, సీతారాముల్ని కొలుస్తారు. ఫాల్గుణ బహుళ ఏకాదశినాడు రావణ కుమారుడు ఇంద్రజిత్తు, లక్ష్మణుడు మధ్య ప్రారంభమైన సమరం త్రయోదశి దాకా కొనసాగింది. రావణ బ్రహ్మను శ్రీరాముడు అమావాస్య రోజు వధించాడు. బహుళ అమావాస్య నాడు పితృదేవతలకు పిండప్రదానం చేసి, అన్నదానం చేస్తారు.

# అందరి సంక్షేమం కోసమే 'ఏఐ'

**హైదరాబాద్ పెన్ పవర్:** గ్లోబల్ సౌత్, న్యూఢిల్లీ వేదికగా తొలిసారి జరుగుతున్న "ఇండియా – ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ – 2026" ఫిబ్రవరి 16 – 20 వరకు ఐదు రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నది. "పీపుల్, ప్లానెట్, ప్రోగ్రేస్ (ప్రజులు, భూగ్రహం, ప్రగతి" అనే మూడు సూత్రాల ఆధారంగా నిర్వహిస్తున్న ఈ ఏఐ సమ్మిట్–2026లో 30 దేశాలకు పైగా ప్రతినిధులు 700లకు పైగా ప్రతిపాదనలతో పాల్గొంటున్నారు. కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ – ఏఐ) సాంకేతికతను పునాదిగా చేసుకొని అభివృద్ధి, పాలన, ప్రజా సేవల అమలులో మెరుగైన విధానాలు అవలంబించడానికి మార్గం సుగమం అయ్యింది. వికసిత్ భారత్–2047 లక్ష్యాలను చేరడానికి ఏఐ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవడానికి పరిశోధనలు జరుగుతున్నాయి. న్యూఢిల్లీ భారత్ మండపం వేదికగా జరుగుతున్న "ఇండియా – ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ – 2026"ను కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ, ఇండియా ఏఐ మిషన్, డిజిటల్ ఇండియా ఇనిషియేటివ్, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ ఆఫ్ ఇండియా అనబడే సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. భారత ఆర్థిక ప్రగతి వేగాన్ని పెంచడం, మెరుగైన ఫలితాలను పాలనలో సంస్కరణలు చేయడం, ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరచడం లాంటి లక్ష్యాల సాధనలో ఏఐ ప్రక్రియను మరింత లాభదాయకంగా వినియోగించడానికి ఈ వేదిక మార్గాలను సూచిస్తుంది. సమ్మిట్ త్రిసూత్రాల్లో "ప్రజలు, భూగ్రహం, ప్రగతి (పీపుల్, ప్లానెట్, ప్రోగ్రేస్)" లను నిర్ణయించుకొని చర్చలు జరుపుతున్నది. ప్రజారోగ్యం(టెలీమెడిసిన్, రోగ నిర్ధారణ, ఔషధ ఆవిష్కరణ), వ్యవసాయం –గ్రామీణాభివృద్ధి, (వాతావరణ హెచ్చరికలు, వ్యవసాయ ఉత్పత్తులు పెంచడం, రైతుల ఆదాయం పెంచడం), విద్య(అనువాదాలు, 24/7 బోధనలు, అన్ని స్థాయిల విద్యార్థులకు బోధనలు), ఆర్థికం – వాణిజ్యం (ఆర్థిక భద్రత, సమ్మిళిత అభివృద్ధి, సేవల్లో దక్షత పెంచడం, బ్యాంకింగ్ సేవలు, ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట), పాలన – ప్రజా సేవలు(తీర్పుల అనువాదం, సేవలను అర్హులకు అందించడం, పారదర్శకత, జవాబుదారీతనం, సమర్థవంతమైన పాలన) లాంటి రంగాల్లో ఏఐని వినియోగించి సమూల సానుకూల మార్పులు చేయడానికి అత్యాధునిక ఏఐ టెక్నాలజీ వాడనున్నారు. ప్రజల శ్రేయస్సుతో పాటు భూగ్రహంపై వెలసిన కాలుష్య మబ్బులను తొలగించడం, సమగ్ర ప్రగతికి బాటలు వేయడానికి ఏఐ సాంకేతికతను వినియోగించడం క్రమంగా పెరుగుతోంది. ఇండియా – ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ – 2026 వేదికగా మూడు సూత్రాలు (పీపుల్, ప్లానెట్, ప్రోగ్రేస్), ఏడు చక్రాలను నిర్ణయించుకొని ముందుకు సాగుతున్నది. ఏఐ సమ్మిలో చర్చించే ప్రధానమైన ఏడు చక్రాల్లో యువ భారత మానవ వనరుల అభివృద్ధి, సామాజిక సాధికారతకా సమ్మిళిత అభివృద్ధి, సురక్షిత – నమ్మకమైన ఏఐ టెక్నాలజీ, స్థితిస్థాపకత–ఇన్నోవేషన్–ఎఫిషియెన్సీ, ఏఐ సమ్మిళిత సైన్స్ వినియోగం, ఏఐ వనరులను అందరికీ అందుబాటులోకి తేవడం, ఆర్థిక ప్రగతి – సామాజిక శ్రేయస్సుకు ఏఐ అనే అంశాలను గుర్తించారు. ఇండియా – ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ – 2026లో ప్రధాన "గ్లోబల్ ఇంపాక్ట్ చాలెంజెస్" అంశాలుగా ఏఐ ఫర్ ఆల్(అందరికీ ఏఐ), ఏఐ ఫర్ హర్ (మహిళలకు ఏఐ), ఏఐ ఫర్ యూత్ (యువతకు ఏఐ), ఏఐ పరిశోధనలు, భారత ఏఐ పరిశోధకులు(థింక్ ఫ్రూనర్స్) అనబడే రంగాలను ఎన్నుకున్నారు. భారతదేశం స్వయం సమృద్ధిని సాధించడం, మౌళిక వనరుల వృద్ధి, డాటాబేస్, సామర్థ్య అభివృద్ధి, వినూత్న ఆవిష్కరణలకు ఏఐ సాంకేతికత ఊతం ఇవ్వనున్నది. ప్రభుత్వ పారదర్శక పాలన, ప్రజా సంక్షేమ సేవల సమర్థవంతమైన అమలు, పరిశోధనలకు ప్రాధాన్యం పారిశ్రామిక ప్రగతి వేగం పుంజుకోవడానికి ఏఐ టెక్నాలజీ ఉపకరించనుందని ఆశిద్దాం.


# భారతీయ కళలు, సంస్కృతి వేదిక: తాజ్ మహోత్సవ్

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రేమకు ప్రతీకగా నిలుస్తున్న ఆగ్రా నగరం తాజ్ మహల్‌కే కాదు తాజ్ మహోత్సవ్ రూపంలో భారతీయ సాంస్కృతిక హృదయ ఆవిష్కరణ వేదికగా కూడా ప్రసిద్ధి గాంచింది. ఫిబ్రవరి 18 నుంచి 27, 2026 వరకు పది రోజుల పాటు నగరం భారతీయ వారసత్వం, చేతి వృత్తులు, జానపద సంప్రదాయాలు, కళలు, సాహిత్య సౌరభాలు, ప్రదర్శనలు, అద్భుత నాటకాలు, సంగీత స్వరాలు, చేఫ్‌ల చేతి వాటం, సాంస్కృతిక వైభవాలను ప్రదర్శించే అరుదైన సందర్భాన్ని "తాజ్ మహోత్సవ్ – 2026" అని నామకరణం చేసి 1992 నుంచి ప్రతి ఏట నిర్వహించుకుంటున్నాం. తాజ్ మహోత్సవ్ – 2026 కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాదు – ఇది దేశ చరిత్ర, రంగు, రూపు, సృజన, ఆవిష్కరణల సజీవ మేళవింపు కూడా. ఇందులో 400లకు పైగా కళాకారులు, చేతివృత్తుల వారు పాల్గొని పూర్తి భారతీయ సాంస్కృతిక వైభవ విందును వడ్డిస్తారు. బనారస్ సిల్క్, లక్నోవీ చికంకారి, సహారన్పూర్ చెక్క శిల్పాలు, ఆగ్రా పాలరాయి అందాల శిల్పాలు, బస్తర్ గిరిజ ఆభరణాలు, ఈశాన్య వెదురు అద్భుతాలు, రాజస్థాన్ కల్బేలియా నృత్యాలు, అస్సాం బిహు, మహారాష్ట్ర లావణి, ఒడిస్సీ కథక్, కచేరీలు, సాంస్కృతిక విలీన వేడుకలు, పలు రకాల రుచులు, పలు అనేక భరతమాత ఆత్మ ఆవిష్కరణలు ఒకే చోట 10 రోజుల పాటు ప్రదర్శించనున్నారు. ఆగ్రా తాజ్ మహల్ సమీప నగర శిల్పాగ్రామ్ వేదికగా ఈ సాంస్కృతిక విందు జరగనుంది. దేశ విదేశీ యాత్రికులు ఈ ఉత్సవం కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తూ ఉంటారు. ఈ మహా ఉత్సవంలో మంత్రముగ్ధుల్ని చేసే కళాత్మక ప్రదర్శనలు, ఆధ్యాత్మిక – సాంస్కృతిక సంగమాలు, నేపథ్య సాంస్కృతిక కవాతులు ఒకే చోట కరువై చూపరులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేయనున్నాయి. ప్రపంచంలోనే భిన్నత్వంలో ఏకత్వానికి చిరునామా అయిన భారతీయ ఆత్మలోకి తొంగి చూడగలిగే శుభ సందర్భంగా తాజ్ మహోత్సవ్ – 2026 నిలువనుంది. డిజిటల్ ఏఐ యుగం వడ్డిస్తున్న విపరీత చేష్టలను పక్కన పెట్టి మన పునాదులను తెలుపుతున్న ప్రయత్నాలు చేయడానికి ఇదో అద్భుత అవకాశం అని గుర్తిద్దాం. భారతీయులు తమ మూలాల్లోకి వెళ్లి గత వైభవ జ్ఞాపకాలను తిలకిస్తూ ఓ అద్భుత ప్రపంచంలోకి ప్రయాణం చేయనున్నారు. యూపీ పర్యాటక మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న తాజ్ మహోత్సవ్–2026 మెగా ఫెస్టివల్ భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ వార్షిక క్యాలండర్‌లో ప్రధాన స్థానాన్ని ఆక్రమిస్తున్నది. భారతీయ ఆత్మను దర్శించడానికి మనం కూడా పయనం అవుదాం. మన మూలాలను స్పర్శిద్దాం. మనవైన ప్రత్యేక కళలకు పట్టం కడదాం.

# చదువు పక్కన పెట్టి చోరీకి స్కెచ్

**హైదరాబాద్ పెన్ పవర్:** బుద్ధిగా చదువుకో వాల్సిన విద్యార్థులు అడ్డదారి తొక్కారు. తాము చదువుతున్న విద్యాసంస్థలోనే 60 ల్యాప్‌టాప్‌లను అపహరించి, పోలీసులకు చిక్కారు. గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ బాలరాజు, డీఐ నరేశ్ కథనం ప్రకారం.. గచ్చిబౌలి టీఎన్‌జీవోస్ కాలనీలోని ఓ హాస్టల్‌లో ఉంటున్న సాయిచరణ్ (19), అశ్విన్‌రావు (19)లు హెచ్‌సీయూలో బీటెక్ సెకండియర్ చదువుతున్నారు. హాస్టల్‌లో ఉండే ప్రైవేటు ఉద్యోగి రేగుల చంద్రశేఖర్ (30)తో వీరికి పరిచయం ఏర్పడింది. అప్పులు చేసిన విద్యార్థులు.. వాటిని తీర్చేందుకు చోరీ చేయాలనుకున్నారు. విషయాన్ని చంద్రశేఖర్‌కు చెప్పగా సరేనన్నాడు. ఇన్‌స్టిట్యూట్‌లోని ల్యాప్‌టాప్‌లు చోరీ చేయాలని నిర్ణయించుకున్నారు. ఓ కారును అద్దెను తీసుకొని 8వ తేదీ తెల్లవారుజామున 3 గంటల సమయంలో యూనివర్సిటీ క్యాంపస్‌లోకి ప్రవేశించారు. నేరుగా ఇన్‌స్టిట్యూట్‌కు వెళ్లి 60 ల్యాప్‌టాప్‌లను చోరీ చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు క్యాంపస్‌లోని సీసీ కెమెరాల సాయంతో, కారు నంబరు ఆధారంగా నిందితులను గుర్తించారు. ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకొని, ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు.

# రకాల మెంబర్ షిప్ తో జనసేన



**విజయవాడ, ఫిబ్రవరి 17, పెన్ పవర్:** జనసేన పార్టీ తన సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, కార్యకర్తల భాగస్వామ్యాన్ని క్రమబద్ధీకరించేందుకు సరికొత్త సభ్యత్వ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ క్రమంలో పార్టీలో మూడు రకాల సభ్యత్వ వర్గాలను నిర్ణయించింది. జనసేన పార్టీ తన శ్రేణులను మూడు విభాగాలుగా విభజించింది. మొదటి వారిని ఉద్యమి గా పిలుస్తారు. వీరు పార్టీపై నమ్మకం, అభిమానంతో ప్రాథమిక సభ్యత్వం తీసుకున్న వారు. రెండవ కేటగిరీకి చెందిన వారిని సాధక్ అని పిలుస్తారు. వీరు కేవలం సభ్యులుగానే కాకుండా, పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చేస్తూ, పార్టీ ఆశయాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లే క్రియాశీలక పాత్ర పోషిస్తారు. ఇక మూడవ కేటగిరీలోకి ప్రధాతలు వస్తారు. వీరు పార్టీకి వివిధ రూపాల్లో ఆర్థికంగా లేదా మేధోపరంగా అండగా నిలుస్తూ, నాయకత్వ బాధ్యతలు చేపట్టి పార్టీ బలోపేతానికి కృషి చేస్తారు.సభ్యత్వ నమోదు ప్రక్రియను పారదర్శకంగా మరియు సులభంగా నిర్వహించేందుకు జనసేన పార్టీ డిజిటల్ పద్ధతులను అవలంబిస్తోంది. ప్రతి సభ్యుని వివరాలను ఆన్‌లైన్ డేటాబేస్‌లో నిక్షిప్తం చేయడం ద్వారా, భవిష్యత్తులో వారికి ఇన్సూరెన్స్ వంటి ప్రయోజనాలను అందించాలని పార్టీ భావిస్తోంది. ముఖ్యంగా యువతను ఈ ఉద్యమి–సాధక్–ప్రధాత ' విధానం వైపు ఆకర్షించడం ద్వారా పార్టీలో జవాబుదారీతనం పెరుగుతుందని నాయకత్వం ఆశిస్తోంది.ఏపీలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, ప్రతి గ్రామం, వార్డులో జనసేన జెండాను రెపరెపలాడించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగుతోంది. సాధారణ సభ్యుల నుండి నాయకుల వరకు వారి పనితీరు , అంకితభావాన్ని బట్టి ఈ వర్గీకరణలో గుర్తింపు లభిస్తుంది. ఈ నూతన విధానం ద్వారా పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహం నింపడంతో పాటు, క్రమశిక్షణతో కూడిన రాజకీయ వ్యవస్థను నిర్మించాలని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు.

# పాపం... కొణతాల..

**విశాఖపట్టణం, ఫిబ్రవరి 17, పెన్ పవర్:** సీనియర్ మోస్ట్ లీడర్. థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీగా పేరున్న నేత.. గతంలో ఓసారి మంత్రి అయ్యారు. గత రెండేళ్లుగా అమాత్య యోగంపై తెగ ఆశలు పెట్టుకున్నారు. కానీ ఆయన అంచనాలు తలకిందులు అవుతూ వస్తున్నాయి. దీంతో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన ఆ పొలిటీషియన్ తన స్టైల్‌ను మార్చేశారన్న టాక్ వినిపిస్తోంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇప్పుడున్న పొలిటీషియన్లందరి కంటే ఆయన చాలా సీనియర్. ఒకప్పుడు జిల్లా రాజకీయాల్లో చక్రం తిప్పేవారు. 1989లోనే ఫస్ట్ టైమ్ కాంగ్రెస్ నుంచి ఎంపీగా గెలిచారు. ఆ తర్వాత అదే సీటు నుంచి మరోసారి ఎంపీ అయ్యారు. ఇక 2004లో ఎమ్మెల్యే అయి ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ఏకైక మంత్రిగా ఐదేళ్లు తన హవా నడిపించారు కొణతాల. ఇక 2009లో ఓడిపోవడంతో ఆయన పొలిటికల్ గ్రాఫ్ ఎత్తు పల్లాలు చూడాల్సి వచ్చింది. అప్పుడు గనుక కొణతాల గెలిచి ఉండి ఉంటే రాజకీయం వేరేగా ఉండేదని చెప్తుంటారు.2009లో ఓటమితో పదిహేనేళ్ల పాటు పొలిటికల్‌గా చాలా ఇబ్బందులను ఫేస్ చేశారు కొణతాల. అయితేనేం 2024లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిలిచి మరీ కొణతాలకు సీటు ఇచ్చారు. అలా ఆయనకు తిరిగి ఎమ్మెల్యేగా చాన్స్ దక్కింది. అయితే ఒకప్పుడు విశాఖ జిల్లాలో సింగిల్ హ్యాండ్ గణేష్‌లాగా హవా నడిపించిన కొణతాల..ఇప్పుడు అందరిలానే ఎమ్మెల్యేగా ఉండిపోవాల్సి వచ్చింది. కానీ బ్యాక్ గ్రౌండ్ చూస్తే మాత్రం అయ్యో..అంత పెద్ద నాయకుడు ఇలా ఉండిపోయారేంటన్న చర్చ కూడా నడుస్తుంది.అయితే ఇప్పుడు జనసేనలో సీనియర్ మోస్ట్ లీడర్లలో అనకాపల్లి జిల్లాకు చెందిన కొణతాల రామకృష్ణ ఒకరు. ఈ క్రమంలో విశాఖ జిల్లాతో పాటు ఉత్తరాంధ్ర పాలిటిక్స్‌పై పూర్తి అవగాహన ఉన్న కొణతాలకు మంత్రి పదవి దక్కుతుందని అంతా ఊహించారు. పైగా బలమైన బీసీ సామాజిక వర్గానికి చెందిన వారిగా ఉన్నారాయన. ఆ సామాజికవర్గానికి 25 ఏళ్ల క్రితం చివరి సారిగా మంత్రి యోగం దక్కింది. మళ్లీ ఇంతవరకూ ఆ ఛాన్స్ రానే లేదు. దాంతో విశాఖలో అనేక నియోజకవర్గాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావితం చూపించగల గవర సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వాలన్న డిమాండ్ ఉంది. కానీ అది ఎందుకో కుదరలేదు.ఇక ఈ ఏడాది మధ్యలో మంత్రి వర్గ విస్తరణ జరగబోతున్నట్లు ప్రచారం సాగుతోంది. దాంతో అనకాపల్లి జిల్లా నుంచి కొణతాల రామకృష్ణకు జనసేన కోటాలో మంత్రి పదవి ఖాయమని టాక్ నడుస్తోంది. ప్రస్తుతం జనసేనలో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చారు. పార్టీకి మరో మంత్రిపదవి దక్కితే అది నాగబాబుకు ఇస్తారనే చర్చ ఉండేది. అయితే ఒకే కులానికి ..ఒకే కుటుంబానికి అన్ని పదవులు ఇచ్చారన్న విమర్శలు ఫేస్ చేయాల్సి వస్తుందని జనసేన అధినాయకత్వమే..నాగబాబును మంత్రి చేయాలనుకున్న డెసిషన్‌ను వెనక్కి తీసుకున్నట్లు చెబుతుంటారు. దీంతో బీసీల నుంచి కీలక నేతకు మంత్రి పదవి ఇస్తే బాగుంటుందన్న ఆలోచన జనసేనలో ఉందని అంటున్నారు. పైగా గోదావరి జిల్లాల తర్వాత ఉత్తరాంధ్ర జిల్లాలలో జనసేనకు మంచి బలం ఉంది. ఆరు ఎమ్మెల్యే సీట్లను ఇక్కడ ఆ పార్టీ గెలుచుకుంది. ఫ్యూచర్ పాలిటిక్స్‌ను దృష్టిలో పెట్టుకుని కొణతాలకు మంత్రి పదవి ఇవ్వొచ్చన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.మంత్రి పదవి రేసులో కొణతాల ఉన్నారని చర్చ జరుగుతున్న వేళ..బడ్జెట్ సమావేశాలలో ఆయన ఏకంగా సీఎం చంద్రబాబు ఫ్యామిలీ మొత్తాన్ని పొగిడేశారు. చంద్రబాబు, లోకేశ్‌ను మాత్రమే కాదు భువనేశ్వరి, బ్రాహ్మణి, ఆఖరికి దేవాంశ్‌ను కూడా పొగడ్తలతో ముంచెత్తారు కొణతాల. ఒకే కుటుంబంలో అందరూ ప్రతిభావంతులే అని కొణతాల చెప్పుకొచ్చారు. ఈ మధ్య ఆ కుటుంబంలోని వారంతా వివిధ రంగాల్లో సత్తా చాటి అవార్డులు అందుకున్నారని ఇంట్రెస్టింగ్ వ్యాఖ్యలు చేసి చర్చకు తెరదీశారు. అయితే ఉన్నట్లుండి ఆయన చంద్రబాబు కుటుంబాన్ని మొత్తం పొగిడేయడం హాట్ టాపిక్ అవుతోంది. పైగా జనసేన ఎమ్మెల్యేగా ఉంటూ టీడీపీ వారి కంటే ఎక్కువగా బాబు కుటుంబాన్ని కొణతాల పొగడటం వెనక మంత్రి పదవి కోరికలు ఉన్నాయా అన్న చర్చ సాగుతోంది.కొణతాలకు మంత్రి పదవి ఇవ్వాలా? వద్దా? అనేది పవన్ నిర్ణయమని..కొణతాల చంద్రబాబును పొగిడింది మంత్రి అందుకోసమేనన్న ప్రచారం సరికాదన్న అభిప్రాయాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. ఏది ఏమైనా తన పొలిటికల్ ట్రాక్ రికార్డ్ లో ఎప్పుడూ రెబల్ స్టార్‌గా ఉన్న కొణతాల..గతంలో ఎప్పుడూ ఇంతలా ఎవరినీ పొగడలేదన్న చర్చ మాత్రం ఆసక్తికరంగా మారింది.

# రోజుకో ఏడుగురు ఎమ్మెల్యేలతో భేటీ

**విజయవాడ, ఫిబ్రవరి 17 పెన్ పవర్:** పవర్‌లోకి వచ్చి ఆల్రెడీ ఇరవై నెలలు అవుతుంది. ఇప్పటిదాకా అభివృద్ధి, సంక్షేమంపైనే ఫుల్ ఫోకస్ నడిచింది. త్వరలోనే స్థానిక ఎన్నికలు, మున్సిపల్ ఎలక్షన్స్ రాబోతున్నాయ్. ఇప్పుడు పార్టీపై కాన్సన్‌ట్రేషన్ షిఫ్ట్ చేశారు సీఎం చంద్రబాబు నియోజకవర్గంలో సమస్యలు ఏంటి.?ప్రజల్లో ప్రభుత్వంపై ఎలాంటి ఒపీనియన్ ఉంది.? స్థానికంగా ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలు అమలు చేశారా.? మీకేం కావాలి.? పార్టీ పరంగా ఏం చేయాలి.? ప్రభుత్వ పరంగా చేసి పెట్టాల్సిన పనులు ఏంటి.? మీ వ్యక్తిగత సమస్యలు ఏమైనా ఉన్నాయా.? అంటూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ముఖాముఖి నిర్వహిస్తున్నారు. సమస్యలు చెప్పుకునేందుకు..తప్పులు సరిదిద్దుకునేందుకు అవకాశం ఇవ్వలేదనే విమర్శలు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకునే పనిలో పడ్డారట. అసలే అసెంబ్లీ బడ్జెట్ సెషన్ నడుస్తుంది.ఎమ్మెల్యేలంతా 9 గంటల వరకు సభలో ఉండాలని ఇప్పటికే బాబు ఆదేశించారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలంతా బడ్జెట్ సమావేశాలు అయిపోయే వరకు విజయవాడలోనే ఉండే అవకాశం ఉంది. దీంతో ఇదే సమయంలో పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వరుసగా భేటీ అవుతూ..ఎక్కడిక్కడ సమస్యలకు చెక్ పెట్టి.. అంతా సెట్ చేసే ప్లాన్ చేస్తున్నారట.అటు మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కూడా సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతిరోజూ ఏడుగురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో డిన్నర్ మీట్ అవుతున్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు పూర్తయ్యే వరకూ ఈ భేటీలు జరగనున్నాయి. రోజూ ఒక్కో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, వారి కుటుంబసభ్యులతో నారా లోకేశ్ డిన్నర్ భేటీలు కంటిన్యూ కాబోతున్నాయి. నారా లోకేష్‌తో జరిగే ఈ డిన్నర్ మీట్‌లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటుగా వారి కుటుంబసభ్యులు కూడా హాజరవుతున్నారుఈ విందు సమావేశాల్లో నియోజకవర్గాల్లోని సమస్యలపై చర్చించడంతో పాటు..ఎమ్మెల్యేలతో నేరుగా మాట్లాడే అవకాశం లభిస్తుందని నారా లోకేశ్ భావిస్తున్నారు. ఇలా అటు సీఎం చంద్రబాబు ప్రజాప్రతినిధులకు డైరెక్షన్స్ ఇస్తూ..ఫ్యూచర్ పాలిటిక్స్‌పై దిశానిర్దేశం చేస్తున్నారట. లోకేశ్ అయితే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను బాండింగ్ పెంచుకునేలా..కమ్యూనికేషన్ గ్యాప్ రాకుండా చేస్తుంటే..ఎక్కడా అసంతృప్తులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారటగత ప్రభుత్వ హయాంలో సీఎం అపాయింట్మెంట్ దొరకడం లేదంటూ అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా గగ్గోలు పెట్టినట్లు కథనాలొచ్చాయి. పైగా తమ హయాంలో సీఎంవో నడపాల్సినంత గొప్పగా నడపలేకపోయామని వైసీపీ నేతలే చెప్తుంటారు. కడుపు చించుకుంటే కాళ్ల మీద పడుతుందనే ఆవేదనతో కొంతమంది ఎమ్మెల్యేలు కక్కలేక, మింగలేక మిన్నకుండిపోయి ఎన్నికల తర్వాత బరస్ట్ అయిపోయారు.మరికొందరు అయితే ముందు నుంచే ఆఫ్ ది రికార్డ్‌లో తమ ఆగ్రహాన్ని, ఫ్రస్ట్రేషన్‌ను వెళ్లగక్కిన సందర్భాలున్నాయి. అయితే తమ పార్టీలో, ప్రభుత్వంలో పరిస్థితికి తావు లేకుండా అటు సీఎం చంద్రబాబు, ఇటు మంత్రి లోకేశ్ సరికొత్త ఆలోచన చేశారని తెలుస్తోంది. తమ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో అయినా పూర్తిగా కొన్ని గంటలు వ్యక్తిగతంగా, మరికొంత సమయం వారి కుటుంబ సభ్యులతోనూ కలిసినట్లు ఉండటంతో పాటు.. వారి నియోజకవర్గాల్లో సమస్యలు, పార్టీ పరిస్థితి, ప్రజల అభిప్రాయాలను లోతుగా తెలుసుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నారట.ఈ అసెంబ్లీ సెషన్ పూర్తయ్యేలోపు డిన్నర్ విత్ లోకేశ్ కార్యక్రమం వైరల్‌గా మారే ఛాన్స్ ఉంది. అలా అని లోకేశ్ ప్రత్యేకత ఈ ఒక్క కార్యక్రమానికే పరిమితం కాదని..మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి "ఎక్స్" వేదికగా తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపైనా వెంటనే స్పందిస్తున్నారని గుర్తు చేస్తున్నారు.ఎక్స్‌లో తన దృష్టికి వచ్చిన సమస్యను..తన ఆఫీస్ టీమ్‌కు అసైన్ చేస్తున్నారు.. వారు ఫాలో అప్ చేసి, స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుని, సమస్యను సాల్వ్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడు డిన్నర్ మీట్‌తో నేరుగా సమావేశం అయి..గ్రూప్‌వార్..కమ్యూనికేషన్ గ్యాప్‌కు చెక్ పెట్టి..అక్కడక్కడ ఏమైనా అసంతృప్తులు, అలకలు ఉన్నా అంతా సెట్‌రైట్ చేసేందుకు ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తున్నట్లు తెలుగు తమ్ముళ్లు చర్చించుకుంటున్నారు

# దోమలపై హైటెక్ యుద్ధం

**కర్నూలు, ఫిబ్రవరి 17, పెన్ పవర్:** ప్రజారోగ్యానికి పెను సవాల్ విసురుతున్న దోమలపై హైటెక్ యుద్ధానికి ఏపీ ప్రభుత్వం సిద్ధమైంది. దోమల నియంత్రణ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సేవలు ఉపయోగించనుంది. ఏఐ ఆధారంగా పనిచేసే స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్ ద్వారా దోమలను కట్టడి చేయాలని భావిస్తోంది. ఇందులో భాగంగా తిరుపతిలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ విధానాన్ని పరిశీలించనున్నారు. అక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా మరిన్ని నగరాలకు విస్తరించాలనే ఆలోచనలో ఏపీ ప్రభుత్వం ఉంది. తిరుపతిలో ప్రైవేట్ సంస్థకు ఈ పనులు అప్పగించనున్నారు.దోమలు.. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా.. ప్రతి ఒక్కరినీ వేధిస్తున్న సమస్య. ప్రజారోగ్యానికి ప్రధాన సవాలు విసురుతున్నవి దోమలే.. ఈ నేపథ్యంలో దోమలపై హైటెక్ యుద్ధానికి ఏపీ ప్రభుత్వం సిద్ధమైంది. టెక్నాలజీ సాయంతో దోమలకు చెక్ పెట్టాలని భావిస్తోంది. అందులో భాగంగా కృత్రిమ మేధ ఆధారంగా పనిచేసే స్మార్ట్ దోమల నిఘా వ్యవస్థ (స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్) అందుబాటులోకి తెస్తోంది ఏపీ ప్రభుత్వం. ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో తొలుత ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలించనున్నారు. ఇక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా రాష్ట్రంలోని ఇతర ప్రధాన నగరాలకు ఈ స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్ విస్తరించే ఆలోచనలు చేస్తున్నారు.స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్‌లో భాగంగా తొలుత ముందుగా నిర్ణయించిన కొన్ని ప్రాంతాలలో ఐవోటీ పరికరాలు ఏర్పాటు చేస్తారు. ఈ పరికరాలు ప్రత్యేకమైన వాసన కలిగి ఉంటాయి. ఫిరమోన్ సాయంతో ఈ ప్రత్యేక వాసన వచ్చేలా అధికారులు వీటిని రూపొందించారు. దీంతో దోమలను ఇవి సులువుగా ఆకర్షిస్తాయి. దీని ద్వారా ఆ ప్రాంతంలో దోమల సాంద్రత ఎలా ఉంది.. అవి ఏ జాతి దోమలు, వాటి లింగం ఏంటనే వివరాలను ఈ ఐవోటీ పరికరాలు గుర్తిస్తాయి. ఈ సమాచారాన్ని వెంటనే సెంట్రల్ డ్యాష్ బోర్డుకు పంపిస్తుంది. ఈ డ్యాష్ బోర్డు.. ఏఐ సాయంతో ఈ వివరాలను విశ్లేషించి.. ఆ ప్రాంతంలో దోమల తీవ్రత ఎలా ఉందనే దానిపై అధికారులను అప్రమత్తం చేస్తుంది. ఆ తర్వాత దోమల నియంత్రణ కోసం డ్రోన్ల సాయంతో మందులను పిచికారీ చేసేలా ప్రణాళికలు రచించారు.మరోపతి తిరుపతిలో దోమలు అధికంగా ఉండే 250 హాట్‌స్పాట్లు గుర్తించారు. వీటిలోని కొన్ని ప్రాంతాలలో జాప్ ట్రాపులు, ఐవోటీ సెన్సార్లు ఏర్పాటు చేయనున్నారు. 20 లక్షలతో నాలుగుచోట్ల ఈ పరికరాలను ఏర్పాటు చేయనున్నారు. అలాగే తిరుపతిలో ఈ పనులను ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించనున్నారు. ఈ నాలుగుచోట్ల వచ్చే ఫలితాల ఆధారంగా తిరుపతి మొత్తం ఈ సేవలు విస్తరించే ఆలోచనలో అధికారులు ఉన్నారు. ఈ స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్‌ను తిరుపతితో పాటుగా విశాఖ, విజయవాడ, కర్నూలు, కాకినాడ, నెల్లూరు, రాజమండ్రి ప్రాంతాల్లో అమలు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

# ఏప్రిల్ 1 నుంచి రైల్వే జోన్...



**విశాఖపట్టణం, ఫిబ్రవరి 17, పెన్ పవర్:** దక్షిణ కోస్తా జోన్ కార్యకలాపాలకు సంబంధించి కీలక ముందడుగు పడుతోంది. విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటవుతున్న జోన్ కార్యకలపాలు ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. దక్షిణ మధ్య రైల్వే అధికారులకు సమాచారం వచ్చినట్లు తెలుస్తోంది. ఏప్రిల్ 1న కొత్త రైల్వే జోన్కు అపాయింటెడ్ డేగా ప్రకటించబోతున్నారట. ఈ నెలాఖరుకు ప్రకటన వస్తుందని చెబుతున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రజలు, ముఖ్యంగా ఉత్తరాంధ్రవాసుల కల నెరవేరబోతోంది. కొత్త రైల్వే జోన్‌కు సంబంధించి అపాయింటెడ్ డేకు ముహూర్తం ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. అన్ని కుదిరితే ఏప్రిల్ 1 నుంచి కొత్త రైల్వేజోన్ కార్యకలాపాలు ప్రారంభించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న దక్షిణ మధ్య రైల్వే విభజన ప్రక్రియలో భాగంగా.. ఆరు డివిజన్లు విడిపోతున్నాయి. దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్‌లు మాత్రమే ఉంటాయి. కొత్తగా దక్షిణ కోస్తా జోన్ ఏర్పాటు కాబోతోంది.. అందులో కొత్తగా ఏర్పడే విశాఖపట్నం డివిజన్, తూర్పుకోస్తా జోన్‌లో కొంతభాగం, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు కలిపి ఉంటాయి.కొత్తగా ఏర్పాటవుతున్న రైల్వే జోన్‌కు ఏప్రిల్ 1న అపాయింటెడ్ డేగా ప్రకటించే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటి నుంచి చూస్తే ఆరు వారాల సమయం ఉంది.. మరి అంత తక్కువ సమయం సరిపోతుందా అనే అంశంపై కూడా తెరపైకి వచ్చింది. త్వరలోనే దీనిపై ఓ క్లారిటీ వస్తుందని.. ఈ నెలాఖరు లోపు కొత్త జోన్ అపాయింటెడ్ డేపై నోటిఫికేషన్ వస్తుందని భావిస్తున్నారు. రైల్వే బోర్డుకు తొమ్మిది నెలల క్రితమే డివిజన్ల వారీగా విభజన ప్రక్రియతో పాటుగా మిగిలిన అంశాలపై డీపీఆర్ పంపించారు. ఈ మేరకు విభజన ప్రక్రియను చేపట్టారు. ఈ నెలలోనే అపాయింటెడ్ డే ప్రకటిస్తారని భావిస్తున్నారు.కేంద్రం ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో విశాఖపట్నం కేంద్రంగా కొత్తగా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. గత పదేళ్లుగా కొత్త రైల్వే జోన్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్రం నుంచి వినతులు అందజేశారు. గతేడాది ఫిబ్రవరి నెలలో కేంద్ర కేబినెట్ కొత్త రైల్వే జోన్‌కు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి కొత్త రైల్వే జోన్‌కు జీఎంతో పాటుగా అవసరమైన అధికారుల్ని, మిగిలిన కసరత్తును చేపట్టింది. ఈ మేరకు అవసరమైన సరిహద్దుల్లో మార్పులు చేర్పులు, రైళ్ల నిర్వహణ, ఆదాయ వ్యయాలు వంటి అంశాలపై కసరత్తు చేశారు. ఇప్పుడు అపాయింటెడ్ డేను ప్రకటించే దిశగా అడుగులుపడుతున్నాయి. అలాగే ఆయా డివిజన్లలో మార్పులు, చేర్పులు చేయనున్నారు.విశాఖపట్నంలో దక్షిణ కోస్తా రైల్వే జోన్ జీఎం తాత్కాలిక కార్యాలయాన్ని సిరిపురంలో ఉన్న డెక్ భవనంలో ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ రెండు అంతస్తుల్ని లీజు కింద తీసుకున్నారు. అలాగే దక్షిణ కోస్తా రైల్వే జోన్ శాశ్వత ప్రధాన కార్యాలయం పనులు కూడా వేగవంతం అయ్యాయి. ముడసర్లోవలో ఏపీ సర్కార్ భూమిని కేటాయించగా.. అక్కడ పనులు ప్రారంభం అయ్యాయి.. గతేడాది జనవరిలో ప్రధాని మోదీ ఈ పనులకు వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేశారు. మొత్తం 54 ఎకరాలను కార్యాలయం కోసం కేటాయించారు. రూ.192 కోట్లతో పరిపాలనా భవనానికి ఖర్చవుతుందని అంచనా వేశారు.. 12 అంతస్తుల్లో భవనం నిర్మిస్తున్నారు.

# కొత్త బాధ్యతలతో జేడీ

**ఒంగోలు, ఫిబ్రవరి 17, పెన్ పవర్:** జేడీ లక్ష్మీనారాయణ.. తెలుగు ప్రజలకు పరిచయం అక్కరలేని పేరు. ఉమ్మడి రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి మరణానంతరం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వైఎస్సార్ కొడుకు, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై పెట్టిన అక్రమాస్తుల కేసు విచారణతో సీబీఐ డైరెక్టర్‌గా జేడీ లక్ష్మీనారాయణ గుర్తింపు పొందారు. తర్వాత ఉద్యోగం నుంచి స్వచ్ఛంద రిటైర్మెట్ తీసుకున్న ఆయన రాజకీయాల్లోకి వచ్చారు. పార్టీ పెట్టారు. 2019 ఎన్నికల్లో పార్టీ తరఫున అభ్యర్థులను నిలిపి పోటీ చేశారు. కానీ అప్పటి వైసీపీ ధాటికి ఒక్క సీటు కూడా గెలవలేదు. తర్వాత విశ్లేషకుడిగా, మోటివేటర్‌గా కొనసాగుతూ వచ్చారు. మహారాష్ట్ర కేడర్ ఐపీఎస్ అయిన లక్ష్మీనారాయణ ఇప్పుడు కొత్త ఉద్యోగంలో చేరారు. మేఘా ఇంజినీరింగ్ అనుబంధ సంస్థ ఈవీ ట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ నియామకాన్ని సంస్థ లింక్డ్ఇన్‌లో ప్రకటించింది.ఎన్ఐటీ వరంగల్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ బీటెక్, ఐఐటీ మద్రాస్‌లో ఎంటెక్ పూర్తి చేసిన ఆయన అశోక్ లేల్యాండ్ ఆర్ అండ్ డీలో కెరీర్ ప్రారంభించారు. 1990 బ్యాచ్ మహారాష్ట్ర కేడర్ ఐపీఎస్‌గా ముంబైలో అడిషనల్ డైరెక్టర్ జనరల్‌గా ఉద్యోగ విరమణ చేశారు. 2006--13 మధ్య సీబీఐలో జగన్ అక్రమాస్తుల కేసు సహా హైప్రొఫైల్ దర్యాప్తులు చేపట్టారు.పదవీవిరమణ తర్వాత జనసేన పార్టీ తరఫు విశాఖపట్నం ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. 2023లో జై భారత్ నేషనల్ పార్టీ స్థాపించారు. తూర్పు గోదావరి ధర్మవరంలో పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం కూడా చేశారు. కుమారుడు ఆల్ ఇండియా సర్వీసులో పనిచేస్తున్నారు.హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే ఈవీ ట్రాన్స్ దేశంలోనే అతిపెద్ద ఎలక్ట్రిక్ బస్ ఆపరేటర్. తెలంగాణ ఆర్టీసీ ఒలెక్ట్రా బస్సులు, ముంబై, పుణే, గోవాలోని వాహనాలు తయారు చేస్తుంది. లక్ష్మీనారాయణ ఆర్థిక, కార్యాంగ నిర్వహణ అనుభవం సంస్థ విస్తరణకు ఉపయోగపడుతుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే.. ఇటీవల లక్ష్మీనారాయణ భార్య ఆన్‌లైన్ ట్రేడింగ్ స్కామ్‌లో రూ.2.58 కోట్లు కోల్పోయారు. లాభాలు హామీ ఇచ్చి మోసం చేసినవారిపై జనవరిలో సైబర్ క్రై మ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# హిందూపురంలో షాకింగ్ వీడియో

**అనంతపురం, ఫిబ్రవరి 16, పెన్ పవర్:** సమాజంలో మహిళల పట్ల, చిన్నారుల పట్ల అమానుషాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఎప్పటికప్పుడు ఇవి వెలుగు చూస్తున్నా.. పోలీసులు కఠిన చర్యలకు దిగుతున్నా నియంత్రణలోకి రావడం లేదు. ఈ లైంగిక వేధింపులకు సంబంధించి రాజకీయ నేతలపై కూడా ఆరోపణలు వస్తున్నాయి. అటువంటిదే మరో ఘటన సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని హిందూపురం నియోజకవర్గంలో ఓ మైనర్ బాలికపై.. ఓ పార్టీకి చెందిన గ్రామ నాయకుడు వేధింపులకు దిగాడు. వికృత చేష్టలకు పాల్పడ్డాడు. సోషల్ మీడియాలో పెడతానని బెదిరించి అఘాయిత్యానికి ప్రయత్నించాడు. ప్రస్తుతం ఈ వీడియో విపరీతంగా వైరల్ అవుతోంది.ఇటీవల మహిళలపై లైంగిక వేధింపులకు సంబంధించిన వీడియోలు ఎక్కువగా వెలుగులోకి వస్తున్నాయి. ప్రధానంగా రాజకీయ పార్టీల నేతలు ఈ వేధింపులకు దిగుతున్నారు. బాధితులుగా మారుతున్న వారు ఆ వీడియోలను బయటపెట్టి న్యాయం చేయాలని కోరుతున్నారు. మరోవైపు నేరాలకు పాల్పడుతున్న వారు ఆ వీడియోలను తీసి పైశాచిక ఆనందం పొందుతున్నారు. ఈ క్రమంలో ఆ వీడియోలు బయటకు వస్తున్నాయి. అయితే ఈ మొత్తం వ్యవహారంలో మహిళలు, చిన్నారులు బాధితులుగా ఉండగా.. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రత్యర్థులు ఈ వీడియోలను వైరల్ చేస్తున్నారు.హిందూపురం నియోజకవర్గంలో ఓ గ్రామానికి చెందిన చోటా నాయకుడు.. ఓ మైనర్ బాలిక పట్ల అమానుషంగా ప్రదర్శించాడు. అసభ్యకరంగా ప్రవర్తిస్తూ లైంగిక దాడికి ప్రయత్నిస్తున్న వీడియోలు ఇప్పుడు బయటకు వచ్చాయి. సదరు నాయకుడు పాఠశాలకు వెళ్తున్న బాలికను ట్రాప్ చేసి.. ఓ ఇంటికి తీసుకెళ్లి లైంగిక దాడికి ప్రయత్నించే క్రమంలో.. వికృత చేష్టలకు పాల్పడ్డాడు. అలా చేసి సెల్ఫోన్లో చిత్రీకరించి.. తిరిగి బాధితురాలను బ్లాక్ మెయిల్ చేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ వీడియోలు బయటకు రావడంతో.. సదరు నేతపట్ల ఆరోపణలు వచ్చి పడుతున్నాయి. ప్రధాన నాయకుడికి అనుచరుడిగా ప్రచారం నడుస్తోంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## ఉత్తర కొరియాలో వారసత్వ యుద్ధం



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచంలోనే అత్యంత రహస్య దేశమైన ఉత్తర కొరియాలో ఇప్పుడు ఒక ఉత్కంఠభరితమైన కుటుంబ పోరుకు తెరలేవబోతోంది. ప్రస్తుత నియంత కిమ్ జోంగ్ ఉన్ తన 13 ఏళ్ల కుమార్తె కిమ్ జు ఏని దేశ తదుపరి పాలకురాలిగా దాదాపు ఖరారు చేసినట్లు దక్షిణ కొరియా నిఘా సంస్థ సంచలన నివేదిక వెల్లడించింది. అయితే ఈ నిర్ణయం కిమ్ సోదరి, దేశంలోనే రెండో అత్యంత శక్తివంతమైన మహిళగా పేరున్న కిమ్ యో జోంగ్‌కు ఏమాత్రం నచ్చలేదని చెప్పారు. దీంతో కిమ్ జు ఏకు, కిమ్ కుమార్తెకు మధ్య భవిష్యత్తులో తీవ్రమైన అధికార పోరుకు దారితీస్తుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఈ నెలాఖరులో జరగనున్న ఉత్తర కొరియా 'వర్కర్స్ పార్టీ కాంగ్రెస్' సమావేశంపై యావత్ ప్రపంచం కన్నేసింది. ప్రతి ఐదేళ్లకు ఒకసారి జరిగే ఈ కీలక సమావేశంలో కిమ్ 13 ఏళ్ల కుమార్తె కిమ్ జు ఏను అధికారికంగా వారసురాలిగా ప్రకటించే అవకాశం ఉంది. అయితే 2022లో మొదటిసారి క్షిపణి ప్రయోగం వద్ద కనిపించిన జు ఏ.. ఇప్పుడు తండ్రితో కలిసి సైనిక పరేడ్‌లు, ఫ్యాక్టరీ తనిఖీలే కాకుండా.. గత సెప్టెంబర్‌లో బీజింగ్ పర్యటనకు కూడా వెళ్లివచ్చారు. కేవలం ఉత్సవ విగ్రహంలా కాకుండా.. కొన్ని ప్రభుత్వ విధానాలపై కూడా ఆమె తన అభిప్రాయాలను వ్యక్తపరుస్తున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ప్రస్తుతం 38 ఏళ్ల వయసున్న కిమ్ యో జోంగ్.. కిమ్ జోంగ్ ఉన్ నీడలా ఉంటూ దేశ రాజకీయాలను శాసిస్తున్నారు. పీఠం కోసం ఆమె తన కోరికను చంపుకుంటుందా అంటే అనుమానమేనని మాజీ నిఘా అధికారి రా జోంగ్ యిల్ అభిప్రాయపడ్డారు. ఆమెకు సైన్యంలో, రాజకీయ వర్గాల్లో బలమైన పట్టు ఉందన్నారు. ఒకవేళ తనకు అవకాశం ఉందని భావిస్తే.. ఆమె కచ్చితంగా తన సొంత 'పొలిటికల్ ప్రాజెక్ట్'ను అమలు చేస్తారని ఆయన హెచ్చరించారు.

### బీఎల్ఏ నిర్బంధంలో ఏడుగురు సైనికులు..

## పాకిస్థాన్‌కు వారం రోజుల డెడ్‌లైన్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏడుగు పాకిస్థాన్ సైనికులను బందీలుగా చేసుకున్న బలూచీస్థాన్ వేర్పాటువాద గ్రూప్ బలోచ్ లిబరేషన్ ఆర్మీ.. ఖైదీల మార్పిడి ఒప్పందానికి రావాలని లేకుంటే వారిని చంపేస్తామని ఇస్లామాబాద్ ప్రభుత్వానికి వారం రోజులు డెడ్‌లైన్ విధించింది. ఈ మేరకు బీఎల్ఏ మీడియా విభాగం హక్కల్ ఓ వీడియో సందేశం విడుదల చేసింది. తాము విధించిన గడువులో ఇప్పటికే ఒక రోజు గడిచిపోయిందని, మరో ఆరు రోజులే మిగిలి ఉందని అల్టిమేటం జారీచేసింది. కాగా, దీనిపై పాక్ ఇప్పటి వరకూ అధికారికంగా ఎలాంటి స్పందన తెలియజేయలేదు. లూచ్ లిబరేషన్ ఆర్మీ విడుదల చేసిన వీడియో ప్రకారం.., ఆపరేషన్ హెరోఫ్ రెండో దశ సమయంలో పాకిస్థాన్ ఆర్మీ జవాన్లను బందీలుగా చేసుకున్నట్టు తెలిపింది. ఇందులో భాగంగా పాకిస్థాన్ భద్రతా దళాలకు చెందిన మొత్తం 17 మంది సిబ్బందిని తమ యోధులు అదుపులోకి తీసుకున్నారని బీఎల్ఏ పేర్కొంది. వీరిలో పది మందిని బలూచ్ జాతిగా గుర్తించామని, స్థానిక పోలీసు విభాగానికి చెందినవారు కావడంతో హెచ్చరించి విడిచిపెట్టామని చెప్పింది. క్షేత్రస్థాయి పరిస్థితులు, స్థానిక గుర్తింపు, బలోచ్ ప్రజల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని వారిని విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది. బలూచ్ నేషనల్ కోర్టు చర్యలకు లోబడి పాకిస్థాన్ సైనిక విభాగానికి చెందిన మిగతా ఏడుగురు తమ కస్టడీలో ఉన్నారని చెప్పింది. పౌరులపై దాడులు, బలవంతపు అపహరణలకు సహకరించడం, ప్రోత్సహించడం, బలూచ్ ప్రజలపై నరమేధంలో పాల్గొనడం వంటి అభియోగాలను వీరు ఎదుర్కొన్నారని బీఎల్ఏ ర్కొంది. విచారణ సమయంలో ఆరోపణలపై నిందితులకు స్పందించడానికి అవకాశం ఇచ్చి, తగిన ఆధారాలను సమర్పించడంతో వారు తమ నేరాలను అంగీకరించినట్టు వాంగ్మూలం ఇచ్చినట్టు వివరించారు. "యుద్ధ సమయాల్లో కూడా నియమాలు, పరస్పర బాధ్యతలు ఉన్నాయని బలూచ్ లిబరేషన్ ఆర్మీ విశ్వసిస్తుంది. ఇప్పుడు నిర్ణయం పాకిస్థాన్ ప్రభుత్వంపై ఆధారపడి ఉంటుంది.. అది ఇప్పుడు తన సైనికుల ప్రాణాలను కాపాడుకోడానికి చర్యలు తీసుకుంటుందా లేదా ఎప్పటిలాగే నిశ్శబ్దం, ఉదాసీనతను అవలంబించి తనవారి ప్రాణాలను ఫణంగా పెడుతుందా?" అని బీఎల్ఏ తన ప్రకటనలో తెలిపింది. ఈ విషయంలో పాకిస్థాన్ ప్రభుత్వానికి ఏడు రోజుల గడువు విధిస్తున్నామని, అప్పటిలోగా ఖైదీల మార్పిడి ఒప్పందానికి అంగీకరించకుంటే వారికి మరణశిక్ష విధిస్తామని హెచ్చరించింది.

## ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పర్యటన ..

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇజ్రాయెల్ పర్యటన పట్ల ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు చాలా ఉత్సాహంగా ఉన్నారు. ప్రధాన అమెరికన్ యూదు సంస్థల అధ్యక్షుల సమావేశంలో ప్రసంగిస్తూ, ఇజ్రాయెల్ ప్రధాని మోడీకి ఘన స్వాగతం పలుకుతానని చెప్పారు. ఈ ఉత్సాహంతో ప్రేక్షకులను ఉద్దేశించి, "వచ్చే వారం ఇక్కడికి ఎవరు వస్తున్నారు? నరేంద్ర మోడీ?" అని అడిగారు.ఇజ్రాయెల్ మరియు భారతదేశం అద్భుతమైన భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయని మరియు సహకారం యొక్క అన్ని అంశాలను చర్చిస్తారని నెతన్యాహు అన్నారు. 1.5 బిలియన్ల జనాభా కలిగిన భారతదేశం ఇజ్రాయెల్‌ను ఎంతో గౌరవిస్తుందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పేర్కొన్నారు. ఈ కారణంగా, ఇజ్రాయెల్ కూడా భారతదేశాన్ని గౌరవిస్తుంది మరియు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి ప్రాధాన్యత ఇస్తుంది. ఈ పర్యటన సందర్భంగా, రక్షణ, సాంకేతికత మరియు ఆర్థిక సహకారానికి సంబంధించిన అనేక ముఖ్యమైన అంశాలపై చర్చించబడుతుందని, ఇది భారతదేశం-ఇజ్రాయెల్ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని నమ్ముతారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఫిబ్రవరి 27-28 తేదీలలో ఇజ్రాయెల్‌ను సందర్శించనున్నారు. ఈ తేదీ ఇంకా అధికారికంగా ధృవీకరించబడనప్పటికీ, ఇది తన మూడవ పదవీకాలంలో ఇజ్రాయెల్‌కు ఆయన చేసిన మొదటి పర్యటన అని నమ్ముతారు. గతంలో, ఆయన 2017లో ఇజ్రాయెల్‌కు చారిత్రాత్మక పర్యటన చేశారు. ఆ పర్యటన రెండు దేశాల మధ్య సంబంధాలలో ఒక ప్రధాన మలుపుగా పరిగణించబడుతుంది, ఎందుకంటే ఆ సమయంలో భారతదేశం-ఇజ్రాయెల్ సంబంధాలు కొత్త వ్యూహాత్మక స్థాయికి చేరుకున్నాయి. రెండు దేశాలు తమ సంబంధాలను మరింతగా పెంచుకునే దిశగా అడుగులు వేస్తున్న సమయంలో మోడీ ఈ సంభావ్య పర్యటన జరగనుంది.ఈ సమావేశంలో ప్రధాని మోదీ మరియు నెతన్యాహు పశ్చిమాసియాలో ప్రస్తుత భద్రతా పరిస్థితి మరియు ప్రపంచ సమస్యలపై కూడా చర్చించనున్నారు. గాజాలో శాంతి ప్రయత్నాలు మరియు ప్రాంతీయ స్థిరత్వాన్ని చర్చిస్తూ ఈ సంవత్సరం ప్రారంభంలో ఇద్దరు నాయకులు చర్చలు జరిపారు. గాజాలో శాంతి ప్రయత్నాలను నెతన్యాహుతో ప్రధాని మోదీ మరోసారి చర్చించవచ్చని భావిస్తున్నారు.

## ఐస్ హాకీ మ్యాచ్‌లో కాల్పుల కలకలం..

**హైదరాబాద్ పెన్ పవర్:** ఐస్ హాకీ మ్యాచ్‌లో గన్ తో వచ్చిన దుండుగుడు కాల్పులకు పాల్పడటంతో ముగ్గురు మృతి చెందారు. ఈ అనూహ్య ఘటన అమెరికాలోని పాతుకెట్ పట్టణంలో గల 'డెన్నిస్ ఎం. లించ్ ఎరీనా' ఐస్ హాకీ స్టేడియంలో చోటుచేసుకుంది. హైస్కూల్ విద్యార్థుల మధ్య ఐస్ హాకీ మ్యాచ్ జరుగుతుండగా, ఒక్కసారిగా గ్యాలరీ నుంచి కాల్పుల శబ్దాలు వినిపించాయి. ఈ ఘటనలో నిందితుడితో సహా ముగ్గురు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం, ఇది ఒక కుటుంబ కలహాల కారణంగా జరిగిన దాడి అని తేలింది. నిందితుడు తన కుటుంబ సభ్యులనే లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. కాల్పులు జరిపిన అనంతరం, నిందితుడు తనను తాను కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన జరిగిన సమయంలో స్టేడియంలో వందలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉండడం తో అందరూ భయాందోళన తో పరుగులు తీశారు. ఈ కాల్పుల ఘటనలో మరణించిన వారిలో నిందితుడి భార్య, ఒక కుమార్తె ఉన్నట్లు కొన్ని అంతర్జాతీయ వార్తా సంస్థలు పేర్కొన్నాయి.

# ఐరాస చీఫ్‌తో ఇరాన్ విదేశాంగ మంత్రి భేటీ

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ సోమవారం జెనీవాలో ఐక్యరాజ్యసమితికి చెందిన అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ డైరెక్టర్ జనరల్ రాఫెల్ గ్రోస్సీతో సమావేశమయ్యారు. ఇరాన్ అణు కార్యక్రమంపై రెండో విడత చర్చలకు ముందు ఈ భేటీ జరిగింది. జెనీవాలో మంగళవారం అమెరికా- ఇరాన్ మధ్య చర్చలు జరగబోతున్నాయి. వీటికి ఒమన్ ఆతిథ్యం ఇస్తోంది. ఈ నేపథ్యంలో ఒమన్ విదేశాంగ మంత్రి బదర్ అల్-బుసైదీని కూడా కలుస్తానని అరాగ్చీ చెప్పారు. న్యాయ సమ్మతమైన, ఇరు పక్షాలకూ సమానంగా ప్రయోజనం కలిగించే ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు జెనీవా వచ్చానని ఆయన తెలిపారు. తమపై అమెరికా నేతృత్వంలో విధించిన అంతర్జాతీయ ఆంక్షలను తొలగించిన పక్షంలో అణు అంశాలపై రాజీకి సిద్ధమేనని ఇరాన్ సంకేతం ఇచ్చిన విషయం తెలిసిందే. అమెరికా-ఇరాన్ మధ్య ఈ నెల 6న జరిగిన తొలి విడత సమావేశానికి కూడా ఒమన్ ఆతిథ్యం ఇచ్చింది. ఇదిలావుండగా రష్యా, ఉక్రెయిన్ అధికారుల మధ్య మంగళ వారం జెనీవాలోనే చర్చలు జరగబోతున్నాయి. ఇవి అమెరికా ఆధ్వర్యంలో జరుగుతాయి.




# 'పరిశ్రమలు' నిర్వచనం కింద ఏం వస్తాయి?



**హైదరాబాద్ పెన్ పవర్:** విద్యా సంస్థలు, ఆస్పత్రులు, ప్రభుత్వ సార్వభౌమాధికార విధులు, దాని సాధనాలు లేదా ఉపకరణాలన్నీ పారిశ్రామిక వివాదాల చట్టం కింద 'పారిశ్రామిక కార్యకలాపాలు' నిర్వచనం కిందకు వస్తాయా రావా అనే అంశాన్ని సుప్రీంకు చెందిన తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం నిర్ణయించనుంది. ఇందుకు సంబంధించిన 2002 నాటి కేసులో మార్చి 17 నుంచి ఈ బెంచ్ విచారణ ప్రారంభించనుంది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ తన పదవీకాలంలో తొలిసారిగా 9మంది జడ్జిలతో కూడిన రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేశారు. బెంగళూరు వాటర్ సప్లై, సూయేజీ బోర్డ్ వర్సెస్ ఎ.రాజప్ప కేసులో 1978లో జస్టిస్ వి.ఆర్.కృష్ణయ్యర్ నేతృత్వంలోని ఏడుగురు న్యాయమూర్తుల బెంచ్ ఇచ్చిన తీర్పుకు సంబంధించి ఈ ప్రస్తావన చేయబడింది. ఈ తీర్పు 'పరిశ్రమ' నిర్వచనాన్ని పారిశ్రామిక వివాదాల చట్టంలో సెక్షన్ 2(జె) కింద విస్తృతం చేసింది. ఆస్పత్రులు, విద్యా సంస్థలు, మున్సిపాలిటీలను కూడా పరిశ్రమల్లోకి చేర్చింది. ఈ నేపథ్యంలో ఏం 'రాష్ట్ర లేదా సార్వభౌమ విధులు' సెక్షన్ 2(జె) కింద పరిశ్రమల నిర్వచనం పరిధిలోకి వస్తాయో వివరణ ఇవ్వాలని 9మంది న్యాయమూర్తులతో కూడిన ప్రతిపాదిత బెంచ్‌ను సుప్రీంకోర్టు కోరింది.

# శశిథరూర్ విదేశాంగ మంత్రి పదవి కోరుకుంటున్నారు: మణిశంకర్



**హైదరాబాద్ పెన్ పవర్:** సీనియర్ కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ మరోసారి సొంత పార్టీ నేతలపై విరుచుకుపడ్డారు. ఎన్డీటీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ. మాజీ కేంద్ర మంత్రులు శశిథరూర్, జైరామ్ రమేశ్, పవన్ ఖేరా సహా పలువురి సీనియర్ నాయకులపై విమర్శలు గుప్పించారు. త్వరలో జరగనున్న కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవదని ఎందుకంటే, కాంగ్రెస్ నాయకులు 'కమ్యూనిస్టులను ద్వేషించే కంటే ఒకరినొకరు ఎక్కువగా ద్వేషించుకుంటారు' అని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై ప్రశంసలు కురిపించిన అయ్యర్.. వచ్చే ఎన్నికల్లో ఆయనే మళ్లీ సీఎం అవుతారని జోస్యం చెప్పారు. ఈ నేపథ్యంలో తాజా వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా పార్టీ అధికార ప్రతినిధి కాదని, ఓ తోలుబొమ్మ అని తీవ్రస్థాయిలో విమర్శించారు. "గత రెండేళ్లుగా నాపై ఆరోపణలు చేస్తూనే ఉన్నాడు.. అధికార ప్రతినిధిగా పవన్ ఖేరాను తప్పించకుంటే ఇప్పుడున్న పరిస్థితిలోనే కాంగ్రెస్ ఉంటుంది" అని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో కేరళ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయవకాశాల గురించి ప్రశ్నించగా.. "ఆ రాష్ట్రంలో పార్టీ విజయం సాధించాలని నేను కోరుకుంటున్నాను.. కానీ కాంగ్రెస్ నాయకుల మధ్య విబేధాల కారణంగా గెలుస్తామని అనుకోను.. కమ్యూనిస్ట్‌లను ద్వేషించే కంటే ఒకరినొకరు తిట్టుకుంటున్నారు" అని పేర్కొన్నారు. ఈ క్రమంలో తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ పై మణిశంకర్ అయ్యర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. థరూర్ పాకిస్థాన్ వ్యతిరేకి అని, విదేశాంగ మంత్రి పదవి కోరకుంటున్నాడని ఆరోపించారు. గతేడాది ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రధాని నరేంద్ర మోదీపై ప్రశంసలు కురిపించిన శశిథరూర్.. పార్టీ అభ్యంతరం చెబుతున్నప్పటికీ పాక్‌పై తీసుకున్న చర్యల గురించి ప్రపంచ దేశాలకు వివరించేందుకు కేంద్రం నియమించిన ప్రతినిధుల బృందంలో ఒకదానికి నాయకత్వం వహించిన సంగతి తెలిసిందే. అలాగే, కాంగ్రెస్ కమ్యూనికేషన్ విభాగం చీఫ్ జైరామ్ రమేశ్ తన పనితీరును ఇలాగే కొనసాగించాలని అన్నారు. ఇటీవల తిరువనంతపురంలో 'విజన్ 2031.. డెవలప్‌మెంట్, డెమొక్రసీ' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో మణిశంకర్ అయ్యర్ పాల్గొన్నారు.

## గాజాకు 5 బిలియన్ డాలర్ల సాయం

**హైదరాబాద్ పెన్ పవర్:** గాజాలో మానవతావాద, పునర్నిర్మాణ యత్నాల కోసం ఐదు బిలియన్ డాలర్లకు పైగా ఆర్థిక సాయం అందించేందుకు 'శాంతి బోర్డు'లోని సభ్యదేశాలు హామీ ఇచ్చాయని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. బోర్డు సభ్యులు తొలిసారిగా వాషింగ్టన్‌లో గురువారం సమావేశమవుతున్న నేపథ్యంలో ట్రంప్ ఈ ప్రకటన చేశారు. ఆ సమావేశంలో సాయంపై ప్రకటన ఉంటుందని ఆయన తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. గాజాలో భద్రత, శాంతి కోసం ఏర్పాటు చేసే అంతర్జాతీయ స్థిరీకరణ దళం, స్థానిక పోలీసింగ్ వ్యవస్థ కోసం వేలాది మంది సిబ్బందిని పంపేందుకు కూడా బోర్డులోని సభ్య దేశాలు అంగీకరించాయని ఆయన తెలియజేశారు. బోర్డు సామర్థ్యం అపరిమితమైనదని ఆయన వ్యాఖ్యానించారు. 'ఈ నెల 19వ తేదీ నేను మరోసారి బోర్డు సభ్యులను కలుస్తాను. ఆ సమావేశంలోనే ఆర్థిక సాయంపై ప్రకటన వెలువడుతుంది' అని ట్రంప్ చెప్పారు. ప్రభుత్వ అధినేతలు సహా 20 దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరవుతారని తెలిపారు. వాషింగ్టన్‌లోని డోనాల్డ్ జే.ట్రంప్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పీస్‌లో సమావేశం జరుగుతుందని అన్నారు. అమెకా విదేశాంగ శాఖ ఇటీవలే యూఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పీస్‌కు అధ్యక్షుడి పేరును చేర్చింది. కాగా శాంతి బోర్డులో 24 మందికి పైగా వ్యవస్థాపక సభ్యులు ఉండగా వారిలో ఎంతమంది సమావేశానికి హాజరవుతారో తెలియడం లేదు. గత వారం శ్వేతసౌధంలో ట్రంప్‌ను కలిసిన ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ఈ భేటీకి రాకపోవచ్చునని తెలుస్తోంది. మధ్యప్రాచ్య దేశాలతో పాటు టర్కీ, ఈజిప్ట్, సౌదీ అరేబియా, ఖతార్, ఇజ్రాయిల్, ఇండోనేషియాలు ఈ బోర్డులో సభ్యులుగా ఉన్నాయి. అయితే అనేక పశ్చిమ దేశాలు దీనికి దూరంగా ఉండడం గమనార్హం. శాంతి బోర్డు స్వభావం, ఉద్దేశంపై యూరప్‌కు చెందిన పలువురు దౌత్యవేత్తలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇది ఐరాస వ్యవస్థకు సమాంతరం అవుతుందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

## బీజేపీ ఎమ్మెల్యే భూకబ్జా బాగోతం

**హైదరాబాద్ పెన్ పవర్:** కాశ్మీరీలు జమ్మూలో జమ్మూ డెవలప్‌మెంట్ అథారిటీ (జేడీఏ) భూములను ఎక్కువగా ఆక్రమిస్తున్నారని ఆరోపించిన బీజేపీ ఎమ్మెల్యే విక్రం రంధావాకు 2021లో జేడీఏ భూకబ్జా ఆరోపణలపై నోటీసులు జారీ చేసినట్టు సమాచారం బయటపడింది. 2021 జులై 19న జేడీఏ ఆయనకు నోటీసు జారీ చేసిందని తెలిసింది. చక్ గణేశు గ్రామంలోని ఖస్రా నంబర్ 211లో ఎనిమిది కనలాల భూమిని ఆక్రమించి స్టోన్ క్రషర్ ప్లాంటు ఏర్పాటు చేశారని ఆరోపించింది. ఈ నోటీసు జమ్మూ అండ్ కాశ్మీర్ పబ్లిక్ ప్రిమైసెస్ (ఎవిక్షన్ ఎవిక్షన్ ఆఫ్ అనాథరైజ్డ్ ఆక్యుపెంట్స్) చట్టం, 1988 ప్రకారం జారీ అయినట్టు సమాచారం. ఇప్పుడిది జమ్మూకాశ్మీర్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే బీజేపీ ఎమ్మెల్యే మాత్రం ఈ ఆరోపణలను ఖండించారు. తన క్రషర్ ప్లాంట్ ఖస్రా నంబర్ 212లో ఉందనీ, జేడీయే భూమిలో ఒక్క అడుగు కూడా తాను ఆక్రమించలేదని చెప్పారు. భూమి సరిహద్దుల వివాదం కారణంగా నోటీసు వచ్చిందనీ, తాను చట్టపరమైన సమాధానం ఇచ్చిన తర్వాత జేడీఏ సంతృప్తి చెందినట్టు తెలిపారు. నోటీసు ఉపసంహరించుకున్నదని చెప్పిన బీజేపీ ఎమ్మెల్యే? ఉపసంహరణ పత్రాన్ని మాత్రం చూపకపోవడం గమనార్హం. కాగా జేడీఏ నోటీసులపై బీజేపీ ఎమ్మెల్యేను అధికార, ఇతర విపక్ష పార్టీల ఎమ్మెల్యేలు, నాయకులు ప్రశ్నిస్తున్నారు. విక్రం రంధావా 2024 అసెంబ్లీ ఎన్నికల్లో బహు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు.

# రాజీనామా చేస్తున్న ఉదయం ప్రకటన.. గంటల్లోనే అసోం పీసీసీ చీఫ్ యూటర్న్




**హైదరాబాద్ పెన్ పవర్:** అసోం పీసీసీ అధ్యక్షుడు భూపేన్ కుమార్ బొరా తన పదవికి, కాంగ్రెస్ పార్టీ రాజీనామా చేసినట్టు సోమవారం ఉదయం ప్రకటించిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ పార్టీతో తన 32 ఏళ్ల అనుబంధం నేటితో ముగిసిపోయిందని, ఆత్మగౌరవాన్ని కాపాడుకోడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన మీడియా ముందు చేసిన ప్రకటన అసోం రాజకీయాల్లో కలకలం రేపింది. త్వరలోనే అసోంలో ఎన్నికలు జరగనుండగా.. ఈ పరిణామం ప్రధాన ప్రతిపక్షాన్ని షాక్‌కు గురిచేసింది. అయితే, కొద్ది గంటల్లోనే ఆయన అసోం సీనియర్ నేత, ఎంపీ గౌరవ్ గొగోయ్‌తో భేటీ అయ్యారు. అనంతరం బోరా మీడియాతో మాట్లాడుతూ.. రాజీనామాపై పునరాలోచనకు ఒక్క రోజు గడువు కోరినట్లు చెప్పారు "రాష్ట్ర కాంగ్రెస్‌లో జరుగుతోన్న చాలా విషయాలు అధిష్ఠానానికి తెలియవు.. దీని గురించి నేను వారికి రాశాను.. ఈ రోజు పార్టీ నాయకులు కలిసి చర్చించారు.. రాజీనామాపై ఆలోచనకు ఒక రోజు గడువు కోరాను.. నా రాజీనామా అంశమై మంగళవారం ఉదయం రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ జితేంద్ర సింగ్‌ను మళ్లీ కలుస్తాను" అని అన్నారు. జితేంద్ర సింగ్ మాట్లాడుతూ... "భూపేర్ బోరా చాలా సీనియర్.. కుటుంబంలో అప్పుడప్పుడు చిన్న చిన్న వివాదాలు సహజం.. కానీ, మా పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఉంటుంది.... ఇతర పార్టీల మాదిరిగా కాదు, అక్కడ ప్రజలు నోరు మూసుకుని ఉండాలి, లేకపోతే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐ వెంటనే రంగంలోకి దిగుతాయి" అని పరోక్షంగా బీజేపీపై విమర్శలు గుప్పించారు. ఎన్నికలకు ముందు ప్రత్యర్థులపై దర్యాప్తు సంస్థలతో బీజేపీ బెదిరింపులకు దిగుతుందని ఆయన ఆరోపించారు.

## మళ్లీ దిగొచ్చిన బంగారం ధర



వివాహాలు, శుభకార్యాల సీజన్ మొదలైన వేళ బంగారం ధరలు ఒక్కసారిగా దిగొస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకున్న పరిణామాల ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో బంగారం, వెండి ధరలు వరుసగా రెండో రోజు కూడా తగ్గుముఖం పట్టాయి. ఇవాళ హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధరపై ఏకంగా రూ.1,530 తగ్గి రూ.1,54,910 వద్ద కొనసాగుతోంది. గడచిన రెండు రోజుల్లో రూ.2,840 మేర ధర తగ్గడం విశేషం. ఇక అభరణాల తయారీలో వినియోగించే 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధరపై రూ.1,400 తగ్గి రూ.1,42,000కు చేరింది. బంగారంతో పాటే వెండి ధర కూడా భారీగా పతనమై కేజీ ధర రూ.2,65,000 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర ఔన్సుకు 5 వేల డాలర్ల మార్కు నుంచి 4,930 డాలర్ల స్థాయికి పడిపోవడంతో దేశీయంగా కూడా ధరలు దిగొచ్చాయి. దానికి తోడు డాలర్ విలువలో మార్పులు కూడా బులియన్ మార్కెట్‌పై ప్రభావం చూపాయి.

## ఎప్‌స్టీన్ ఫైల్స్ ఎఫెక్ట్..
## హయత్ హోటల్స్ ఛైర్మన్ థామస్ ప్రిట్జ్కర్ రాజీనామా




ఎప్‌స్టీన్ ఫైల్స్ ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోన్న విషయం తెలిసిందే. ఇప్పటికే చాలామంది ప్రముఖుల పేర్లు ఇందులో బహిర్గతమయ్యాయి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హయత్ హోటల్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్, బిలియనీర్ థామస్ ప్రిట్జ్కర్ పేరుకు కూడా బయటకు వచ్చింది. దీంతో ఆయన తన పదవికి, బోర్డు సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లుగా ప్రకటించారు. లైంగిక నేరస్థుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో తనకు ఉన్న సంబంధాలపై వస్తున్న వరుస కథనాల నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా జెఫ్రీ ఎప్‌స్టీన్ అతడి గర్ల్‌ఫ్రెండ్ గిస్లైన్ మాక్స్‌వెల్‌తో పరిచయాలు పెంచుకుని తాను తప్పు చేశానని థామస్ ప్రిట్జ్కర్ అంగీకరించారు. 2008లో జెఫ్రీ ఎప్‌స్టీన్ లైంగిక నేరస్థుడిగా నిర్ధారణ అయిన తర్వాత కూడా అతడితో ప్రిట్జ్కర్ ఈ–మెయిల్ ద్వారా సంభాషణలు జరిపినట్లుగా ఇటీవల బయటపడిన 'ఎప్‌స్టీన్ ఫైల్స్'లో వెల్లడైంది. కాగా, జెఫ్రీ ఎప్‌స్టీన్ బాధితురాలైన వర్జీనియా గిఫ్రే 2016లో ఇచ్చిన ఒక డిపాజిషన్‌లో ప్రిట్జ్కర్‌పై సంచలన ఆరోపణలు చేశారు. ఎప్‌స్టీన్ తనను ప్రిట్జ్కర్ వద్దకు పంపించాడని ఆమె పేర్కొన్నారు. అయితే, ఈ లైంగిక వేధింపుల ఆరోపణలను ప్రిట్జ్కర్ మొదటి నుంచీ తీవ్రంగా ఖండిస్తూనే ఉన్నారు. రాజీనామా సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జెఫ్రీ ఎప్‌స్టీన్, మాక్స్‌వెల్ వల్ల బాధితులకు జరిగిన అన్యాయానికి తాను ఎంతగానో విచారిస్తున్నానని అన్నారు. వారితో సంబంధాలు కొనసాగించినందుకు ఎటువంటి సాకులు చెప్పనని పేర్కొన్నారు. హయత్ హోటల్స్ ప్రయోజనాల దృష్ట్యా తాను అన్ని బాధ్యతల నుంచి తప్పుకుంటున్నానని థామస్ ప్రిట్జ్కర్ స్పష్టం చేశారు.

## 'టాటా సన్స్' కీలక నిర్ణయం..




ఎయిరిండియా యాజమాన్యం టాటా సన్స్ కీలక నిర్ణయం తీసుకుంది. సంస్థ ఎదుర్కొంటున్న నియంత్రణ పరమైన అడ్డంకులను అధిగమించేందుకు మాజీ పౌర విమానయాన శాఖ కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఖరోలాను సీనియర్ అడ్వైజర్‌గా నియమించింది. 1988 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అయిన ప్రదీప్ సింగ్ ఖరోలా గతంలో పౌర విమానయాన శాఖ కార్యదర్శిగా పనిచేశారు. అంతేకాకుండా, ఎయిరిండియా ప్రభుత్వ హయాంలో ఉన్నప్పుడు దాని విక్రయ ప్రక్రియలో కీలక పాత్ర పోషించారు. అయితే, ప్రస్తుతం ఎయిరిండియా, విస్తారా ఎయిర్‌లైన్స్ విలీన ప్రక్రియ తుది దశలో ఉంది. ఈ క్రమంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (ఆఉఅం), పౌర విమానయాన శాఖ నుంచి వచ్చే నిబంధనలు, అనుమతులు, వ్యూహాత్మక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడంలో ఖరోలా అనుభవం టాటా గ్రూప్‌కు ఎంతగానో తోడ్పడనుంది. ఎయిరిండియా కార్యకలాపాలను మరింత మెరుగుపరచడం, ప్రభుత్వ విభాగాలతో సమన్వయం పెంచుకోవడంలో ప్రదీప్ సింగ్ ఖరోలా నియామకంలో కీలక కానుంది.

## 'ఎక్స్' సేవల్లో భారీ అంతరాయం..

ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజ ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' (ట్విట్టర్) సేవలు సాయంత్రం ప్రపంచవ్యాప్తంగా స్తంభించింది. భారత్‌తో పాటు అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో వేలాది మంది వినియోగదారులు తీవ్ర సాంకేతిక సమస్యలను ఎదుర్కొన్నారు. యాప్, వెబ్‌సైట్.. రెండింటిలోనూ ఈ అంతరాయం కలగడంతో యూజర్లు గందరగోళానికి గురయ్యారు. ప్రముఖ వెబ్‌సైట్ 'డౌన్‌డెటెక్టర్' గణాంకాల ప్రకారం.. భారత కాలమానం ప్రకారం సాయంత్రం 6:40 గంటల సమయంలో ఈ సమస్య మొదలైంది. కేవలం కొద్ది నిమిషాల్లోనే 25,000కు పైగా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ప్లాట్‌ఫామ్‌ను యాక్సెస్ చేయడంలోనూ, కొత్త పోస్టులను లోడ్ చేయడంలోనూ సమస్యలు తలెత్తుతున్నట్లు వినియోగదారులు ఫిర్యాదు చేశారు. మరికొందరు లాగిన్ క్రెడెన్షియల్స్ పనిచేయడం లేదని పేర్కొన్నారు. అంతరాయానికి గల ఖచ్చితమైన కారణాలు ఇప్పటి వరకు తెలియరాలేదు. సాంకేతిక సమస్యపై 'ఎక్స్' సంస్థ ప్రతినిధుల నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో ఒకేసారి ఈ సమస్య తలెత్తడం చూస్తుంటే, ఇది కేంద్రీకృత సర్వర్ సమస్య అయి ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నట్లు జాతీయ మీడియా చెబుతోంది. 'ఎక్స్' ప్లాట్‌ఫామ్‌కు అంతరాయం కలగడం ఇదే మొదటిసారి కాదు. గత మార్చి 2025 లో కూడా ఇలాగే భారీ స్థాయిలో సేవలు నిలిచిపోయాయి. గతేడాది 2024 నవంబర్‌లో క్లౌడ్‌ఫ్లేర్ సర్వీసుల్లో తలెత్తిన సమస్య వల్ల 'ఎక్స్' సహా పలు వెబ్‌సైట్లు మొరాయించాయి. ప్రస్తుతం సేవలు నెమ్మదిగా పునరుద్ధరించబడిన్నట్లు జాతీయ మీడియా సమాచారం అందుతోంది.

# మూడో నెలలోనూ పెరిగిన టోకు ధరలు



దేశంలో టోకు ధరల ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) వరుసగా మూడో నెలలోనూ పెరిగింది. కేంద్ర పరిశ్రమల శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది జనవరి నెలలో టోకు ద్రవ్యోల్బణం 1.81 శాతానికి చేరింది. ప్రధానంగా ఆహార పదార్థాలు, ఆహారేతర వస్తువులు, తయారీ రంగ ఉత్పత్తుల ధరలు పెరగడమే ఇందుకు కారణమని మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇంతక్రితం డిసెంబర్‌లో డబ్ల్యూపీఐ 0.83 శాతంగా ఉంది. డిసెంబర్‌లో మైనస్ 0.43 శాతంగా ఉన్న ఆహార ద్రవ్యోల్బణం.. జనవరిలో ఒక్కసారిగా 1.55 శాతానికి ఎగబాకింది. ముఖ్యంగా కూరగాయల ధరలు ఎగిసిపడ్డాయి. డిసెంబర్‌లో మైనస్ 3.50 శాతంగా ఉన్న కూరగాయల ధరలు అమాంతం జనవరిలో 6.78 శాతం ప్రియమయ్యాయి. ప్రాథమిక లోహాలు, వస్త్రాలు, ఇతర తయారీ ఉత్పత్తుల ధరలు పెరగడంతో ఈ విభాగంలో ద్రవ్యోల్బణం 1.82 శాతం నుంచి 2.86 శాతానికి పెరిగింది. అహారేతర వస్తువుల ద్రవ్యోల్బణం జనవరిలో అత్యధికంగా 7.58 శాతానికి ఎగిసింది. ఇంతక్రితం నెలలో ఇది కేవలం 2.95 శాతంగా ఉండటం విశేషం. కాగా.. ఇంధనం, విద్యుత్ రంగం సూచీ మాత్రం డిసెంబర్‌లో మైనస్ 2.31 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం జనవరిలో మరింత తగ్గి మైనస్ 4.01 శాతానికి చేరాయి. గత వారం విడుదలైన గణాంకాల ప్రకారం రిటైల్ ద్రవ్యోల్బణం కూడా జనవరిలో స్వల్పంగా పెరిగి 2.75 శాతానికి చేరింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధానంగా రిటైల్ ద్రవ్యోల్బణం ఆధారంగానే వడ్డీ రేట్లను నిర్ణయిస్తుంది. ప్రస్తుతం ధరలు నెమ్మదిగా పెరుగుతున్న నేపథ్యంలో ఈ నెల ప్రారంభంలో జరిగిన సమీక్షలో ఆర్బీఐ కీలక వడ్డీ రేట్లను 5.25 శాతం వద్ద యథాతథంగా కొనసాగించింది. ముందుముందు


ఆహార పదార్థాల ధరలు మరింత పెరిగితే.. ఆర్బీఐ తన పరపతి విధానంలో కఠిన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు.

# భారత్‌లో కొత్త కార్యాలయం ప్రారంభించిన ఆంత్రోపిక్




భారత్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో ప్రపంచ స్థాయిలో ప్రభావం చూపుతూ దేశంలోనే తొలిసారి అంతర్జాతీయ ఏఐ సదస్సు 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్' నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గ్లోబల్ ఏఐ కంపెనీ ఆంత్రోపిక్ బెంగళూరులో తన కొత్త కార్యాలయాన్ని ప్రారంభించింది. అత్యాధునిక టెక్నాలజీ కోసం డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా కార్యకలాపాలను విస్తరించే క్రమంలో ఆంత్రోపిక్ ఈ నిర్ణయం తీసుకుంది. బెంగళూరులోని కార్యాలయం టోక్యో తర్వాత ఆసియా–పసిఫిక్‌లో రెండో కార్యాలయమని చెబుతోంది. భారత మార్కెట్ ఆంత్రోపిక్‌కు రెండో అత్యధిక యాక్టివ్ యూజర్లు ఉన్న ప్రాంతం. కొత్త కార్యాలయం ద్వారా కంపెనీ దేశీయంగా విద్య, వ్యవసాయం, డిజిటల్ సేవలతో పాటు వివిధ రంగాల్లో కార్యకలాపాలను పెంచాలని భావిస్తోంది. భారత మార్కెట్లో సురక్షితమైన, విశ్వాసంతో కూడిన ఏఐ సొల్యూషన్స్ అందించేందుకు పనిచేస్తాం. ముఖ్యంగా బాధ్యతాయుత ఏఐ అభివృద్ధి, వినియోగంపైనే తమ దృష్టి ఉంటుందని, ఏఐ ఉత్పాదకతను పెంచే సాధనంగా మాత్రమే కాకుండా సమాజానికి మేలు చేసేలా ఉపయోగించాలని ఆంత్రోపిక్ పేర్కొంది.

# 2035కు రూ.215 లక్షల కోట్ల రిటెయిల్ విపణి



మన దేశ భారత రిటెయిల్ రంగ విపణి పరిమాణం 2035 నాటికి రూ.210–215 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉందని ఓ నివేదిక తెలిపింది. 2025లోని రూ.90– 95 లక్షల కోట్ల స్థాయితో పోలిస్తే, ఈ విలువ రెట్టింపు కంటే ఎక్కువ. దిగ్గజ అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలకు మించి భారత్ రాణిస్తుండటం, మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశలో సాగుతుండటం ఇందుకు కారణమవుతుందని ఆ నివేదిక వివరించింది. 'రిటెయిల్ లీడర్‌షిప్ సదస్సు– 2026'లో బోస్టన్ కన్సల్టింగ్ గ్రూపు (బీసీజీ), రిటెయిలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (రాయ్) సంయుక్తంగా ఈ నివేదికను విడుదల చేశాయి. మలివిడత వృద్ధి పథంలో భారత రిటెయిల్ రంగం సాగుతోందని నివేదిక తెలిపింది. క్రమశిక్షణతో వ్యూహాల అమలుపై దృష్టి సారించే కంపెనీలు విజయం సాధిస్తాయని, కృత్రిమ మేధ సాంకేతికతను అందిపుచ్చుకోవడమూ ముఖ్యమేనని పేర్కొంది. వినియోగదారులతో సత్సంబంధాలు, కార్యకలాపాల విధానాలు, నైపుణ్యం లాంటి విభాగాల్లో వ్యవస్థాగత మార్పులకు ప్రాధాన్యమిచ్చే రిటెయిల్ సంస్థలు.. అత్యధిక మార్కెట్ వాటా సొంతం చేసుకోగలిగే స్థితిలో ఉంటాయని వివరించింది.

# రష్యా చమురు కొనుగోలు నిలిపేస్తామని భారత్ మాకు హామీ ఇచ్చింది



భారత్–అమెరికా మధ్య ఇటీవలే ఒప్పందం కుదిరిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఈ ఒప్పందం కుదుర్చుకున్నప్పుడు.. భారత్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేయదని అమెరికా చెప్పింది. దీనిపై భారత్ ఎలాంటి ప్రకటన చేయకపోయినా రష్యా మాత్రం భారత్ మాకు ఆ విషయం చెప్పలేదని తేల్చింది. ఆ తర్వాత ఎక్కడి నుంచి భారత్ చమురు కొనుగోలు చేసినా తమకు ఏ ఇబ్బంది లేదని చెప్పింది. ఈక్రమంలోనే అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియో మరోసారి ఈ విషయంపై స్పందించారు. ముఖ్యంగా రష్యా నుంచి చమురు దిగుమతులను నిలిపి వేసేందుకు భారత్ సిద్ధంగా ఉందంటూ తాజాగా ప్రకటించారు. జర్మనీలోని మ్యూనిక్ భద్రతా సదస్సులో ప్రసంగించిన ఆయన.. ఈ విషయంలో ఢిల్లీ నుంచి తమకు స్పష్టమైన హామీ లభించిందని ధృవీకరించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల భారత్ గురించి మాట్లాడుతూ.. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు ఆపివేసేందుకు మోదీ ప్రభుత్వం అంగీకరించిందని ప్రకటించారు. అయితే ఈ ఒప్పందానికి ప్రతిఫలంగా భారత్‌కు అమెరికా బంపర్ ఆఫర్ ప్రకటించింది. భారతీయ ఉత్పత్తులపై గతంలో విధించిన 50 శాతం సుంకాలను 18 శాతానికి తగ్గిస్తూ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. దీంతో భారతీయ ఎగుమతిదారులకు అమెరికా మార్కెట్లో మంచి డిమాండ్ లభిస్తోంది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పటి నుంచి భారత్ తన వైఖరిని స్పష్టంగా చెప్తూ వస్తోంది. తక్కువ ధరకు లభించే రష్యా చమురును కొనుగోలు చేయడం ద్వారా తన దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవడమే తమ ప్రాధాన్యత అని ఢిల్లీ వాదిస్తూ వచ్చింది. అయితే అమెరికాలో ట్రంప్ అధికారంలోకి వచ్చాక సమీకరణాలు వేగంగా మారాయి. అయితే వాణిజ్య యుద్ధం కంటే సహకారం మేలని భావించిన అగ్రరాజ్యం.. చమురు దిగుమతులపై ఆంక్షలు పెట్టేందుకు భారత్‌ను ఒప్పించడంలో సఫలీకృతమైందని రూబియో మాటల ద్వారా అర్థం అవుతోంది. రష్యా చమురును నిలిపివేయడం వల్ల భారత్‌కు కొన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ.. అమెరికా మార్కెట్లో లభించే సుంకాల మినహాయింపు ఆ నష్టాన్ని పూడ్చుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# గోంగూర రొయ్యల ఇగురు.. ఇలా చేసి తింటే ప్లేట్ మొత్తం ఖాళీ చేయాల్సిందే!



రొయ్యలతో ఒకటి కాదు.. ఎన్నోరకాల వైరైటీలను చేసుకుని తినొచ్చు. అయితే, వీటితో చాలా మంది బిర్యానీ, వేపుడును ఎక్కువగా చేసి తింటారు. అయితే, ఈ సారి కొత్తగా గోంగూర రొయ్యల కూరను ట్రై చేసి తినండి. ఒకసారి తింటే అస్సలు వదలరు. ఇంకా దీనిని అన్నంలో కలిపి తింటే అద్భుతంగా ఉంటుంది. ఈ రెసిపీలో వాడే గోంగూర, రొయ్యలను కలిపి తీసుకోవడం వలన మన శరీరానికి కూడా చాలా మంచిది. ఎందుకంటే, ఈ రెండింటిలో కావాల్సిన పోషకాలు ఉన్నాయి. రొయ్యలను వారంలో రెండు సార్లు తీసుకుంటే పోటు వంటి సమస్యలు రాకుండా ఉంటాయి. కావాల్సిన పదార్థాలు: అర కిలో గోంగూర, అర కిలో రొయ్యలు, ఉల్లిపాయ చిన్నది, ఒక టేబుల్ స్పూన్ వెల్లుల్లి పేస్టు, పచ్చిమిర్చి – అర టీ స్పూన్ ధనియాల పొడి, ఒక టేబుల్ స్పూన్ పసుపు, అర టీ స్పూన్ మసాలా పొడి , రుచికి సరి పడినంత ఉప్పు, నూనెను తీసుకోవాలి.ముందుగా రొయ్యలను తీసుకుని శుభ్రంగా కడిగి పెట్టుకోవాలి. ఆ తర్వాత దానిలో పసుపు వేసి మళ్ళీ ఇంకో సారి శుభ్ర పరచండి. ఇక ఇప్పుడు స్టవ్ మీద పాన్ పెట్టి దానిలో నూనె వేసి దానిలో గోంగూర ఆకులు వేసి రంగు మారే వరకు బాగా వేయించాలి. వీటిని ఒక గిన్నెలోకి తీసుకుని గ్రైండ్ చేసుకుని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు మళ్ళీ పాన్ లో నూనె వేసి ఉల్లిపాయలు ముక్కలు వేసి బాగా వేయించాలి. ఆ తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్ కూడా వేసి వేయించాలి. ఇక ఇప్పుడు మీరు తీసుకున్న అన్ని రకాల పొడిని బాగా మిక్స్ చేసి కలపాలి. ఇప్పుడు, ఈ మిశ్రమంలో ముందుగా తీసుకున్న రొయ్యలు వేసి 5 నిమిషాల తర్వాత గోంగూర పేస్టును కూడా బాగా మిక్స్ అయ్యేలా కలపాలి. ఇక ఇప్పుడు గ్రేవీ కోసం అర గ్లాసు నీళ్లు వేసి సన్నని మంట మీద 20 నిముషాలు ఉంచాలి. గ్రేవీగా మారాక కిందకు దించేయండి. అంతే వేడి వేడి గోంగూర రొయ్యల ఇగురు రెడీ.

# బాస్మతి రైస్ వండేటప్పుడు ఈ తప్పులు చెయ్యకూడదు

పండుగల సమయంలో బాస్మతి రైస్ ను మార్కెట్ నుంచి తెచ్చుకుని ఎన్నో వైరైటీలు చేస్తారు. దీనితో ఎక్కువగా బిర్యానీ, పులావ్ చేసుకుని తింటాము. అయితే, వీటిని వండేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించకపోతే గింజలు విరిగిపోతాయి. చివరికి, బాస్మతి బియ్యం అన్నంలాగా మారిపోతాయి. బాస్మతి రైస్ ను మనం రోజు వండుకునే బియ్యం లాగా వీటిని అస్సలు చూడకండి. వీటిని వండే పద్ధతి వేరు అని మర్చిపోకండి. బాస్మతి రైస్ సాధారణ బియ్యం లాగా కాకుండా వీటిని బాగా ఉడకనివ్వాలి. దాని కోసం నీటిని ఎక్కువగా తీసుకోవాలి. నీరు సరిపోను తీసుకోకపోతే బియ్యం సరిగ్గా ఉడకవు. అలాగే, నీరు ఎక్కువైనా కూడా అన్నం మెత్తగా అయిపోతుంది. కాబట్టి, కప్పు బాస్మతి బియ్యానికి 2 కప్పుల నీటిని తీసుకోండి.బియ్యం ఉడికేటప్పుడు గరిటే పెట్టి ఎక్కువ సార్లు తిప్పకండి. అలా చేస్తే అది అన్నంగా లాగా అయిపోతుంది. బియ్యం ఉడికిందా లేదా అనేది చూడటానికి ఒకసారి మాత్రమే తిప్పి ఆ తర్వాత మూత పెట్టేయండి.బాస్మతి బియ్యంలో పిండి పదార్థాం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి, వండే ముందు రెండ సార్లు కడిగితే సరిపోతుంది. అలా అని అదే పనిగా బలం ఉంది కదా అని బియ్యం మీద చూపించి వాటిని ఎక్కువ సార్లు కడగకండి. ఈ బియ్యాన్ని కనీసం 10 నిమిషాలు నానబెట్టాలి. ఇలా చేయడం వలన బియ్యం త్వరగా ఉడుకుతాయి. బియ్యం ఉడికిన వెంటనే కిందకు దించేయండి. కొందరు మంట మీదే అలాగే ఉంచేస్తారు. ఇలా



పొయ్యి మీదే ఉంచడం వలన అన్నం మెత్తగా అయిపోతుంది. కాబట్టి, 10 నిమిషాలు ఉంచి కిందకు దించేసి చికెన్ తో తినేయండి.

# చింతచిగురు చేపల పులుసు..



చింతచిగురు రుచే వేరు. ఎందుకంటే, అది పుల్లగా తినడానికి మంచి రుచిని ఇస్తుంది. దీనితో కూర, పప్పు ఎక్కువగా చేసుకుని తింటారు. అయితే, అందరూ నార్మల్ గా చేసుకుని తింటారు. కానీ, చేపలతో చింతచిగురు తింటే ఆ కిక్కే వేరబ్బా అని అందరూ అనాల్సిందే. చింత చిగురు చేపల పులుసు వినడానికి కొత్తగా ఉన్నా చేసుకుని తింటే రుచి అద్భుతంగా ఉంటుంది. మరి, ఇంకెందుకు లేట్ దానికి కావాల్సిన పదార్థాలు, తయారీ విధానం గురించి ఇక్కడ తెలుసుకుందాం.

స్టెప్ – 1: ముందుగా చేప ముక్కలను తీసుకుని ఉప్పుతో బాగా కడిగి శుభ్ర పరచుకోవాలి. కడిగిన తర్వాత ఇంకా వాసన వస్తే పసుపు, ఉప్పు వేసి మళ్ళీ కలుపుకోండి. ఆ తర్వాత వాటిని ఒక ప్లేట్ లోకి తీసుకుని ఉప్పు, కారం మసాలాలు పట్టించి పక్కన పెట్టుకోవాలి.

స్టెప్ – 2: ఇప్పుడు స్టవ్ వెలిగించి పాన్ లో ఆయిల్ వేసి అది వేడయ్యాక దానిలో జీలకర్ర, కరివేపాకు, ఉల్లిపాయ ముక్కలు వేసి రంగు మారే వరకు దోరగా వేయించాలి. స్టెప్ – 3: ఇప్పుడు చేప ముక్కలను తీసుకుని, దానిలో కొద్దిగా నీళ్ళు పోసి, చింతచిగురును కూడా వేసి, మూత పెట్టి సన్నటి మంటపై ఉడికించాలి. చేప ముక్కలు మెత్తగా ఉడికి, నూనె పైకి తేలే వరకు పొయ్యి మీదే ఉంచి, దింపే ముందు కొత్తిమీరను చల్లుకుంటే మరింత రుచిగా ఉంటుంది. అంతే వేడి వేడి చింతచిగురు చేపల పులుసు రెడీ. చింతచిగురు అన్ని సీజన్లలో ఉండదు కాబట్టి, అది లేనప్పుడు చింతపండు రసంతో కూడా దీనిని చేసుకోవచ్చు. చిన్న చేపలతో ఇలా చేసుకుంటే తినడానికి రుచిగా ఉంటుంది.

# ఇండియన్, వెస్ట్రన్ టాయిలెట్ ఏది బెస్ట్?

సౌకర్యం ముఖ్యం అనుకుని మనం మార్చుకున్న ఒక చిన్న అలవాటు.. మన జీర్ణ వ్యవస్థను నెమ్మదిగా దెబ్బతీస్తోందా..? ఒకప్పుడు ప్రతి ఇంట్లో ఉన్న ఇండియన్ టాయిలెట్ల స్థానాన్ని వెస్ట్రన్ కమోడ్లు ఆక్రమించాయి. ఆధునిక జీవనశైలిలో మన అలవాట్లు మారుతున్నాయి.. మన ఇళ్లు మారుతున్నాయి. ఒకప్పుడు ప్రతి ఇంట్లో కనిపించిన ఇండియన్ టాయిలెట్ స్థానాన్ని ఇప్పుడు వెస్ట్రన్ కమోడ్స్ ఆక్రమించాయి. అయితే ఈ మార్పు సౌకర్యాన్ని ఇస్తున్నప్పటికీ.. మన జీర్ణ వ్యవస్థను దెబ్బతీస్తోందా? ఇటీవల పెరుగుతున్న మలబద్ధకం, పైల్స్ సమస్యలకు టాయిలెట్ భంగిమకు ఏమైనా సంబంధం ఉందా..? భారతీయ శైలిలో మోకాళ్లు వంచి కూర్చోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఈ భంగిమలో కూర్చున్నప్పుడు పురీషనాళం నిటారుగా మారుతుంది. దీనివల్ల మలం ఎటువంటి అవరోధం లేకుండా సులభంగా బయటకు వెళ్తుంది. ఈ పొజిషన్ కటి కండరాలు సమర్థవంతంగా పనిచేయడానికి సహాయపడుతుంది.

ప్రేగులపై అనవసరమైన ఒత్తిడిని తగ్గిస్తుంది. పొట్ట పూర్తిగా ఖాళీ అవ్వడం వల్ల మలబద్ధకం సమస్య దరిచేరదు. వెస్ట్రన్ టాయిలెట్ల మీద కుర్చీలో కూర్చున్నట్లు కూర్చోవడం సౌకర్యంగా ఉన్నప్పటికీ అది కొన్ని సమస్యలకు దారితీయవచ్చు. ఈ భంగిమలో పురీషనాళం కొద్దిగా వంగి ఉంటుంది. దీనివల్ల పేగులను పూర్తిగా ఖాళీ చేయడం శరీరానికి కష్టమవుతుంది.అసంపూర్ణ మలవిసర్జన కాలక్రమేణా మలబద్ధకం, గ్యాస్, మూలవ్యాధుల వంటి సమస్యలకు దారితీస్తుంది. అయితే అందరికీ ఇండియన్ టాయిలెట్లే వాడాలని నియమం లేదు. మోకాళ్ల నొప్పులు, కీళ్ల సమస్యలు ఉన్నవారు లేదా వృద్ధులకు వెస్ట్రన్ టాయిలెట్లు సురక్షితమైనవి.మీరు వెస్ట్రన్ టాయిలెట్ వాడుతున్నట్లయితే, మీ పాదాల

కింద ఒక చిన్న స్టూల్ ఉంచుకోవడం వల్ల మోకాళ్లు పైకి లేచి ఇండియన్ టాయిలెట్ భంగిమ వస్తుంది. ఇది మలవిసర్జనను సులభతరం చేస్తుంది. జంక్ ఫుడ్, శారీరక శ్రమ లేకపోవడం వల్ల ఇప్పటికే జీర్ణ సమస్యలు పెరుగుతున్నాయి. ఇలాంటి సమయంలో సరైన టాయిలెట్ భంగిమను ఎంచుకోవడం వల్ల మీ పేగుల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

# ఇంటిని మెరిపించే చిట్కాలు..



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఇంటిని శుభ్రంగా ఉంచుకోవడం ఒక సవాలుగా మారింది. ముఖ్యంగా వంటింటి అరల్లో చేరే జిడ్డు, తేమ కారణంగా వచ్చే వింత దుర్వాసనలను వదిలించుకోవడానికి బేకింగ్ సోడా అద్భుతంగా పనిచేస్తుంది. కొద్దిగా బేకింగ్ సోడాను నీటిలో కలిపి ఒక స్ప్రే బాటిల్‌లో నింపుకోవాలి. దీనిని అలమరల మూలల్లో క్రమం తప్పకుండా స్ప్రే చేయడం వల్ల బ్యాక్టీరియా చేరకుండా ఉండటమే కాకుండా, మీ వంటిల్లు ఎప్పుడూ తాజా సువాసనతో ఉంటుంది.ఇక బాత్‌రూమ్ విషయానికి వస్తే, షవర్ రంధ్రాలు నీటిలోని ఖనిజ లవణాల వల్ల తరచుగా మూసుకుపోతుంటాయి. దీనివల్ల నీటి ప్రవాహం తగ్గి ఇబ్బంది కలుగుతుంది. ఇలాంటప్పుడు ఖరీదైన కెమికల్స్ వాడకుండా, కేవలం వైట్ వెనిగర్‌తో ఈ సమస్యను పరిష్కరించవచ్చు. షవర్‌ను వెనిగర్‌లో కొద్దిసేపు నానబెట్టడం వల్ల రంధ్రాల్లో పేరుకుపోయిన మొండి వ్యర్థాలు కరిగిపోయి, షవర్ కొత్తదానిలా పని చేయడం మొదలుపెడుతుంది.ఖరీదైన కలపతో చేయించుకున్న ఫర్నిచర్‌కు చెదలు పట్టడం అనేది పెద్ద సమస్య. అయితే దీనికి ఇంట్లోనే ఒక చక్కని మందును తయారు చేసుకోవచ్చు. కర్పూరం పొడి, లిక్విడ్ పారాఫిన్లను సమాన పరిమాణంలో తీసుకుని బాగా కలిపి మిశ్రమంగా చేసుకోవాలి. ఈ లిక్విడ్‌తో ఫర్నిచర్ ఉపరితలాలను, ముఖ్యంగా మూలలను తుడవడం వల్ల చెదలు రాకుండా ఉంటాయి. ఇది మీ ఫర్నిచర్ మెరుపును పెంచడమే కాకుండా దాని మన్నికను కూడా పెంచుతుంది.ఫ్రిజ్‌ను మనం నిత్యం ఆహార పదార్థాల కోసం ఉపయోగిస్తాం కాబట్టి, అందులో రకరకాల వాసనలు రావడం సహజం. ఈ దుర్వాసనలను పోగొట్టడానికి మళ్ళీ మన వంటింట్లో ఉండే వంటసోడా (బేకింగ్ సోడా) సహాయపడుతుంది. కొద్దిగా వంటసోడాను నీళ్లలో కలిపి, ఒక మెత్తని క్లాత్‌తో ఫ్రిజ్ లోపలి భాగాలను తుడవాలి. ఇలా చేయడం వల్ల కేవలం దుర్వాసనలు పోవడమే కాకుండా, లోపల పేరుకుపోయిన జిడ్డు కూడా సులభంగా వదిలిపోతుంది.

# వంటగదిలో మౌనం.. ఆరోగ్యానికి అసలైన ప్రాణం



వంట చేయడం అనేది కేవలం ఆకలి తీర్చుకోవడానికి చేసే పని మాత్రమే కాదు, అది ఒక అద్భుతమైన ధ్యాన ప్రక్రియ. మనం తీసుకునే ఆహారం మన ఆలోచనల మీద ప్రభావం చూపుతుంది కాబట్టి, వంట చేసేటప్పుడు మనసు ప్రశాంతంగా ఉండటం చాలా అవసరం. నిశ్శబ్దంగా, ఏకాగ్రతతో వంట చేయడం వల్ల మనస్సులోని ఒత్తిడి తగ్గి, ఒక రకమైన ప్రశాంతత లభిస్తుంది. అందుకే పూర్వీకులు వంట చేసేటప్పుడు అనవసరమైన మాటలు తగ్గించి, దైవచింతనతో లేదా మౌనంగా ఉండాలని సూచించేవారు.ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో చాలామంది టీవీ చూస్తూనో లేదా ఫోన్ మాట్లాడుతూనో వంట పనులు కానిచ్చేస్తుంటారు. దీనివల్ల వంటపై ఉండాల్సిన ఏకాగ్రత దెబ్బతింటుంది, ఇది అటు శారీరక ఆరోగ్యానికి, ఇటు మానసిక స్థితికి ఏమాత్రం మంచిది కాదు. పరధ్యానంలో వంట చేయడం వల్ల పదార్థాల మోతాదులు మారడమే కాకుండా, ఆ వంటకాల్లో నాణ్యత కూడా లోపించే అవకాశం ఉంది. మౌనంగా ఉండి వంట చేసినప్పుడు మన చేతికి, మెదడుకి మధ్య సరైన సమన్వయం కూదిరి పనిలో వేగం పెరుగుతుంది.వంట చేసే వ్యక్తి ఎంత సంతోషంగా, ప్రశాంతంగా ఉంటే ఆ వంటకాలు అంత రుచికరంగా తయారవుతాయని నిపుణులు నమ్ముతారు. వంట చేసేటప్పుడు మనలో కలిగే సానుకూల భావనలు ఆ ఆహార పదార్థాల ద్వారా కుటుంబ సభ్యులకు అందుతాయి. మౌనం పాటిస్తూ వంట చేయడం వల్ల ఆ పని పట్ల గౌరవం పెరుగుతుంది, తద్వారా వంట వండటం అనేది ఒక భారంగా కాకుండా ఒక కళగా మారుతుంది. ఏకాగ్రతతో వండిన భోజనం రుచిలోనే కాదు, అందించే తృప్తిలో కూడా ప్రత్యేకంగా ఉంటుంది. సంపూర్ణ ఆరోగ్యం కేవలం మనం తినే తిండి మీద మాత్రమే కాదు, ఆ ఆహారాన్ని ఎలా వండాము అనే దానిపై కూడా ఆధారపడి ఉంటుంది. వంటగదిని ఒక పవిత్రమైన స్థలంగా భావించి, అక్కడ ప్రశాంత వాతావరణాన్ని అలవాటు చేసుకోవడం మన జీవనశైలిలో గొప్ప మార్పును తెస్తుంది. ఏకాగ్రతతో వంట చేయడం వల్ల అజాగ్రత్త వల్ల జరిగే ప్రమాదాలను కూడా నివారించవచ్చు. అందుకే రేపటి నుండి మీ వంట గదిలో ఫోన్లను పక్కన పెట్టి, మౌనంగా వంట చేసి ఆ తేడాను మీరే గమనించండి.

# మధుమేహం ఉన్నవారు ఈ పండ్లు తినకూడదు!



పండ్లు పోషకాలతో సమృద్ధిగా ఉంటాయి. ఆరోగ్యకరమైన ఆహారంలో ముఖ్యమైన భాగం. కానీ అన్ని పండ్లు డయాబెటిక్ బాధితులకు మంచివి కావు. ఎందుకంటే.. డయాబెటిస్ అనేది శరీరం గ్లూకోజ్ ను సరిగ్గా ఉపయోగించుకోలేని వ్యాధి. దీనివల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు పెరుగుతాయి. డయాబెటిస్ రోగులు ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఎంచుకోవడం చాలా ముఖ్యం. అందుకే మధుమేహ వ్యాధిగ్రస్తులు అన్ని రకాల పండ్లను తీసుకోరాదు. షుగర్ ఉన్నవారు కొన్ని రకాల పండ్లు తినకపోవడమే మంచిది. అందులో మామిడి పండు కూడా ఒకటి. డయాబెటిస్ ఉన్నవారు మామిడి పండు తినకూడదు. మామిడి విటమిన్ ఎ, సి లకు మంచి మూలం. కానీ ఇందులో అధిక మొత్తంలో చక్కెర ఉంటుంది. అలాగే, అందరికీ అందుబాటులో ఉండే అరటి పండు కూడా మధుమేహులకు ప్రమాదమే. ఎందుకంటే.. అరటి పండులో కూడా షుగర్ పర్సెంట్ ఎక్కువగానే ఉంటుంది. సీతాఫలంలో కూడా చక్కెర శాతం చాలా ఎక్కువగా ఉంటుంది. పైనాపిల్ పండులో కూడా సహజ చక్కెర శాతం ఎక్కువ. ద్రాక్ష కూడ తినకూడదు. వాటిలో సహజ చక్కెరలు చాలా ఎక్కువగా ఉంటాయి.

# టీ20 వరల్డ్ కప్: న్యూజిలాండ్ కూడా సూపర్-8లోకి వచ్చేసింది!

**కెనడాపై 8 వికెట్ల తేడాతో గెలిచి సూపర్-8లోకి ప్రవేశించిన న్యూజిలాండ్**

**కెనడా బ్యాటర్ యువరాజ్ సమ్రా అద్భుత శతకం**

**గ్లెన్ ఫిలిప్స్, రచిన్ రవీంద్ర మెరుపు ఇన్నింగ్స్‌లతో కివీస్ సునాయాస విజయం**

**174 పరుగుల లక్ష్యాన్ని కేవలం 15.1 ఓవర్లలోనే ఛేదించిన న్యూజిలాండ్**



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్‌లో న్యూజిలాండ్ అద్భుత ప్రదర్శనతో సూపర్-8 దశలోకి ప్రవేశించింది. మంగళవారం కెనడాతో జరిగిన మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి తమ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. గ్లెన్ ఫిలిప్స్, రచిన్ రవీంద్ర ఆకాశమే హద్దుగా చెలరేగడంతో కివీస్ సునాయాసంగా గెలుపొందింది.చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన కెనడా తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్ యువరాజ్ సమ్రా (65 బంతుల్లో 110) అద్భుత సెంచరీతో జట్టుకు భారీ స్కోరు అందించాడు. అతనికి కెప్టెన్ దిల్‌ప్రీత్ బాజ్వా (36) నుంచి మంచి సహకారం లభించడంతో కెనడా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది.అనంతరం 174 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. 30 పరుగులకే టిమ్ సీఫెర్ట్ (6), ఫిన్ అలెన్ (21) వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన గ్లెన్ ఫిలిప్స్ (36 బంతుల్లో 76 నాటౌట్), రచిన్ రవీంద్ర (39 బంతుల్లో 59 నాటౌట్) కెనడా బౌలర్లపై విరుచుకుపడ్డారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 146 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పి జట్టును విజయతీరాలకు చేర్చారు. దీంతో న్యూజిలాండ్ కేవలం 15.1 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ విజయంతో కివీస్ జట్టు గ్రూప్-డి నుంచి సూపర్-8కు అర్హత సాధించింది.

ఈ గ్రూప్ నుంచి ఇప్పటికే దక్షిణాఫ్రికా సూపర్-8 చేరడం తెలిసిందే. ఆఫ్ఘనిస్థాన్, యూఏఈ, కెనడా ఎలిమినేట్ అయ్యాయి. టోర్నీలో ఇప్పటివరకు ఆతిథ్య జట్లు టీమిండియా, శ్రీలంకతో పాటు వెస్టిండీస్, ఇంగ్లండ్ కూడా సూపర్-8 బెర్తులు ఖాయం చేసుకున్నాయి. గ్రూప్-ఏలో పాకిస్థాన్.. గ్రూప్-బిలో ఆస్ట్రేలియా... ఈ రెండు జట్ల సూపర్-8 అవకాశాలు ఇతర జట్ల ప్రదర్శనపై ఆధారపడి ఉన్నాయి.

# అభిషేక్ శర్మ.. అభిమన్యుడు కాదు అర్జునుడు అతడు..



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమ్ఇండియా టీ20 స్పెషలిస్ట్ బ్యాటర్ అభిషేక్ శర్మ పేరు చెబితే సునామీ ఇన్నింగ్స్‌లే గుర్తుకువస్తాయి. ప్రత్యర్థి బౌలర్లను అతడు హడలెత్తించే ఊచకోతే జ్ఞప్తికి వస్తుంది. కానీ.. అభిషేక్ శర్మ గత కొన్ని ఇన్నింగ్స్‌లుగా తడబడుతున్నాడు. పొట్టి ప్రపంచకప్‌లో టీమ్ఇండియా ఇప్పటివరకు మూడు మ్యాచ్‌లు ఆడింది. ఉదర సంబంధ సమస్యతో బాధపడిన అభిషేక్.. దిల్లీ వేదికగా నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో పాల్గొనలేదు. అమెరికాతో, పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచుల్లో డకౌట్ అయ్యాడు. అభిషేక్ ఇప్పటివరకు ఈ ప్రపంచకప్‌లో తన పరుగుల ఖాతా తెరవలేదు.

**రిథమ్‌లోనే ఉన్నాడు..కానీ!**

పొట్టి ప్రపంచకప్‌నకు ముందు స్వదేశంలో.. భారత్, న్యూజిలాండ్ మధ్య అయిదు టీ20ల సిరీస్ జరిగిన విషయం తెలిసిందే. దీన్ని 4-1 తేడాతో టీమ్ఇండియా సొంతం చేసుకుంది. మొదటి టీ20లో అభిషేక్ కేవలం 35 బంతుల్లోనే 84 పరుగులు సాధించాడు. రెండో మ్యాచ్‌లో మాత్రం గోల్డెన్ డకౌట్ అయ్యాడు. మూడో టీ20లో మళ్లీ రిథమ్ అందుకున్న అభిషేక్ 20 బంతుల్లోనే 68 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో కేవలం 14 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించాడు. కానీ నాలుగో టీ20లో మళ్లీ గోల్డెన్ డకౌట్ అయ్యాడు. అయిదో మ్యాచ్‌లో దూకుడుగా ఆడి 16 బంతుల్లో 30 పరుగులు చేశాడు.

**చివరి ఏడు ఇన్నింగ్స్‌ల్లో..**

ఇలా అతడు తన చివరి ఏడు ఇన్నింగ్స్‌ల్లో నాలుగు సార్లు డకౌట్లయ్యాడు. అలాగే అందులో రెండు హాఫ్ సెంచరీలున్నాయి. ఇది కాస్త ఆందోళన కలిగించే అంశమే. కానీ అభిషేక్ శర్మకు ఒక్క ఇన్నింగ్స్ చాలు.. తిరిగి గాడిలో పడటానికి. ఇప్పటికే భారత్ సూపర్ 8కి చేరుకుంది. గ్రూప్ స్టేజీలో నామమాత్రమైన నాలుగో మ్యాచ్ నెదర్లాండ్స్‌తో అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియం వేదికగా బుధవారం జరగనుంది. ఈ మ్యాచ్‌లో అభిషేక్ మంచి ఇన్నింగ్స్ ఆడి తిరిగి టచ్‌లోకి రావాల్సిన అవసరం ఉంది.

**బౌలర్లు.. డీ కోడ్ చేశారా?**

అభిషేక్ శర్మను బౌలర్లు డీ కోడ్ చేశారా.. అందుకే వరుసగా ఇలా బ్యాటింగ్‌లో విఫలమవుతున్నాడా.. అని అభిమానులు ఆందోళన చెందుతున్నారు. కానీ అభిషేక్‌ను ఇంకా బౌలర్లు డీ కోడ్ చేయలేదనే పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అతడు మొదటి బంతి నుంచే దూకుడుగా ఆడాలని చూడటం వల్లే కొన్నిసార్లు వికెట్ కోల్పోతున్నాడని వారు విశ్లేషిస్తున్నారు. అభిషేక్ ఒకటి రెండు బంతులు చూసి, తర్వాత నుంచి తన ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాలని సూచిస్తున్నారు. టీమ్ఇండియా మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ సైతం అభిషేక్‌ను తొలి బంతికి సింగిల్ తీయమని సూచిస్తున్నాడు. తర్వాత వేగం పెంచమంటున్నాడు.

సూపర్ 8 ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇకపై అభిషేక్ శర్మ బ్యాట్‌తో రాణించడం టీమ్ఇండియాకు ఎంతో కీలకం. ఈ నేపథ్యంలో అతడు వచ్చీరాగానే నేరుగా టాప్‌గేర్‌లోకి వెళ్లకుండా.. క్రమంగా వేగం పెంచుతూ పరుగుల వరద పారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుత పొట్టి ప్రపంచకప్‌లో.. శ్రీలంక ఓపెనర్ నిశాంక, కెనడా ఓపెనర్ యువరాజ్ సమ్రా సెంచరీలు సాధించిన నేపథ్యంలో ఐసీసీ టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో నం.1 స్థానంలో కొనసాగుతున్న అభిషేక్ శర్మ సైతం సెంచరీ చేస్తే చూడాలని అభిమానులు ఉవ్విళ్లూరుతున్నారు. తాను బౌలర్ల పద్మవ్యూహంలో చిక్కుకునే అభిమన్యుడు కాదని.. దాన్ని ఛేదించే అర్జునుడు అని మరోసారి నిరూపించుకోవాలని వారు ఆకాంక్షిస్తున్నారు.

# టీ20 ప్రపంచకప్ సూపర్ 8... మిగిలిన రెండు బెర్తులు ఎవరికి?




**హైదరాబాద్ పెన్ పవర్:** మరో నాలుగు రోజుల్లో టీ20 ప్రపంచకప్ సూపర్ 8 దశ మొదలవ్వబోతోంది. ఇప్పటికే ఆరు టీమ్‌లు క్వాలిఫై అవ్వగా.. మరో రెండు స్థానాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఏ జట్టుకు ఎంతవరకు అవకాశం ఉందో చూద్దాం.

గ్రూప్ Aలో ఇలా

ఆడిన మూడు మ్యాచులూ గెలిచిన భారత్ ఇప్పటికే సూపర్ 8కి క్వాలిఫై అయింది.

బుధవారం నమీబియాతో జరిగే మ్యాచ్‌లో విజయం సాధిస్తే పాకిస్థాన్ తర్వాత దశకు వెళ్తుంది.

బుధవారం జరిగే మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై నమీబియా విజయం సాధిస్తే యూఎస్ఏ సూపర్ 8కి వెళ్తుంది.

పాకిస్థాన్‌పై గెలిచాక... భారత్‌పై 140ం పరుగులు లేదా 17 ఓవర్లు మిగిలి ఉండగా నమీబియా గెలిస్తే నెదర్లాండ్స్ నెక్స్ట్ ఫేజ్‌కి వెళ్తుంది.

నమీబియా ఇప్పటికే టోర్నీ నుంచి ఎలిమినేట్ అయిపోయింది.

**గ్రూప్ B లెక్క ఇదీ**

గ్రూప్ దశలో మూడుకు మూడు మ్యాచ్‌లు గెలిచిన శ్రీలంక సూపర్ 8కి అర్హత సాధించింది.

ఐర్లాండ్ లేదా శ్రీలంకపై జరిగే మ్యాచుల్లో ఏదో ఒక్క దాంట్లో విజయం సాధించినా జింబాబ్వే తర్వాత దశకు వెళ్తుంది.

ఆస్ట్రేలియా సూపర్ 8కి వెళ్లాలంటే... ఐర్లాండ్, శ్రీలంకతో జరిగే మ్యాచుల్లో జింబాబ్వే ఓడిపోవాలి. ఒమన్‌పై ఆసీస్ నెగ్గాలి. (నెట్ రన్‌రేట్ ఇక్కడ కీలకం)

ఐర్లాండ్, శ్రీలంక తమ తర్వాతి మ్యాచుల్లో జింబాబ్వేను ఓడిస్తే.. ఐర్లాండ్ నెక్స్ట్ ఫేజ్‌కి వెళ్తుంది. (నెట్ రన్‌రేట్ ఇక్కడ కీలకం)

ఒమన్ టోర్నీ నుంచి ఎలిమినేట్ అయిపోయింది.

మంగళవారం జరగాల్సిన ఐర్లాండ్, జింబాబ్వే మ్యాచ్ వర్షం కారణంగా రద్దయితే ఇరు జట్లకు చెరో పాయింట్ వచ్చి.. జింబాబ్వే సూపర్ 8కి వెళ్తుంది.

**తేలిన C, D లెక్కలు**

గ్రూప్ జిలో మూడింట మూడు మ్యాచ్‌లు నెగ్గి వెస్టిండీస్, నాలుగులో మూడు నెగ్గిన ఇంగ్లాండ్ సూపర్ 8కి క్వాలిఫై అయ్యాయి. టోర్నీ నుంచి నేపాల్, ఇటలీ, స్కాట్లాండ్ ఎలిమినేట్ అయ్యాయి.

గ్రూప్ ఐలో మూడు మ్యాచ్‌లూ నెగ్గిన దక్షిణాఫ్రికా సూపర్ 8కి క్వాలిఫై అయింది. నాలుగు మ్యాచుల్లో 3 గెలిచిన న్యూజిలాండ్ తర్వాతి దశకు వెళ్లింది. ఆఫ్ఘనిస్థాన్, యూఏఈ, కెనడా టోర్నీ నుంచి ఎలిమినేట్ అయిపోయాయి.

# అందాలతో ఆకట్టుకుంటున్న ఆయేషా ఖాన్.. స్టైలిష్ ఫోజులతో!

బిగ్ బాస్ 17 ఫేమ్ ఆయేషా ఖాన్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ముఖ్యంగా తన లేటెస్ట్ ఫోటోషూట్‌లతో కుర్రకారు గుండెల్లో మంటలు పుట్టిస్తోంది. మీరు అడిగిన ఇన్‌స్టాగ్రామ్ లింక్‌లో ఆమె ఒక అద్భుతమైన గ్లామరస్ లుక్‌లో మెరిసిపోయారు. ప్రస్తుతం ఆమె తన కెరీర్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్నారు. వివరాలలోకి వెళితే ..

**బ్యూటీ ఆయేషా ఖాన్.. ఫోటోషూట్ విశేషాలు:**

ఆయేషా ఖాన్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న ఈ ఫోటోషూట్‌లో బ్లూ కలర్ శారీలో చాలా స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. ఈ అవుట్‌ఫిట్‌లో ఆమె తన గ్లామర్‌ను సరికొత్తగా ఆవిష్కరించారు. ముఖ్యంగా ఆమె ఇచ్చిన కూల్ ఫోజులు, కళ్ళలో ఉన్న ఇంటెన్సిటీ నెటిజన్లను కట్టిపడేస్తున్నాయి. బ్లూ ఎప్పటికీ ఫ్యాషన్ అనేలా ఆమె ఈ లుక్‌ను క్యారీ చేశారు. ఈ






ఫోటోలకు లక్షల్లో లైకులు మరియు వేలల్లో కామెంట్లు వస్తున్నాయి. ఫ్యాన్స్ ఆమెను గ్లామర్ క్వీన్ అని, బాలీవుడ్ క్వీన్ అని ఆకాశానికెత్తేస్తున్నారు.

**బిగ్ బాస్ నుంచి టాలీవుడ్ :**

ఆయేషా ఖాన్ కెరీర్ బిగ్ బాస్ 17తో ఒక్కసారిగా టర్న్ తీసుకుంది. ఆ షో ఇచ్చిన పాపులారిటీతో ఆమెకు టాలీవుడ్‌లో వరుస ఆఫర్లు క్యూ కట్టాయి. ఇప్పటికే శ్రీవిష్ణు నటించిన ఓం భీమ్ బుష్ లో ఒక ప్రత్యేక పాత్రలో మెరిసిన ఆమె, శర్వానంద్ మనమే సినిమాలో కూడా సందడి చేశారు. ఇక ఆమె దుల్కర్ సల్మాన్ లక్కీ భాస్కర్ సినిమాలో ఒక స్పెషల్ సాంగ్‌లో తన డాన్స్‌తో రచ్చ చేశారు. ఇప్పుడు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ -- బుచ్చిబాబు సనా కాంబినేషన్‌లో రాబోతున్న పెద్ది సినిమాలో కూడా ఆమెకు ఒక క్రేజీ ఆఫర్ వచ్చినట్లు తెలుస్తోంది.

కేవలం సినిమాల్లోనే కాకుండా, సోషల్ మీడియాలో కూడా ఆయేషా యాక్టివ్‌గా ఉంటూ తన ఫాలోవర్లను అలరిస్తోంది. ఇక కెరీర్ పరంగా కూడా చాలా పక్కాగా అడుగులు వేస్తోంది ఈ ముద్దుగుమ్మ రాబోయే రోజుల్లో తెలుగులో మరిన్ని పెద్ద సినిమాల్లో ఆమె కనిపించే అవకాశం ఉంది. గ్లామర్ మరియు నటన రెండూ ఉన్న ఈ బ్యూటీ, టాలీవుడ్‌లో లాంగ్ రన్ కొనసాగించడం ఖాయం అనిపిస్తోంది.

**కావ్య థాపర్ టాలీవుడ్ & కోలీవుడ్ గ్లామర్ క్వీన్**



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965